# తానా పత్రిక

Telugu Association of North America

❖ Volume - 31 ❖ Issue - 1 ❖ January 2024



# We congratulate

# TANA

## on it's
## Successful completion of
# 22nd National Conference

A real estate investment firm that prides itself on expanding your investment portfolio while standing firm on our commitment to grow with you.



ilan™

*Chowdary 'Charlie' Yalamanchili, President*

www.ilaninvestments.com • charlie.yalamanchili@ilaninvestments.com

(281) 444-1585 Phone • (832) 415-0333 Fax

4420 Cypress Creek Parkway • Houston, TX 77068

EQUAL HOUSING OPPORTUNITY

# TELUGU ASSOCIATION OF NORTH AMERICA

**A 501(c)(3) Certified Nonprofit Organization - Tax ID - 36-3060732**

**26233 Taft RD, Novi, MI 48374**

# ఉత్తర అమెరికా తెలుగు సంఘము

**Volume-31 Issue-1**
**January 2024**


***Our Mission***

**"To identify and address social, cultural and educational needs of North American Telugu Community in particular and Telugu people in general"**


*

***Editor***
**Sai Brahmanandam Gorti**
gorthib@gmail.com

***Associate Editor***
**Naveen Vasireddy** (India)
kathanaveen@gmail.com

*

***President***
**Niranjan Srungavarapu**
(248) 342-6872
president@tana.org

***Secretary***
**Sateesh Kumar Vemuri**
(925) 989-4536
secretary@tana.org


***Treasurer***
**Ashok Babu Kolla**
(270) 293-0003
secretary@tana.org

***Joint Secretary***
**Murali Talluri**
2162693227
jointsecretary@tana.org

***Joint Treasurer***
**Bharath Maddineni**
(678) 772-1681
jointtreasurer@tana.org

***Chairman, Board of Directors***
**Dr. Hanumaiah Bandla**
(248) 788-9522
bodchairman@tana.org

The opinions expressed in TANA Patrika belong to the individual authors and do not necessarily reflect those of TANA or the Editorial Board.




ముఖచిత్రం
వడ్డాది పాపయ్య

వేటూరి పాట
33




యండమూరి వీరేంద్రనాథ్
సీరియల్



వెన్నెల్లో ఆడపిల్ల - 3
46

వంశీ - ఏవో కొన్ని
గుర్తుకొస్తున్నాయి



మహర్షి-1
14

## ఇంకా...

Editorial ... 05
TANA President's Message ... 07
TANA Executive Committee ... 08
TAANNAA Board of Directors ... 09
TAANA Foundation ... 10
TANA Foundation Donation Form ... 12
కథ - సముద్రం
- రమణజీవి ... 26

కవిత - సగం సగం నీడలు
- ఆశారాజు ... 32
వేటూరి పాట
- కె.వి.ఎస్. రామారావు ... 33
జ్ఞాపకాలు
ఉప్మా ఏమిటి చెప్మా?
- ఎ. జగన్నాథ శర్మ ... 58
సంక్రాంతి సినిమాలు... విజేత ఎవరు?
- జలపతి & శ్రీ అట్లూరి ... 60





# సంపాదకీయం

తానా పత్రిక పాఠకులకీ అందరికీ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు.

ఈ సాంకేతిక యుగంలో కాలం నడక మర్చిపోయింది. అన్నీ వేగంగా పరిగెడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా గత సంవత్సరంలో వచ్చిన అలజడులూ, యుద్ధాలూ కొనసాగుతూనే ఉన్నాయి. మనం కూడా వాటికి అలవాటు పడిపోయాం. యుద్ధం అంటే-వాటి బాధితులు తప్పించి మిగతా అందరూ తేలిగ్గా తీసుకునే కాలంలో నడుస్తున్నాం. కనీసం ఈ ఏడాదైనా యుద్ధాలూ అవీ సమసిపోయి మామూలు స్థితికి రావాలని ఆశిద్దాం.

ఈ మధ్యనే ప్రముఖ రచయిత శ్రీ తల్లావజ్ఝల పతంజలి శాస్త్రిగారికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం సంతోషకరం. ఈ అవార్డులన్నీ రచయితల సాహిత్య కృషికిచ్చే గౌరవం. అది సరైనవారికీ, అర్హతలున్న వారికీ లభిస్తే ఆ అవార్డులకి విలువ పెరుగుతుంది.

ఈ సంచికలో ఎప్పటిలాగే కథలూ, వ్యాసాలూ వంటి శీర్షికలున్నాయి. మీ స్పందన తెలియజేస్తే రచయితలకీ సంతోషమూ, ఉత్సాహమూ పెరుగుతాయి. మీకు నచ్చిన అంశాల మీద మీ స్పందన తెలియజేస్తే ప్రచురిస్తాము.

అలాగే అమెరికాలో వివిధ రంగాలలో అత్యంత ప్రతిభ చూపిన పిల్లలూ, యువతీ యువకులూ వుంటే మాకు తెలియజేయండి. వీలు వెంబడి వారి గురించి ప్రచురిస్తాం.

అభినందనలతో...
సాయి బ్రహ్మానందం

ఉత్తర అమెరికా తెలుగు సంఘము

# Telugu Association of North America

A 501(c)(3) Certified Nonprofit Organization - Tax ID: 36-3060732

Est. 1977
www.tana.org

# TANA Member Benefits








## Car Rentals

**Enterprise and National Car Rental**
Account # OSMBAQT| Discount upto 10% |Prioirty car rental

**Budget Car Rental:** CDP# V124932 | Discount upto 30% | Unlimited mileage | Free Add on Driver

**Avis Car Rental:** CDP# T326011 | Discount upto 30% | Unlimited mileage | Free Add on Driver

**Dollar Car Rental:** CDP# 3075644 | Discount 7% off Base rates | Free Additional Driver | Unlimited Mileage

**Thrifty Car Rental:** CDP# 3075647 | Discount 7% off Base rates | Free Additional Driver | Unlimited Mileage

## Hotel and Hospitality

**Hyatt Group:** Corporate Code 225686 | 15% Discount on all participating Hyatt Group Hotels

Enter you're the corporate code under Special Rates- Corporate or Group code.

**IHG Group:** Corporate Code 787101128 | 7% Discount on all participating IHG Hotels

**Choice Group:** Corporate Code 00746710 5% Discount on all participating Choice Hotels Group

## Residential Services

**Sherwin Williams:**
Corporate Account# 7901-4243-4
Upto 60% off

**Mattress Firm:** Corporate Account#13081634
Upto 65% off
Please reach out to Ashok Kolla to place order

## Automobile

**Discount Tires:** Corporate Account 63928
10% Discount on All tires
Price match guaranteed.

**Mavis Tires:** Corporate Account 12956
15% Discount on Tires, Brakes & Other Services | Price match guaranteed.

**Jiffy Lube:** Corporate Account 13081634
15% off oil changes

**Valvoline:** Corporate Account P4083246
15% off oil changes, and car services | Tax Exempt

**Take 5:** Corporate Account 172285
25% off on all services | Extra 5% off before 9 AM and afer 5PM
Additional 5% off Ancillary items

**NAPA Autoparts:** Corporate Account 18776
Upto 30% off car parts and accessories
Tax Exempt



**Niranjan Srungavarapu**
TANA, President



**Ashok Babu Kolla**
TANA, Secretary

We believe members are heart for our organization and we will continuously strive to provide more benefits for our members. Should you have any questions regarding this benefits,

**Please feel free to call Ashok Kolla @ 1-270-293-0003**

# President's Message



**NIRANJAN SRUNGAVARAPU**
*President*

ఈ కొత్త సంవత్సరంలో మీ అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆశిస్తున్నాను.

క్రితం ఏడాది తానా తరపున ఎన్నో కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. ఆ ఒరవడినే అనుసరిస్తూ ఈ 2024 సంవత్సరంలో వివిధ నూతన కార్యక్రమాలు చేపట్టబోతున్నాము.

ముఖ్యంగా చారిటీ కార్యక్రమాలు, సెమినార్లు నిర్వహించబోతున్నాము. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు, బాలల కోసం వివిధ పోటీలు నిర్వహించాలని ప్రణాలిక చేస్తున్నాము.

ఇంకా తానా ఫౌండేషన్ ద్వారా కూడా తెలుగు రాష్ట్రాల్లో వివిధ సహాయ కార్యక్రమాలు నిర్వహించబోతున్నాము.

ప్రతీనెలా జరిగే తానా ప్రపంచ సాహిత్య వేదిక నుండి పలు సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలూ, సెమినార్లూ చేయబోతున్నాము. వాటి వివరాలు త్వరలోనే అందజేస్తాము.

ఈ కొత్త సంవత్సరంలో మీరందరూ కుటుంబ సమేతంగా సుఖ సౌఖ్యాల్తో సంతోషంగా ఉండాలని ఆశిస్తూ...

మీ అందరికీ నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు అందజేస్తూ...

మీ
నిరంజన్ శృంగవరపు

# TANA EXECUTIVE COMMITTEE - 2023-2025



**Niranjan Srungavarapu**
*President*



**Sateesh Kumar Vemuri**
*Secretary*



**Ashok Babu Kolla**
*Treasurer*



**Murali Talluri**
*Joint Secretary*



**Bharath Maddineni**
*Joint Trerasurer*

# TANA BOARD OF DIRECTORS - 2023-2025

Our Youth are Our Heritage
Est. 1977
www.tana.org



**Dr. Hanumaiah Bandla**
*Chairman*



**Murali Vennam**
*Secretary*



**Lakshmi Devineni**
*Treasurer*




**Janardhan Nimmalapudi**
*Director (Non-Donor)*



**Srinivas Lavu**
*Director*



**Dr. Chowdary Jampala**
*Director*



**Dr. Nagendra Srinivas Kodali**
*Director*



**Niranjan Srungavarapu**
*Ex Officio Member*
*President, EC*



**Anjaiah Chowdary Lavu**
*Ex Officio Member*
*Past President, EC*




**Jayasekhar Talluri**
*Ex Officio Member*



**Sateesh Kumar Vemuri**
*Ex-Officio Member*
*Secretary, EC*




**Ashok Babu Kolla**
*Ex-Officio Member*
*Treasurer, EC*



**Venkataramana Yarlagadda**
*Ex Officio Member*



**Sasikanth Vallepalli**
*Ex Officio Member*
*Chairman, TANA Foundation*



**Srikanth Polavarapu**
*Ex-Officio Member*
*Treasurer, TANA Foundation*


# TANA FOUNDATION - 2023-2025



**Niranjan Srungavarapu**
*President*



**Sasikanth Vallepalli**
*Secretary*



**Srikanth Polavarapu**
*Treasurer*



**Vinaykumar Maddineni**
*Trustee (Non Donor)*



**Vidyadhar Garapati**
*Trustee*



**Kiran Gogineni**
*Trustee (Non Donor)*



**Purushotham Chowdary Gude**
*Trustee (Non Donor)*



**Srinivas Oruganti**
*Trustee (Non Donor)*

WWW.TECHINSURANCEINC.COM

# YOUR EMPLOYEES HEALTH OUR PROMISE



**HEALTH INSURANCE FOR IT COMPANIES**

**BUSINESS INSURANCE**

**VISITORS INSURANCE**



**MURALI TALLURI**
FOUNDER
+1 (512) 917 - 8686
murali@techinsuranceinc.com

TECH INSURANCE AGENCY
EMPLOYEE BENEFITS & BUSINESS INSURANCE

(512) 917-8686
Fax:1-512-829-3488

Contact us:3000 Polar Ln, Unit#802
Cedar Park ,TX,78613

# TANA FOUNDATION

*Division of Telugu Association of North America (TANA)*
*A not-for profit organization, Tax ID 36-3060732*

***To Donate or pledge please visit www.tana.org/donate or www.tanafoundation.org/donation or mail this form***

***We make a living by what we get; we make a life by what we give.***

## TANA FOUNDATION DONATION FORM

Name (First, Last): ______________________________

Address: ______________________________

Email Address:______________________ Phone:______________

I would like to sponsor the following:

- Orphanages: US$__________
- Vaaradhi US$__________
- Scholarships ($250 each): US$__________
- Eye Camp ($600)
  (Requires filling the sponsorship form on the web): US$__________
- Cancer Camp ($1500 each): US$__________
- Cleft Lip Surgeries ($250 each): US$__________
- Libraries ($500 each): US$__________
- Other (Specify) ________________ US$__________

Frequency (Check one) : ☐ One time ☐ Monthly ☐ Yearly

Check Number: ______________ (Payable to TANA Foundation)

Credit Card Number: ______________________________

Billing Address: ______________________________

CV Code: __________

*Please mail the completed form to:*

**TANA Foundation**
**Treasurer**
26233 Taft Road,
Novi, MI 48374.

***For any questions or comments, please send an email to jaytalluri@gmail.com***

# ONE OF A KIND, WORLD-CLASS
## VILLA PROJECT AT THE MOST EMERGING
## LOCATION, KAPULUPPADA, VISAKHAPATNAM.

**JUST 7 KMS FROM IT HUB**



**₹3.1 cr* onwards**

Possession by **April 2024**

62 High-end villas

Villas ranging from 4,002 sq. ft. to 7,435 sq. ft.

11 Acres, 73% Green & open spaces

Tennis, Basket ball, Shuttle courts & Cricket pitch

32,000 sq. ft. clubhouse

Play areas & Outdoor fitness station

*T&C Apply

Scan the code to download our brochure

For more details contact

**+91 96903 88888**

Kapuluppada, Visakhapatnam

Contact@villaasam.com

Visit www.villaasam.com

VILLAASAM BY AUGMENTED REALTY




వచ్చిన ప్రతి కుర్రోడ్నీ నిలబెట్టి ఆ స్టిల్స్ సత్యం ఫోటోలు తీస్తుంటే అసిస్టెంటు డైరెక్టర్లు వాళ్ల అడ్రసులు రాసుకున్నాక, "మరి వచ్చిన పనయిపోయింది గాబట్టి బయల్దేరండి," అంటున్నాడా ప్రొడక్షన్ మేనేజర్ స్వామి.

ఇదిలా జరుగుతుండగా గేటు దగ్గర ఆగిన ఆ కారులోంచి దిగి లోపలికొస్తున్న మనిషిని చూసిన నాకు ఒకటే కంగారు మొదలైంది.

మా గురువు భారతీరాజా. ఎదురెళ్లి నమస్కారం పెడితే ప్రేమగా నా భుజమ్మీద చెయ్యేసినాయన, "మొన్న నాకు చూపించినా లేడీస్ టైలర్ మంచి హిట్టంటగదా?" అన్నారు.

ఔనన్నట్టు తలూపి ఇదేవాళ్లాఫీసన్నాను.

"తెల్సు," అని నవ్వి నాలుగు ముక్కలు మాటాడేకా ఫస్ట్ ఫ్లోర్లో వుంటున్నా ఆ నిళల్‌గళ్ హీరోయిన్ ఇంట్లోకెళ్లిపోయేరాయన.

ఫోటోల కార్యక్రమం జరుగుతానే ఉంది.

సాయంత్రం నాలుగు దాటుతున్న టైములో నిర్మాతల్లో ఒకరైన శాయిబాబుగారి దగ్గరకెళ్లి, "అలా బీచ్ దాకా వెళ్లొద్దామాండీ," అంటే సరే పదమన్నాడాయన.

*

తల్లెలాగుంటుందో తెలీకండా పెరిగిన మనిషయిన ఆ మహర్షిని ఏ మాత్రం పట్టించుకోకుండా డబ్బు సంపాదనలో పడిపోయున్నాడా తండ్రి. అందుకేనేమో పెరుగుతున్న అతని చుట్టూ రకరకాల స్నేహితులు. వాళ్ల మధ్య రమణలాంటి మందలించే ఒకటీ అరా స్నేహితులున్నా ఈ అలగా జనాలెక్కువవడం ఒక కారణం. పేరుకేదో కాలేజీలో చదువుతున్నా విలాసాల్తో, వినోదాల్తో ఏ బెదురూ అదురూ లేకుండా తన మాటకే ఎదురూ లేదన్నట్టు పెరుగుతున్నాడా మహర్షి.

ప్రేమ అన్నది జనరల్‌గా తొలిచూపులోనో ఆ చూపు తర్వాత జరిగే ఒక ఇన్సిడెంటులోంచో పుడతా వస్తుంది. కానీ ఇక్కడ మహర్షి విషయంలో ఆ సుచిత్ర చెంపదెబ్బ కొట్టింతర్వాత పుట్టింది. ఇంతవరకూ తన మీద ఎవరూ చెయ్యని సాహసం ఆ మనిషి చేసి నందుకు రివర్సవ్వాల్సింది పోయి, ఇంకోలాగ అర్థం చేసుకుని జీవితంలో ఎవరూ లేని తనకి ఆ మనిషి తోడుంటే అద్భుతం కదా అన్న ఫీలింగ్‌లోకెళ్లిపోయేడు. అక్కడ్నించి చిన్న మొలకలా పుట్టినా ప్రేమ మర్రిచెట్టం తయిపోయింది.

తనలో పురి విప్పిన ఈ ప్రేమని ఆ సుచిత్రకి సున్నితంగా తెలీజెయ్యడం చేతగాలేదా మహర్షికి. పొగరూ పట్టుదలా అడ్డంగా నిలవడంతో ఆ ప్రేమ విపరీతమైన పొసెసివ్‌నెస్‌గా మారింది. ఓడిపోడం లోంచి పట్టుదలా, పొగరూ పెరిగినియ్యి. ఈ వైవిధ్యాల కోణాల్తో ఉన్న ఆ మనిషి వ్యక్తిత్వం చుట్టూ అల్లుకున్న ప్రేమకథ ఈ మహర్షి.

'ప్రేమలో జాలి అనేది ప్రవేశించనేకూడదు. నువ్వు చూపిన కఠినత్వానికి కృతజ్ఞుడ్ని. నీ ధైర్యంతో, పట్టుదలతో, స్వేచ్ఛాశక్తితో నన్నూ నా అల్పవాంఛల్నీ నా మీన్ ప్రేయర్స్‌ని తోసిపుచ్చి మన ప్రేమని ఉన్నత మైన ప్లేస్‌లో నిలుపుతున్నావు...' అని నేను ప్రేమించే చలంగారు చెప్పిన మాటలు... మహర్షి గురించి ఎప్పుడు ఆలోచించినా తెగ తిరుగుతున్నాయి లోప ల్లోపల.

నేను సైలెంట్‌గా ఆలోచనల్లో ఉండడాన్ని చూస్తా, "బీచ్‌కి తీసుకొచ్చి అలా సైలెంటయిపోయే రేంటీ?" అన్నాడా మారుతీ వేన్ నడుపుతున్న శాయి బాబుగారు.

"రైటర్‌గారు పేపర్ మీద పెట్టిచ్చిన మహర్షి కేరెక్టర్ని జ్ఞాపకం చేసుకుంటున్నానండీ," అన్నాను.

"మీకు తెల్సుగదా ఆ కేరెక్టరూ?"

"తెల్సినా మళ్లీ మళ్లీ తల్చుకోవాలి. ఎందుకంటే ఆఫీసుకొస్తున్న రకరకాల కొత్త కుర్రాళ్ల మీద ఈ కేరెక్టర్ని అతికించి చూసుకోవాలి గదా?" అంటుంటే కరెక్టే అన్నట్టు తలూపుతా నడుపుతున్నాడా శాయిబాబు గారు.

ప్రేమలేఖల్లో చలంగారు చెప్పిన వాక్యాల్లో ఉన్నంత డెప్త్ తేవాల్సిన కేరెక్టరిది. ఆయన వాక్యాలే గుర్తుకొస్తున్నాయి నాకు.

'నా హృదయంలోని ఈ ఆవేదన, నీవులేని శూన్యాన్ని నీకెట్లా తెలియజెయ్యను? నీకు సంతోషాన్ని కలిగించడం నాచేతకాదు. బాధతోనన్నా నీకు నన్ను జ్ఞాపకానికి తెప్పిస్తాను...'

ఈ అక్షరాలే మనిషైతే మహర్షి అయినట్టుంది. ప్రేమలేఖల్లోనే చివర ఆయన రాసినట్టుగానే మహర్షి ఆలోచిస్తాడిలా. 'నీ మీద ప్రేమ ఈ కళ్లలో వెలుగు తున్నంతసేపూ నేను కవచధారిని. అజేయుణ్ని.'

మా వేన్ బీచ్‌కి దాదాపుగా దగ్గరైంది. ఆలోచన ల్లోంచి బైటకొచ్చేను.

"అంతా బానేవుందిగానీ, హీరో వేషం వేసే మనిషే నాకు సరిగా అనిపించడం లేదండీ. అందుకే ఆ కేరెక్టర్ని రకరకాలుగా రికలెక్ట్ చేసుకుంటూ కథా రచయితని కూడా సరదాగా రాసిమ్మన్నాను." చెప్పింది మళ్లీ చెప్పేను.

"ఇలాంటి కేరెక్టర్‌కి ఏక్టర్ని ఫైనలైజ్ చెయ్యడం కష్టమే కదా?" అన్నారు శాయిబాబుగారు.

"కష్టమేగానీ ఒకోసారి భలే దొరికేస్తారు. ఉదా హరణకి నేను చూసిందొకటి మీకు చెపుతానిప్పుడు. ఇప్పుడు మనలాగే శంకరశాస్త్రి వేషానికి ఎవరా అని విశ్వనాథ్‌గారు కిందా మీదా పడ్తుంటే డిప్యూటీ కలెక్టరుగా జాబు చేస్తున్న ఏడిద నాగేశ్వర్రావుగారి నాటకాల ఫ్రెండ్ అయిన జె.వి. సోమయాజులు గార్నిలా చూపించేరో లేదో అలా ఓకే అయిపోయేరు. ఆ సాయంత్రమే విజయా గార్డెన్స్‌లో గెటప్ టెస్ట్‌లూ అవీ చేసెయ్యడం జరిగిపోయింది," అంటా దూరంగా ఎక్కడో ఉన్న షిప్‌ని చూస్తున్నాను.

"ఆ శంకరశాస్త్రి కేరెక్టర్‌కి దొరికినట్టు ఏక్సి డెంటల్‌గా మనకీ దొరికితే పర్లేదుగానీ లేకపోతే చాలా అవస్థలు శాయిబాబుగారూ..." అంటుంటే నిజమే

అన్నట్టు ఆయన కూడా దూరంగా వెళ్తున్న ఆ ఫాగ్‌లో ఒడనే చూస్తున్నారు.

"మాతా హరి కథని సినిమాగా చేస్తే ఆ కేరెక్టర్ చేసే ఆర్టిస్టుని వెతకడం కోసం ఎన్ని అవస్థలు పడాలో తెల్సా శాయిబాబుగారూ.." అన్నాను.

"మాతా హరి ఎవరు?" అడిగేరాయన.

"పందొమ్మిది వందల పదిహేడులో చంపబడ్డ ఒక జర్మన్ లేడీ డిటెక్టివ్."

"జర్మన్ మనిషికి ఈ ఇండియన్ నేమేంటీ?"

"గమ్మత్తైన రాజకీయ కథలో ఆమె ఒక సెక్సీ రాణి..."

"సరదాగా అంటూ ఈ బీచ్‌కి లాక్కొచ్చేరు గదా? ఆ మతా హరి గురించి కాస్త వివరంగా చెప్పండి," అన్నారు.

"మాతా హరి అసలు పేరు మార్గరెట్ జెల్లీ. దాదాపు దిగంబరంగా చేసే ఆమె నృత్యాలకి యూరప్ దేశాల్లో జనం పడిచచ్చిపోయేవారు. ఒక రాత్రికి లక్ష రూపాయలు వసూలు చేసే ఆ మనిషి మిలటరీ ఆఫీసర్ల దగ్గరేం తీసుకునేదికాదు. ఫ్రెంచి, జర్మన్, రష్యన్ సైనికాధికార్ల చుట్టూ తిరుగుతా వుండే ఆ మాతా హరి వేశ్య కాదని జర్మన్ దేశం గూఢచారని తేలింది. కోర్టు ఆ మనిషికి మరణశిక్ష విధించేటప్పటికి ఏ మాత్రం జంకని ఆ మాతా హరి తన కళ్లకి గంతలు కట్టకుండానే చంపమని కోరింది. అలాగే చేసేరు.




శవాన్ని తీసుకెళ్లడానికెవరూ రాకపోతే ఆ డెడ్‌బాడీని మెడికల్ కాలేజీకి పంపించేసేరు."

అంతా విన్న శాయిబాబుగారు, "ఇది జరిగిం దెప్పుడూ?" అన్నారు.

"1917."

"ఇది సినిమా తీసి ఉంటారే..."

"తీసేరు. 1931లో వచ్చింది. ఇప్పుడసలు విషయానికొస్తున్నాను. అందాల ఆ మాతా హరి కేరెక్టరేసే ఆర్టిస్టు కోసం ఎంత కష్టపడ్డారో... గానీ చివరికి గ్రేటా గార్బో చేసిందనుకోండి."

"మరి మన కథ దగ్గరకొస్తే ఆ రాఘవ ఎంత వరకూ కరెక్టంటారూ?"

"అది యూత్‌ని చాలా గట్టిగా పట్టుకునే కేరెక్టరండీ. చాలామంది కుర్రోళ్లు ఐడెంటిఫై చేసుకుంటారు." అని నేనన్న కాసేపటికి చీకటిపడింది. మెరీనా బీచ్ జనాల్తో సందడే సందడి. సుండలూ, జంతికల్లాంటివి అమ్మే కుర్రోళ్లు కలతిరుగుతుంటే ఆళ్ల మధ్యలో నడుస్తున్నాం. కాళ్లు ఇసకలో కూరుకు పోతుండడంతో సరిగ్గా పడడంలేదు అడుగులు. ఆ ఎఐఎల్ 5656 మారుతీవేన్ ఎక్కేక మరి బయల్దేరేం.

❇

హరిత చిత్ర కేషియరైన శేషయ్య ఫోన్ చేసి, "మొన్న మీకు చెప్పిన నెల్లూరు ప్రొడ్యూసర్లు సిటీలో కొచ్చేరు. కలుద్దాం అంటే మీరు చెప్పిన ప్లేస్‌కి తీసుకొస్తాను " అన్నాడు.

"నేనిప్పుడు ఆళ్వార్‌పేటలో వున్న స్రవంతీ మూవీస్ ఆఫీసులో ఉన్నాను," అన్నాను.

"సాయంత్రందాకా ఉంటారా?" అడిగేడు.

"మధ్యాన్నందాకా అయితే గ్యారంటీ," అన్నాను.

"వెంటనే బయల్దేరి వస్తున్నాం," అని ఫోన్ పెట్టేసేడా శేషయ్య.

వేషాల కోసం వస్తున్న ఆ జనాల్లో తమిళవాళ్లు కూడా ఉన్నారు.

ప్రొడ్యూసర్‌గారి గదిలోంచి బయటికొచ్చిన నేను హాల్లో వున్నా జనాల మధ్యలోంచి నడుస్తా స్టోరీ సిట్టింగ్

రూమ్‌లోకెళ్లేను. సుచిత్ర భర్తయిన ఆ పోలీస్ ఇనస్పెక్టర్ వేషానికి నిన్నొచ్చిన ఆ కైకవోలు కృష్ణబాబు బానే వుంటాడు అనుకుంటుంటే అక్కడే ఉన్న భరణి, "హీరో ఫ్రెండ్ రమణ వేషానికి మా ఫ్రెండ్ సీవీఎల్ నరసింహారావు బావుంటాడనిపిస్తుంది..." అన్నాడు.

"ఎక్కడుంటాడాయన?"

"హైదరాబాదులో... లాయర్."

"సరే రమ్మనండి చూద్దాం," అంటా వుండగా ఇద్దరు వయసులో వున్న కుర్రాళ్లతో ఆ శేషయ్య వచ్చే టప్పటికి లేచి బయటకెళ్లిపోయేడా భరణిగారు

నేనీళ్లతో మాటాడ్తున్నానుగానీ మహర్షి గురించి, ఆ కేరక్టరేసే ఆర్టిస్టు గురించి బాగా ఆలోచన్లు తిరుగు తున్నాయి. 'నన్ను మర్చిపోవద్దు సర్వకాల సర్వావస్థ ల్లోనూ నిన్నే అన్వేషిస్తున్నానని జ్ఞాపకం చెయ్యడమే ప్రేమలేఖ,' అన్న చలంగారి మాటల్లో ఉన్నంతగా ఒక అందమైన ప్రేమలేఖలాగుండాలీ మహర్షి.

ఈ ఆలోచన్ల మధ్యనించి ఆళ్లిద్దరూ వచ్చేరు.

"వీరు విజయకుమార్ రెడ్డి. వీరు రమేష్ రెడ్డి. ఇద్దరూ డాక్టర్లే," అంటా పరిచయం చేసేడు శేషయ్య.

ఆ మొదటిచూపులోనే వాళ్ల మీద చాలా గౌరవం పెరిగిన నేను, "ప్రాక్టీసు ఎక్కడండీ నెల్లూరా?" అన్నాను

నవ్వేసినా విజయకుమార్ రెడ్డి, "ఎక్కడా లేదండి. నెల్లూరు అవతల బుచ్చిరెడ్డిపాళెంలో ఉన్న మా పొలం చూసుకోవడమే," అంటా నవ్వేరు.

వచ్చిన టీలు తాగేసేకా, "చెప్పండి," అన్నాను.

లక్షరూపాయిల కేష్ నా చేతికిచ్చిన రమేష్‌రెడ్డి గారు, "ఒకసారి లెక్కపెట్టండి," అన్నారు.

న్యూస్‌పేపర్‌తో కట్టినా పొట్లాన్ని పరుపుమీద పెట్టిన నేను, "*శ్రీ కనకమాలక్ష్మీ రికార్డింగ్ డేన్స్ ట్రూప్...* రాజమండ్రి అని పేరు పెట్టిన కథ ఒకటుంది నా దగ్గర. అది మీకు చెపుదామనుకుంటున్నాను," అన్నాను.

నవ్విన విజయకుమార్ రెడ్డిగారు, "మాకే కథా చెప్పక్కర్లేదు. ఇళయరాజా మ్యూజిక్‌తో మాకో సినిమా తియ్యండి. అంతే," అన్నారు.

"ఇంతకుముందే సినిమా చెయ్యలేదుగదా మీరు?"

"లేదు," అన్నారు విజయ్‌కుమార్ రెడ్డి.

"సినిమా చూడ్డం తప్ప ఇంకేం తెలీదు," అన్నారు కిశోర్‌రెడ్డి.

కాసేపు మాటాడేకా బయల్దేరబోన్నాళ్లకి ఈ స్రవంతీ మూవీస్ ప్రొడ్యూసర్ రవికిశోర్‌గార్నీ పరిచయం చేసేకా, బయల్దేరేరాళ్లు.

వాళ్లని సాగనంపి వెనక్కొచ్చిన నేను మూల కుర్చీలో కూర్చుని వున్న భరణిగార్ని లోపలికి పిల్చి, "వీళ్లలో హీరో ఫ్రెండ్స్‌ని ఏరొచ్చుగదా మనం?" అన్నాను.

"ఇద్దరు ముగ్గురు కనిపించేరు అలాంటోళ్లు," అనా భరణి అంటుంటే, "నమస్కారం సార్," అంటా దిగేడు మల్లికార్జునరావు.

అతనేం అడక్కుండానే, "ఈ సినిమాలో అంతా కొత్తోళ్లయ్యా. పాత ముఖం ఒక్కటి కూడా కనపడకూడ దనుకుంటున్నాం," అన్నాను.

ఏం ఫీలవ్వకుండా నవ్వేసినా మల్లికార్జునరావు, "సెంటిమెంటుకి చిన్న క్లోజ్‌షాటైనా...?" అన్నాడు.

"పరిస్థితుల్నిబట్టి చూద్దాంలే వెళ్లు..." అంటే నవ్వేసి, "మరి శలవు," అంటా బయల్దేరిపోయేడు.

స్నేహితుల గురించి కూడా ఎక్కడో ప్రస్తావన తెచ్చేరు చలంగారు ప్రేమలేఖల్లోనే.

'నువ్వు తప్ప నాకింక ప్రపంచం లేకుండా చేసు కోవడం వల్ల దేనిలోనూ ఆసక్తి లేకుండా యింక యే మిత్రుల మీద అనురాగానికీ స్థలం లేకుండా కావడం వల్ల నేను ఏకాన్నికైనాను...' అని ఆయన అన్నట్టుగానే ఒక్కడూ అయిపోయినా మహర్షి ప్రతి క్షణం సుచిత్రని కొత్తరకంగా ప్రేమిస్తా ఉంటాడు. అది ఆర్టిస్టు తీసుకు రావాలి.

అలా ఆలోచిస్తా బెడ్‌మీద కూర్చుని తక్కిన జనాలవేపు తిరిగిన నేను, "కేరెక్టర్‌కి కరెక్టుగా సూటయ్యే మనుషులొకోసారి భలే దొరుకుతారు. ఓ సీత కథ సినిమాలో ఆ గోపాలకృష్ణ వేషానికి దేవదాస్



# శంకరాభరణం సోమయాజులు



గారు చూడు ఎంత బాగా కుదిరారో," అన్నాను.

"అంతకుముందాయన కాలం మారింది సినిమాలో ఒక సీను వేషం చేసేరు," అన్నాడు హరి అనుమోలు.

"అవును. అది కూడా కేరెక్టర్‌కి అతుక్కుపోయే వేషమే. అసలుకొస్తే ఆ దేవదాస్ కనకాలగారికి ఫేన్ని నేను," అన్నాను.

"అందుకేగదా నువ్వు చేస్తున్న సినిమాల్లో వేషాలకి పిలుస్తున్నావాయన్ని," అన్నారు సత్యంగారు.

"ఇంకో ఆర్టిస్టుకి కూడా ఫేన్నే. ఆయనెవరంటే కన్నెవయసు సినిమాలో చేసిన ప్రసాద్. సరైన అవకాశాలు రాడంలేదుగానీ చాలా మంచి ఆర్టిస్టు అతను.,." అన్నాను.

"కొన్ని కొన్ని భలే చిత్రంగా జరుగుతుంటాయి. ఒక అమ్మాయిని చూసి పనికిరాదని పంపించేసేరు మన పెద్దోళ్లు. కానీ ఆ తర్వాత హిందీలోకెళ్లిపోయి పెద్ద స్టారై కూర్చుందావిడగారు," అన్నాడు హరి.

"ఎవరావిడ?" భరణి.

"డ్రీమ్‌గర్ల్ హేమమాలిని. తేనెమనసులు సినిమాలో ఒకతను సరిగాలేడుగానీ రెండో అతను చాలా పైకొచ్చేస్తాడనుకున్నారు. కానీ రివర్సయ్యింది."

"పైకొస్తాడనుకుంటే రాలేకపోయిన మనిషి ఎవరు?"

"రామ్మోహన్."

"ఇతనేవెయ్యొస్తాడులే అనుకుంటే వచ్చిన మనిషి..."

"మన సూపర్‌స్టార్ కృష్ణగారు..."

"ఔనౌను..."

"అంచనాలలాగే తలకిందులవుతా వుంటాయి. అసలుకొస్తే ఒక వేషానికి ఆర్టిస్ట్‌ని ఫైనలైజ్ చెయ్యడం అన్నది అంత ఆషామాషీ విషయంగాదు. వీటితోపాటు కలిసిరావాలి. అదోటీ..."

వాళ్లలా మాటాడుకుంటుంటే, 'ఆ హీరో మహర్షి వేషానికి ఎలాంటి మనిషి దొరుకుతాడో! అసలుకొస్తే మనకీ విషయం తెలీదుగానీ ఈ ఆఫీసుకొచ్చి వెళ్లిపోతున్న వాళ్లలో రేపొద్దున్న ఎంతమంది స్టార్స్ అవుతారో అనుకుంటున్న నాకు రవితేజ అన్న మనిషి ఫ్యూచర్లో మాస్ మహారాజవుతాడనీ, రామ్‌కీ అనే అతను తమిళంలో పెద్ద హీరో అవుతాడనీ తెలీదు గదా?'

ఆ పరుపుమీద పడున్న ఆ పత్రిక తిరగేస్తుంటే, గోపీ భాగ్యలక్ష్మిగారు రాసిన జంగుభాయి కథ కనిపించింది. మొదటి వాక్యం చదివేక తర్వాతది చదవబుద్ధేసింది. మొదలెట్టి చదివేసిన నేను కళ్లు మూసుకున్నాను.

"ఏంటయ్యా కళ్లు మూసుకుని ఎక్కడికో పోయేవూ. ఏం చదువుతున్నావ్?" అడిగేడు హరి అనుమోలు.

అతనివేపు తలతప్పిన నేను, "ఈ పత్రికలో ఇప్పుడు నేను చదివిన ఈ కథ ఫిల్మ్‌గానీ చేస్తే ఆ కేరెక్టర్లకి ఆర్టిస్టుల్ని సెలెక్ట్ చెయ్యడం ఎంత కష్టమో ఆలోచిస్తున్నాను..." అన్నాను.

"అంత బాగుందా ఆ కథ?" అన్నాడు హరి.

"జంగుబాయి. ఒక ట్రైబల్ ఏరియాలో జరిగిన కథని ఫస్ట్ పర్సన్‌లో రాసేరివిడ. అసలా నేరేడిరంగులో ఉండే జంగుబాయి వేషానికి ఆర్టిస్ట్‌ని ఏరడం ఎంత కష్టం అనిపించింది," అంటుంటే ఆ జంగుబాయితో పాటు వాళ్ల ముసలి నానమ్మ, కమల, మంత్రాల కాంతాబాయి, ఆమె మొగుడూ... ఈ కేరెక్టర్లకి సరైన

నటులు పడకపోతే ఎంత పాడయిపోతుందా కథ? అనిపించడంతో మళ్లీ చదవడం మొదలెట్టేను.

నల్లటి శరీరంతో నిగనిగలాడతా ఉండే ఆ జంగుబాయి కళ్లు మిలమిల్లాడుతున్నాయి. పదహారు కన్నా ఎక్కువ వయసు వుండదా పిల్లకి. చిన్నప్పుడే పెళ్లయిపోయిందంట. అడివి మధ్యున్న ఆ ఏటిగట్టు మీద పెరిగిన వృక్షాలు, వాటిమీద కేరింతలు కొడ్తున్న పక్షులు, వాగునీటి గలగలలు... జంగుబాయి గొంతు లాగ మోగే గాలి కళ్లల్లోకెళ్తుంటే మూసుకుంటా తలెత్తింది.

వర్షంలో తడుస్తా గంతులేస్తున్న జంగుబాయి పొద్దుట్నుంచీ అలా తడుస్తానే వుందని విన్న లక్ష్మి, 'చూరులోకి రా తడుస్తున్నావు... జ్వరమొస్తుంది...' అంటుంటే తుఫాను గాలిలో వణుకుతున్న పూలతీగ లాంటి జంగుబాయి ముఖంలో నీలం నీడలు.

అసలీ కేరెక్టర్‌కి ఆర్టిస్ట్‌ని సెలెక్ట్ చెయ్యడం ఎంత కష్టం అనుకుంటా చదూతున్నాను.

నాలుగిళ్ల అవతల కనిపించిన ఆ కాంతాబాయి కళ్లలో ఒక రకం విలనీ ఉంది. నోరిప్పేది తక్కువేగానీ విసిరికొడతా మాట్లాడ్తున్న ఆ ఎత్తైన ఆడమనిషి ముఖమంతా ద్వేషమే.

మరీ ఆ రేంజ్‌లో కాకపోయినా మా కథలో మహర్షి పైన సుచిత్రకి ద్వేషం అన్లేంగానీ కోపం... ఆక్రోశం.

'వేయి కంఠాలతో నిన్ను పిలుస్తుంది నా హృదయం..' అని ఒక ఆరాధకుడి మనసులో సున్నితత్వాన్ని ప్రతి ఒక్కరి గుండెకి హత్తుకునేలా ఆ చలంగారు చెప్పినట్టుగానే వేయి కంఠాలతో సుచిత్రని పిలుస్తుంది మహర్షి హృదయం. వేయి విధాలుగా ప్రేమిస్తుంది మహర్షి మనసు. వేయి రకాలుగా ఆ విషయాన్ని చెప్పే ప్రయత్నం చేస్తుంది అతని స్వరం. ఆమె పేరుని పిలుస్తున్నకొద్దీ పిలుపు పిలుపులో ఓ కొత్త భానూదయం కనిపిస్తోందతనిలో.

ఇలా ఆలోచిస్తా చదూతున్న పత్రికని నలిగిన ఆ తెల్లపరుపు మీదకి గిరాటేసి తేచిన నేను హాల్లోకొస్తే అప్పుడే ఆటోదిగి లోపలికొస్తున్న రాళ్లపల్లిగారు కనిపించేరు.

బిజీగా ఉన్న ఆ మనిషికి కారు కొనుక్కునేంత సంపాదన ఉన్నా కొనడు. ఎప్పట్నుంచో అలవాటైన అదే ఆటో. అదే డ్రైవరు.

"ఇప్పుడే ఆ మల్లికార్జునరావు వచ్చేడు. మీ పాతోళ్లకి వేషాలేం లేవు. అంతా కొత్తోళ్లకే..." అన్నాను.

నవ్వేసినా రాళ్లపల్లిగారు నా భుజమ్మీద చెయ్యేసి, 'మీకోసం పనిగట్టుకునొస్తే ఇలా హర్ట్ చేస్తారేంటీ... అలా అంటారుగానీ మనసులో ఉండదు. నేనొచ్చింది ఇంకో విషయం మాటాడ్డానికి," అనేసి తన చేతిలో ఉన్న ఆంధ్రజ్యోతి పేపరులో ప్రింటయి ఉన్న ఆ క్వార్టర్ పేజీ డిజైన్ చూపించేరు.

"వంశీ... నవంబరు 13 రాత్రి..." ఆ డిజైన్ మీదున్న టైటిల్ చదివిన నేను గేటు తెరిచిన చప్పుడొస్తే ఆ పక్కకిచూసేను.

గోధుమరంగు సఫారీ సూటూ, నల్ల బూటూ వేసుకున్న ఆ మనిషి నడుచుకుంటా వస్తున్నాడు లోపలికి.

"ఈయన కూడా వేషం కోసమే వస్తున్నారా?" అన్నాను.

ఆయన్ని చూసిన రాళ్లపల్లి ఒక్కసారిగా కదుల్తా నన్ను చూసి, "వస్తున్నాయెనెవరో గుర్తుపట్టేరా?" అన్నారు.

"బాగా ఎరిగిన ముఖంలాగే ఉంది. ఎవరూ?" అన్నాను.

"రాజనాల...!!!"

చాలా ఠీవిగా లోపలికొస్తున్నా రాజనాలగారికి ఎదురెళ్లిన రాళ్లపల్లి నమస్కారం పెడ్తుంటే ఆ రాజనాల గార్నే చూస్తున్నాను. మా పక్కూరు రాంపురం రాజుగారి హాల్లోనూ, కిశోర్ టాకీస్‌లోనూ, అన్నపూర్ణాలోనూ ఎన్ని సినిమాలు చూసేనీ రాజనాలయ్యి? అసలా రోజుల్లో ఈయన్ని చూస్తుంటే ఉచ్చాపేడా బందుగదా మాకు? అవునూ... అంత గొప్ప రాజనాలగారిక్కడికొచ్చేరేంటీ?



ప్రొడ్యూసర్లతో పనుండేమో... ఆళ్లెవరూ ఆఫీసులో లేరెలాగా? అనుకున్న నేను తలొంచుకుని స్టోరీ సిటింగ్ రూమ్‌లో కెళ్లిపోతుంటే నన్ను పేరు పెట్టి పిల్చే రాయన.

వెనక్కి తిరిగి చూస్తే నా దగ్గరదాకా వచ్చినా రాజనాలగారు, "నీ కోసమే వచ్చేనమ్మా!" అన్నారు.

ఆ హాల్లో వున్నా కుర్చీ జరిపి ఆయన్ని కూర్చో మంటా అక్కడున్న జనాన్ని కొంచెం బయటకెళ్ల మన్నట్టు సైగ చేసేను.

"నీ ఫోటోలు విజయచిత్రలో చూడ్డం వల్ల నిన్ను గుర్తుపట్టగలిగేను... నేనొచ్చింది నీ కోసమే," అన్నారు.

చెప్పండన్నట్టు చూస్తుంటే అక్కడ్నించి భరణి రాసుకుంటున్న గదిలోకెళ్లిపోయేరు రాళ్లపల్లిగారు.

"ఇప్పుడు తీస్తున్న సినిమాలో కేరెక్టరేవన్నా నాకు ఇస్తావనీ..."

మతిపోయింది నాకు. అంత గొప్ప రాజనాల గారు నా దగ్గరకి వేషానికి రావడమా!!!

ఆయనకి టీ అదీ తెప్పించి కాస్సేపు మాటాడి కంపెనీ కార్లో ఆయన దిగేచోట డ్రాప్ చెయ్యమని పంపించి లోపలికొస్తే ఎవరూలేరు.

చాలాసేపు చూసిన ఆ రాజనాలగారి సినిమా జ్ఞాపకాలతో అలాగుండిపోయిన నేను, ఆయన్ని దింపొచ్చిన కారొస్తే దాంట్లో ఎక్కి పోనిమ్మంటా ఆలోచించడం మొదలెట్టేను.

మహర్షి...

'జన్మమాధుర్యంలో సోలిన మన చేతుల్ని చిరు నవ్వుతో విడదీసి, మేఘశయ్యల మీద ఆనించి ప్రేమ గీతాలు పాడుతూ, నక్షత్ర మార్గాల నూరేగించి యిద్దరి మధ్యనూ అగాధమైన వ్యవధిని కల్పించి ఈ లోకంలో వొదిలారు. నా నోటి నుంచి వచ్చిన మొదటి శబ్దం, పేరులేని నీ పేరు. మూర్ఖులు వీళ్లు. అది పాలకోసం యేడుపనుకున్నారు.

'అది మొదలు నీకోసం వెతుకుతున్నాను. నేనాడుకున్న కొమ్మల్లో నీవున్నావేమోనని వెతికాను. నేను చదువుకున్న పుస్తకాల్లో నీ రూపం ముద్రించా రేమోనని చూశాను. కవులు నీ అందాన్ని పాడారేమో నని చదివాను. నీవెక్కడన్నా కనపడతావేమోనని మొహాలు వెతుకుతూ దేశాలు తిరిగాను...'

అద్భుతమైన ఆ చలం భావాల వెనకనించి... నేనూహించిన ఆ మహర్షి పాత్ర కనిపిస్తుంది. అదే ఊహ ఇప్పుడు ఆ పాత్రధారి కోసం వెతుకుతుంది.

నాకలవాటైన ఆర్టిస్టులు లేకపోతే ఇప్పుడు సెలెక్ట్ చేస్తున్న కొత్త ఆర్టిస్టులతో పర్లేదుగానీ ఆ రాజనాల గార్లాంటి సీనియర్ ఆర్టిస్టులకి వేషాలిస్తే వాళ్లతో చేయించుకోగల్నా?

ఎట్టి పరిస్థితుల్లోనూ నావల్లగాదు అనుకుం టుంటే, వెళ్తున్న కారు సిగ్నల్స్ దగ్గర ఆగుతా మళ్లీ స్పీడు పెరుగుతా, ట్రాఫిక్ దగ్గర స్లో అవుతా సడెన్‌గా మలుపులు తిగుతా అచ్చం జీవితంలాగే వెళ్తుంది.

❇

ఏడేళ్ల పిల్ల శారద వంటలక్క కట్టుకునే ఆరు గజాల మడిచీర చుట్టుకుని చిన్న బిందెతో నీళ్లు మోయలేక అవస్థ పడతా అడుగులేస్తుంటే చూస్తున్న తులసి గుండె ఆవిరైపోతుంది. వెళ్లి సాయం చేద్దామంటే

వాళ్ల మడి ఎక్కడ అపవిత్రం అయిపోతుందో అన్న భయం.

శారద కేక, ఇత్తడి బిందె కిందపడ్డ చప్పుడు.

విన్న శాస్త్రిగారు పూజగదిలో వున్న ఆ కిటికీ దగ్గరకొచ్చి చూసేరు.

గచ్చు మీద ఒలికిన నీళ్లలో పడున్న శారద నాన్న ఎక్కడ తిడతారో అన్న భయంతో ఆయన్ని చూస్తా, "బిందె పడిపోయింది నాన్నా... నైవేద్యానికి తొందరగా వంట చేద్దామని వస్తుంటే..." అంటా మోచేతి కముకు దెబ్బని చూసుకుంటుంది.

స్తంభం దగ్గర నిలబడి వున్న ఆ తులసిని చూసిన శాస్త్రి. "ఏం నీకు వంట చెయ్యడం చేతగాదా?" అన్నారు.

ఒణికిపోయిన తులసి వచ్చునన్నట్టు తలాడించింది.

"పసిపిల్ల అది మడికట్టుకుని వంట చెయ్యలేక అవస్థ పడ్తుంటే చేతనైనవాళ్లు వెళ్లి సాయం చెయ్యచ్చు గదా?"

'నేనా???' అన్నట్టు చూసింది తులసి.

"ఆచార వ్యవహారాలు మనసుల్ని క్రమమైన మార్గంలో పెట్టడానికి తప్ప, కులమనే పేరుతో మనుషుల్ని విడదియ్యడానికి కాదు," అనేసి ఆ దేవుడి మంటపం దగ్గరకెళ్లిపోయేరు.

ఖాకీ యూనిఫారం వేసుకున్న విశ్వనాథ్‌గారు ఆ డైలాగ్ చెబుతా ఆ శంకరశాస్త్రిలా నటిస్తుంటే చూస్తున్న నేను ఊపిరి పీల్చడం మర్చిపోయేను. ఆ పాత్రలో లీనమైపోయి ఎంత గొప్పగా నటిస్తున్నారీయన. ఆ పాత్ర ఆయన మస్తిష్కంలోంచి మా గొప్పగా జనించిందని అప్పుడర్థమవుతుంది.

శంకరశాస్త్రి వేషంలో నిలబడి చూస్తున్నా జె.వి. సోమయాజులుగార్ని, "ఏదీ మీరు చెయ్యండి," అన్నారు డైరెక్టర్‌గారు.

ఒక రిహార్సలు చేసేకా టేక్ చేసి, "ఓ.కే" అన్నా విశ్వనాథ్‌గారు, స్తంభం దగ్గర నిలబడ్డ మంజుభార్గవి క్లోజప్ పెట్టడానికి ప్రిపేరవుతుంటే గుర్తు చేసుకుంటున్న నాకు అచ్చం శంకరశాస్త్రిలాగ ఎంత గొప్పగా



చేసేరీయన? అసలీయన చేసిందాంట్లో ఎన్నో వంతు చేసేరు సోమయాజులుగారూ అని ప్రశ్నించుకుంటే ఆశ్చర్యం తప్ప, మరేం మిగల్లేదు నాకు.

ఎట్టి పరిస్థితుల్లోనూ నావల్లగాదు అనుకుంటుంటే, వెళ్తుంది కారు.

*

లాయర్ మాధవాచారిగారు కోర్టుకి బయల్దేరడానికి డ్రెస్సు వేసుకుని తయారవుతుంటే వచ్చినా క్లయింటుతో, "అవతల కోర్టుకి టైమవుతుంది. నీ కేసేంటో తొందరగా వివరించు నాయనా?" అన్నారు.

చాలా ప్రిపేరైపోయి వచ్చినా క్లయింటు, "మా నాన్నండి. ఆయనకిద్దరు భార్యలండి. నేను పెద్ద భార్య కొడుకునండి. మా అమ్మగారు పోయేరండి. ఇప్పుడండీ, మా నాన్న రెండో భార్య కొడుక్కి ఆస్తంతా రాసేద్దామనుకుంటున్నాడండి," అంటూ చాలా వివరంగా చెప్తుంటే లోపల్నుంచా మాధవాచారి భార్య కామాక్షి, "ఏవండీ ఓసారిలా వస్తారా?" అంటూ పిల్చింది.

తన్నేమో ఆ పిల్చింది అనుకున్న ఆ క్లయింటు, "ఆ వస్తున్నానమ్మా," అంటూ లేచెళ్లబోతుంటే అర్జంటుగా వాడ్నాపినా మాధవాచారి, "పిల్చింది నిన్ను గాదు. నన్ను," అనేసి లోపలికెళ్లి, శంకరశాస్త్రిగారి గురించి జనాల కామెంట్లన్నీ ఆయన చెవినేసిన భార్య తెగ చర్చలు చేస్తుంటే వాటన్నింటికీ సమాధానాలు చెప్పేక సర్దుకుంటూ తిరిగొచ్చి కూర్చుంటూ, "ఆ... ఏవంటావయ్యా. మీ అమ్మగారికి ఇద్దరు మొగుళ్లు. నువ్వు పెద్ద మొగుడు కొడుకువి. మీ నాన్నగారు పోయేరు. అంతేనా?" అన్నట్టు చూస్తే అదిరిపోయినా క్లయింటు, "ఆ... ఆ... కాదండీ. మా నాన్నగారికిద్దరు భార్యలు. మా అమ్మగారు పోయేరు," అంటూ మళ్లీ చెప్తుంటే, 'ఏవండీ' అంటూ మళ్లా పిల్చేరు కామాక్షమ్మ.

కంగారుగా లేచి లోపలికెళ్లినా మాధవయ్య ఈసారావిడతో చిన్న గొడవలాంటిది పడి మళ్లీ సర్దుకుంటూ వచ్చి, "ఆ... ఏవిటయ్యా నువ్వనేదీ... నీకిద్దరు భార్యలు. మొదటి భార్య పోయింది. అంతేగదా?" అనేటప్పటికి విపరీతమైన కోపమొచ్చేసినా బక్కపల్చటి క్లయింటు, "కాదండీ... నేను... నేను పోయేను," అనరుచుకుంటూ వెళ్లిపోయేడు.

ఈ కేరెక్టర్ మొత్తం ఏకబిగిన చేసేసి ఆ థమ్‌కి చూపిస్తున్న విశ్వనాథ్‌గార్ని చూసి సెట్టంతా ఒకటే నవ్వులు. ఆఖరికి అరవం వాళ్లైన ఆ అవుట్‌డోర్ యూనిట్ జనం కూడా.

ఆయన దగ్గరకొచ్చి దణ్ణం పెట్టేసిన ఆ థమ్, "చాలా బాగా చేసేరండి," అన్నాడు.

నవ్వేసినాయన, "రేపొద్దుట నిన్ను చూసి అనాలి జనం," అంటూ అతని భుజం తట్టేరు.

క్రియేట్ చేసుకున్న కేరెక్టర్‌కి సెలెక్ట్ చేసుకున్న ఆ నటుడికి చేసి చూపించినాయన, తన పాత్రని రాబట్టుకునే ఆ విధానం గొప్ప పాఠం నాకు.

*

మధ్యాన్నం నుంచి ఆ సముద్రం ఒడ్డు మీదున్నా బండల మధ్య రఘు కోసం చూస్తున్న కరుణలో ఇంతా అంతా గానంత విసుగు. ఇంకెళ్లిపోదామనేసి లేస్తుంటే వెనకాలే వున్న ఆ ఎత్తైన బండరాయి మీంచి దబ్బుమంటూ దూకేటప్పటికి కెవ్వుమంటూ అరుస్తూ అతన్ని తుక్కుపోయింది.

"ఎందుకింత లేటు?"

"కొద్దిగా ఆలశ్యమైంది."

"ఎందుకాలశ్యమైందీ?"

"కొద్దిగా లేటైంది."

"ఆ లేటే ఎందుకని అడుగుతున్నాను."

"కొద్దిగా ఆలశ్యమైంది అందుకని."

విసురుగా అతన్ని ఇసకలో తోసేసేటప్పటికి లేచెళ్లి, అందమైన ఆ కరుణామయిని బులిపించి బుజ్జగించి ఆమెకి చాలా ఇష్టమైన మాంసాహారం తెచ్చేడు.

నోట్లో పెట్టుకున్నాకా తుపుక్కున ఊసేసిన ఆ కరుణని షాకైపోతూ చూసి, "ఇదేంటీ?" అన్నాడు.

నీలాన్ని మింగిన ఆ సముద్రాన్ని తన నీలికళ్లతో చూస్తున్న కరుణ గులాబీరంగుల పెదవులు మొదలెట్టాయి.

"ఎప్పుడైతే నీమీద నాకు అభిమానం కలిగిందో అప్పటినించీ వీటి మీద అసహ్యం మొదలైంది రఘూ! మనిద్దరం ఒకటైపోయినప్పుడు నీకు ఇష్టం కానివి నాకెలా ఇష్టమవుతాయి చెప్పు," అంటుంటే మురిసిపోతున్నా రఘు ఆ అమ్మాయినతుక్కుపోయేడు.

అచ్చం ఆ వయసులో వున్న ఆడపిల్లలాగే కులుకులొలుకుతా ఆ సీన్లో కరుణ కేరెక్టర్ మొత్తాన్ని చేసి చూపిస్తున్న ఆ భారతీరాజాగార్ని మతోయినట్లు చూస్తా వుండిపోయిందా ముచ్చెర్ల అరుణ.

ఆయన్లా నేనెక్కడ చెయ్యగలను అనుకుంటున్న ఆ అరుణతో, "నువ్వు చెయ్యగలవ్. నాకంటే చాలా గొప్పగా చెయ్యగలవ్... రా... అన్నీ వదిలేసి నా కేరెక్టర్లోకి దూరిపోయి చెయ్యి," అంటా ఇంతా అంతా గానంత ప్రోత్సాహంతో కుదిపేస్తున్నాడా అరుణని.

బ్రేకులో నాదగ్గరకొచ్చినా పాలకొల్లు బాబూరావు, "ఏంటండీ ఆ డైరెక్టరూ? అచ్చం ఆడపిల్లలాగ చేసేసేడు గదా? అసలు ఏ ఆడదన్నా ఇతని ముందు పనికొస్తదా అని," అంటా ఒకటే మెచ్చుకుంటుంటే నవ్వేసిన నేను, "మధ్యాన్నం సీను దీనికి రివర్సు. అదెలాగ యాక్ట్ చేసి చూపిస్తారో చూద్దాం," అన్నాను.

"ఏంటీ మధ్యాన్నం సీనూ?" ఆత్రంగా అడుగుతున్నాడా సహకార రచయితైన బాబూరావు.

ఎంతో సుకుమారంగా తన చేతుల్లో పెరిగిన ఆ చెల్లి కరుణ జుట్టు పట్టుకున్న ఆ అన్న డేవిడ్ బరబరా ఈడ్చుకుంటా లాక్కునొచ్చేసి, తలని ఆ స్తంభానికేసి బాదుతుంటే నుదురు పగిలి రక్తం చిమ్మేలాగుంది.

"చెప్పు... ఎందుకు చేసేవీ పని? నువ్వెవరు? ఆడెవరు? ఇక మీదట ఆడ్ని కలుస్తావా? ఆడితో మాటాడతావా? చెప్పు. చెప్పవే..." కొడ్తున్నాడు. పొడుస్తున్నాడు. ఆవేశంలో చంపేసేలాగున్నాడు. ఆపడానికొచ్చినా భార్య మేరీని కూడా చావగొడ్తున్నాడు. రాక్షసుడంటే ఆడే అనిపిస్తున్నాడు.

చాలా ఆవేశంగా ఆ భారతీరాజాగారు చేస్తుంటే చూస్తున్నా శరత్‌బాబు, 'ఇప్పుడాయన్లా చెయ్యాలి నేను,' అనుకుంటా ప్రిపేరవుతుంటే నా దగ్గరకొచ్చినా పాలకొల్లు బాబూరావు, "ఏంటండీ ఈ దారుణం?' అన్నాడు.

"దారుణం ఏంటీ?" అన్నాను.

"పొద్దుట ఆ ముట్టం బీచ్‌లో అచ్చం అప్పుడే వయసొచ్చిన కన్నెపిల్లలాగ చేసి చూపించిన ఈ డైరెక్టరు ఇప్పుడేంటీ రాక్షసుడైపోయేడూ? అమ్మో ఈడెవరో మామూ లోడుగాదండీ బాబోయ్," అంటా వెళ్లిపోయేడు.

కన్యాకుమారి దగ్గర్లో ఉన్న నాగర్‌కోయిల్ అనే ఆ ఊరి ప్రాంతంలో ఆ సీతాకోకచిలుక షూటింగ్.

ఏ సీన్లో ఏ కేరెక్టరుంటే ఆ కేరెక్టర్లాగ మారిపోడానికి ఏ మాత్రం టైము తీసుకునేవాడుకాదు మా భారతీరాజాగారు. ఈ పక్కన నటించేవాళ్లకెంత గొప్పగా చేసి చూపించేవాడో టెక్నికల్‌గా అంత గొప్పగానూ ఆడుకునే ఆయన నా మెదడునిండా పేరుకుపోయేడు.

నేనప్పటికింకా రాలేదుగానీ, అంతులేని కథ సినిమా అప్పుడు ఆ పక్క తమిళంలో సుజాతకీ ఇటు తెలుగులో జయప్రదకీ బాలచందర్‌గారు చేసి చూపించే విధానం మా గొప్పగా వుండేదంట.



ఇంక కన్నడ డైరెక్టర్ పుట్టన్న కనగల్ శరపంజర సినిమా టైములో కల్పనకి కేరెక్టర్ చెప్పే విధానం చూస్తుంటే మతులు పోయేవంట.

మరైతే, డైరెక్టర్ తను సొంతం చేసుకున్న పాత్రని ఆర్టిస్టుమీద అంత గొప్పగా అద్దకం చెయ్యాలన్నమాట అనేసి చాలా బలమైన భావాలు నింపేసుకుంటున్న టైములో సింగీతం శ్రీనివాసరావుగారి దగ్గరో సినిమాకి పనిచేసినప్పుడు అలాగేకాదు ఇలాక్కూడా చెయ్యొచ్చని తెల్సింది.

"ఎలా సార్?" అన్నాను.

"ఇది మా గురువు కె.వి. రెడ్డిగారి దగ్గర్నించి నేను తెల్సుకున్న పద్ధతి," అన్నారాయన.

"అదెలా సార్?"

"నువ్వు యాక్ట్ చేసి చూపిస్తే అతను నిన్ను అనుకరించి అలాగే చేసే ప్రమాదం ఉంది. అలాగ్గాకండా నీ లోపలున్న పాత్రని ఆ చేసేవాడి నరనరాల్లోకీ ఎక్కించెయ్యడం జరిగితే నీకెలాక్కావాలో అచ్చం అలాంటి కేరెక్టరు బయటికొస్తుంది అతన్లోంచి."

మనక్కావల్సింది మనం అనుకున్న కేరెక్టరు. దాన్ని నూరుశాతం బయటకి లాగాలంటే ఈ రెండోది చాలా బాగుంది అనిపించిన నేను, దాన్నే అడాప్ట్ చేసుకునే ప్రయత్నం చేసేను.




ఆఫీసుకొచ్చిన ఆర్టిస్టుల ఫోటోల్ని ఓ పక్కనించి చూస్తా, ఇంకో పక్కనించి ఇదంతా ఆలోచిస్తా పోతున్న నాకు, తర్వాత రోజునించీ వచ్చే జనం తగ్గిపోతున్నట్టనిపించింది.

"అనిపించడమేంటీ తగ్గిపోయేరు. కొత్తగా వేషాల కోసం కలతిరుగుతున్న మొత్తం జనం మన ఆఫీసుకి వచ్చేసినట్టే," అంటున్నాడా తమ్ముడు సత్యం.

ఎవరైనా సీనియర్ ఆర్టిస్టు కోసం వెళ్దామా అంటే ఇప్పటికిప్పుడు ఎవరు దొరుకుతారూ?

హీరోయిన్‌కి ఆ నిశాంత. తక్కిన వేషాలకి పర్లేదు. ఆర్టిస్టులు బానే కుదిరేరు. మళ్లీ ఆ రాఘవ ఫోటోలు తెచ్చి చూసిన నేను, 'మరీ బేడ్‌గా ఏంలేడు. మేనేజ్ చేద్దాం,' అనుకుంటా ఆ హరితోపాటు లేచిన నేను, "హీరో కేరెక్టర్ గురించి ఆలోచిస్తా ఇంకా ఎన్నెన్ని గుర్తు చేసుకున్నానో తెలుసా హరీ?" అన్నాను.

హెడ్‌ఫోన్లో పాట వింటున్నా హరి నన్ను చూస్తా, "ఏదో అంటన్నావ్ వినబడ్లేదు," అన్నాడు.

"ఔను ఏదో అన్నాను," అన్నాను.

"బాగుంది పాట," అన్నాడు హరి.

"ఏ పాట?"

"ఈ సినిమాలోనే సుమం ప్రతి సుమం సుమం..."

"షూటింగ్ ఈ పాటతోనే మొదలెడదామా అనుకుంటున్నాను," అన్నాను.

"సరే అయితే. పాటతో షెడ్యూల్ మొదలైతే కాస్త హుషారుగా ఉంటది. లొకేషన్ ఎక్కడా అరకు వెళ్దామా?" అన్నాడు.

"స్కీము ఒకటనుకున్నాను. దానికి అరకు కుదరదు. వైజాగ్ బీచ్‌లోనే బాగున్న మూలలు వెతుక్కోవాలి," అన్నాను.


మొదటిరోజు టి. సుబ్బరామిరెడ్డిగారు కెమేరా స్విచ్చాన్ చేస్తే ఇంకెవరో క్లాప్ కొట్టేరు.

రెండోరోజు నించీ బీచ్‌లో షూటింగ్. సన్‌రైజ్ కాల్‌షీట్.

(ఐపోలేదింకా)

www.digitaltimes.co

# What's Next For You?



**Leverage Our Digital Marketing Expertise for Your Business Evolution With The times**

- Content Marketing
- Position 0 & Next Gen SEO
- Lead Gen to Door Knocks
- E-commerce Multiplication

Google Partner | facebook for business | Microsoft Gold Partner

DIGITAL TIMES

Encinitas, USA; Hyderabad & Bangalore, India | hello@digitaltimes.co

**+91 98480 16666 +1 424-253-0800**

కథ

# సముద్రం

* రమణజీవి



నేను పిచ్చాసుపత్రిలో వున్నప్పుడు వచ్చింది ఆ ఈ మెయిల్. ఒక పత్రికవాళ్లు పంపింది. ప్రత్యేక సంచికకు కథ రాయమని. మా ఆవిడ చెప్పింది నాకా విషయం.

ఆమె నాకు పిచ్చెక్కిన విషయం రహస్యంగా వుంచింది, అందరికీ తెలియడం ఆమెకి చిన్నతనంగా అనిపించి. మా పిల్లలకు మాత్రమే తెలుసు. కొంత కాలం చూసి తగ్గకపోతే అప్పుడు బయటపెట్టొచ్చు అనేది ఆమె వుద్దేశ్యం.

నా వేపు చూసింది. ఆ చూపులో చాలా అర్థాలతో పాటు, 'కథ రాస్తారా?' అనే ప్రశ్న కూడా వుంది.

"ఊ" అంటూ తలతో అడిగింది వూపి.

పిల్లవాణ్ణి గద్దించినట్టుగా వుంది ఆమె ధోరణి.

"రాస్తాను," అన్నాను.

"ఈ కండీషన్లోనా," అంది యాపిల్ని చేతిలోకి తీసుకుంటూ. "సరేసరే రాయండి మీకూ కాస్త ఛేంజ్‌గా వుంటుంది."

ఏ కండీషన్‌లో అని గొడవ పెట్టుకుందామని నోటిదాకా వచ్చి వూరుకున్నాను. పిచ్చివాళ్లు చేసే మొదటి వాదన తమకి పిచ్చి లేదనిట పైగా.

"రాయను. చెబ్తాను. నువ్వు రాసి పెడతావా!"

తల వూపింది అంగీకారంగా.

"పెన్నుతో రాయాలి అయితే," అన్నాను.

అదోలా చూసింది. నేను రాబోతున్న కోపాన్ని ఆపుకున్నాను.

నేను కథలు చెప్పి ఇప్పటికి చాలాకాలం అయింది.

వీడియో కాసెట్ ప్లేయర్లు కొత్తగా వచ్చిన రోజుల్లో అనుకుంటా... పిల్లల్ని పోగేసి కథలు చెప్పేవాణ్ణి.

పిల్లలకు కథలు చెప్పడంలో హుషారుని అనుభవించాల్సిందే! ఆ ఆనందమే వేరు. పెద్ద గొంతుతో జంతువులాగా అరవొచ్చు. ఇష్టమొచ్చినట్టు గెంతొచ్చు. అప్పట్లో నన్నెవరూ అంత పెద్దగా గమనించినట్టు లేదు. లేకపోతే అప్పుడే పిచ్చాసుపత్రిలో వేసేవాళ్లు.

నేను చెప్పిన కథల్లో ఎలాంటి ప్రత్యేకతా అయితే వుండేది కాదు. చాలామంది చెప్పేలాంటివే. వింటున్న పిల్లల్నే కథలో హీరోల్ని చెయ్యడం. ప్రజల్ని చంపుకు తినే ఓ రెండు తలల రాక్షసుణ్ణి గెలవడం. ఒక పెద్ద మృగం లేదా ఏ గ్రహాంతరవాసుల బారి నుండో ఈ ప్రపంచాన్ని రక్షించడం. ఇలాంటివే.

కథలు చెప్పడంలోని ఆనందంతోపాటు, పిల్లల్తో కాళ్లు తొక్కించుకునే ప్రతిఫలాన్ని కూడా ఆశించేవాణ్ణి. పిల్లలు అలా తొక్కుతుంటే నిద్రలోకి జారిపోయేవాణ్ణి.


ఒకవేళ పిల్లలు తొక్కడం మానినా లేక తిక్క తిక్కగా తొక్కినా నా నోరు టక్కున మూతపడేది. ఒక్కోసారి రివైండయి కథ మొదటినుంచీ ప్రారంభమయ్యేది. ఇంకోసారి కథ వొక్కసారిగా చివరికి వెళ్లిపోయేది. పిల్లలకు వెంటనే తెలిసిపోయేది తాము చేసిన తప్పు. గోలగోల చేసి మళ్లీ శ్రద్ధగా తొక్కడం ప్రారంభించేవాళ్లు. పిల్లల ముందు వి.సి.పీగా నన్ను నేను అభివర్ణించుకున్న ఆనాటి కథల వ్యవహారం అది.

ఇది పెద్దలకోసం చెబుతున్న కథ. కాస్త వొళ్లు దగ్గరుంచుకోవాలి. పిల్లలంత తేలిగ్గా మోసపోవడానికి సిద్ధంగా వుండరు పెద్దవాళ్లు.

*

వారం నించి రోజూ వస్తోంది ఆ కల.

అతడు అంతవరకూ అటువంటి కలను ఎరగడు.



కవిగా బహుళ ప్రచారం పొందిన రమణజీవి కథకుడు, చిత్రకారుడు కూడా. రెండు కథాసంపుటాలు, నాలుగు కవితా సంపుటాలు ప్రచురించారు. విలక్షణమైన వస్తువుతో అంతే విలక్షణంగా కవిత్వాన్ని, కథల్ని రాస్తారు. గ్రాఫిక్ డిజైనర్‌గా హైదరాబాదులో నివాసం.

అపార జలరాశి కనుచూపు మేరదాకా! పొగ మంచులో కలిసిపోయిన అంతులేని తీరం ఎన్ని యోజనాలుందో ఎవరికీ తెలీదు. ఏవేవో పక్షులు. ఒడ్డంతా ఇసుకపిండి. ఆ అనంత జలరాశికి వూపిరి తిత్తులు గనక వుంటే అవి తీసే శ్వాసలాగే వుంది, దాని నిరంతర హోరు.

దేవుడు తనకోసం చేసుకున్న అద్దంలా తళతళా మెరిసిపోతున్న ఆ దృశ్యం ఎవరూ వూహించడానికి వీల్లేనిది.

చాలామంది పండితుల్ని సంప్రదించి చాలా గ్రంథాల్ని పరిశోధించాక దాన్ని సముద్రం అంటారని తెలిసింది అతడికి. అది ఎంతో దూరంలో భూగోళానికి అవతలివైపు వుంటుందట.

ఎప్పుడైతే దానికొక పేరు ఖాయం అయిందో అప్పణ్ణించి ఆ కల రావడం మానేసింది. సముద్ర స్వప్నం కోసం ఎదురుచూసి ఎదురుచూసి నిస్సారంగా గడుస్తున్నాయి అతడి రోజులు.

రాజుని చూసిన కళ్లతో మొగుణ్ణి చూసినట్టుంది మిగతా లోకం అతడికి. నిజానికి అతడే ఓ రాజు.


దేశంలోని మహాపర్వతాలు, దుర్గమారణ్యాలు, నేలను తాకేంత దగ్గరగా సాగిపోయే మేఘాల గుంపులు, జలపాతాలు, విశాల జలాశయాలు అతణ్ణి తృప్తి పరచలేకపోతున్నాయి. పదేపదే ఆ సముద్ర దృశ్యం గుర్తొచ్చి అతణ్ణి నిర్వీర్యుణ్ణి చేస్తోంది.

సముద్రం ఎలాగైనా వుండాల్సిందే!

దేశాధినేతగా అతడు ప్రజలకు ఇవ్వగలిగిన కానుకేదైనా వుంటే అది సముద్రమే. అంతకన్నా గొప్పది ఈ సృష్టిలో మరొకటి లేదు. ఈ నిర్ణయానికి రావడానికి చాలా సమయాన్నే తీసుకున్నాడు. ఎన్నో వైపుల్నించి ఆలోచించాల్సిన బాధ్యత అతడిది.

ఓరోజు కిక్కిరిసిన సభలో తన నిర్ణయాన్ని ప్రకటించాడు. ఆ ప్రకటనకు ముందే సముద్రాన్ని కళ్లకు కట్టినట్టు వర్ణించాడు. మహాసేనల్లాగా మును ముందుకు వురికే అలల గురించి చెబుతున్నప్పుడు అందరూ వూపిరి తీసుకోవడం మరిచిపోవడాన్ని అతడు గమనించాడు. అలల తుంపరల్లాగా లక్షలాది పక్షుల విహారాన్ని వివరిస్తున్నప్పుడు అందరి కళ్లలో చిప్పిల్లుతున్న వెలుగురవ్వల్ని చూశాడు. అందరూ సముద్రపు హోరును తమ హృదయలయల్లోకి ఆవాహన చేసుకుంటున్న వుత్తేజిత క్షణాల్లోనే అతడి నిర్ణయాన్ని ప్రకటించాడు అదును చూసి.

అందరూ ఉద్వేగంతో లేచి నిలబడ్డారు. ఏవేవో నినాదాల ద్వారా తమ సమ్మతిని ప్రకటించారు. సముద్రపు హోరు అప్పుడే మొదలయినట్టుగా అనిపించింది దేశాధినేతకు.




సముద్రాన్ని తవ్వడానికి ఓ శుభముహూర్తాన్ని నిర్ణయించారు సిద్ధాంతులు. ముహూర్తానికి చాలా ముందే ప్రజలు తమ బంగారాన్నంతా ఖజానాకి అడగకుండానే ఇచ్చేశారు... భవిష్యత్ భయాన్ని సముద్ర కోరికతో జయించిన ప్రజలు.

బంగారమంతా ఇనప గునపాలుగా మారింది.

"ఎంతోకాలంగా మనం సంపదని పోగు చెయ్యడానికి బతుకుతున్నాం. ఒక్క భరోసా తప్ప ఏమైనా వుందా అందులో? ఇకనించి ఒక అనుభూతి కోసం బతకబోతున్నాం."

దేశాధినేత మనసు పరవళ్లు తొక్కుతోంది. "మనం చేస్తున్న పని ఈ భూమ్మీద ఎవరూ కల కూడా కనలేనిది."

"మన ముందున్నది వొకటే. తవ్వడం! మనం తవ్వుదాం. ఎప్పటికి పూర్తవుతుందో ఆలోచించడం మన పని కాదు. దాన్ని కాలం చూసుకుంటుంది. నీళ్లు ఎలా నింపాలా అనేది కూడా మన పని కాదు. దాన్ని ఆకాశం చూసుకుంటుంది.

"మన పని కేవలం తవ్వడం. ఇంతకాలం యుద్ధాల్ని ఎలా తెగించి చేశామో అలా చెయ్యడం," అంటూ గునపాన్ని నేలలోకి దించాడు దేశాధినేత.

కొన్ని లక్షల గునపాలు నేల వేపు దూసుకెళ్లాయి.

*

కళ్లు తెరిచాను.

నా భార్యాపిల్లలతో బాటు ఓ ఇద్దరు నర్సులూ, కొందరు అటెండర్లూ చుట్టూ గుమికూడి శ్రద్ధగా వింటున్నారు. అంతకు ముందురోజు నేను చెయ్యి చేసుకున్న అటెండర్ కూడా వున్నాడు వాళ్లలో.

డబ్బుల్ని చింపనీకుండా అడ్డుకోవచ్చా నన్ను మరి?

కథను కొనసాగించాను కళ్లు మూసుకుని.

*

ఏళ్లు గడిచిపోతున్నాయి. ఆ తవ్వకం అలా సాగుతూనే వుంది. దీక్ష ఏమాత్రం తగ్గలేదు. సముద్రాన్ని గుండెల్లో నింపుకున్న వాళ్లు మరి. ఆ పనిలో ఎంతోమంది మరణించారు. దేశాధినేత వృద్ధుడయ్యాడు. అయినా తవ్వుతూనే వున్నాడు.

ఏదో తినడానికి ఇంత పండించుకోవడం, అవసరమైనన్ని పశువుల్ని పోషించుకోవడం. మిగతా సమయమంతా సముద్రాన్ని తవ్వడం. అంతే! ఈ విషయం చుట్టూ వున్న దేశాలకు నవ్వులాటగా తయారయింది. దాన్నొక పిచ్చివాళ్ల దేశంగా అనుకోడం ప్రారంభించారు. ఆ దేశంలో బక్కచిక్కిన పశువుల దగ్గర్నించి ఆధునీకరించబడని ఆయుధాల దాకా ఎన్నో సంగతులు నవ్వు తెప్పించే విషయాలుగా మారి పోయాయి.

అదే అదనుగా కొందరు ఆ దేశాన్ని ఆక్రమిద్దామని వ్యూహాలు చేశారు కానీ అక్కడ ఏముందని? ఒక పాడి లేదు. ఒక పంట లేదు. ఒక బంగారమూ లేదు. అంతా ఇనుముమయం!

ఈ వార్త అలా పాకి ఇలా పాకి దూరంగా వున్న సముద్రానికి తెలిసింది. మొదట్లో నమ్మలేదు. గాలి చెప్పే విషయాల్లో ఏదీ స్థిరంగా వుండదు. వుట్టి పోసుకోలు కబుర్లు! కానీ పక్షులు చెప్పాక నమ్మక తప్పలేదు ఆ సముద్రానికి.

ఆశ్చర్యపడింది మొదట. ఎంత పిచ్చాళ్లయినా ఇంత దుస్సాహసమా! క్రమక్రమంగా కోపంతో వూగి పోయింది.

తనని తయారు చెయ్యడమా! తనెలా తయారయిందో ఇన్ని యుగాలైనా తనకే తెలీదే. తన చీకటి గర్భంలో చలించే మహా మహా జలచరాల్ని వొడ్డున పడితే తప్ప తనే గుర్తించలేదే. సూర్యుడు కూడా చొరలేని అగాధాలను, పర్వతాలను, బడబాగ్నులను కడుపులో దాచుకున్న నిగూఢగాథ కదా తను!

దూరాల్ని కొలవడంలో మాత్రం గాలిని మించింది లేదు. వెంట్రుక మందంతో సహా లెక్కించ గలదు.

పిచ్చివాళ్ల దేశం ఎంత దూరముందో తెలుసుకుంది గాలి ద్వారా. తన కడుపుని అవసరమైనంత వేగంగా సుళ్లు తిప్పి కావలిసినంత శక్తిని భుజాల్లోకి తెచ్చుకుని కుప్పించి ఎగిరి ముందుకు దూకింది సముద్రం. ఏడు తాడిమానులంత ఎత్తున లేచింది. తీరప్రాంతాల్ని ముంచేస్తూ తన ప్రయాణాన్ని ప్రారంభించింది.

దూరంనించి చూస్తే లక్షలాది సముద్రపక్షుల్ని, దట్టమైన మబ్బుల్ని వెంటేసుకుని జూలు విదిల్చి కదిలి

వస్తున్న మహా మృగంలాగా కనిపించింది. ప్రచండమైన తుపానుగాలులు వృక్షాల్ని, కోటల్ని, జంతుజాలాన్ని కూల్చేసి, విసిరేసి దాని దారిని శుభ్రపరుస్తూ ముందుగా పరుగు తీస్తున్నాయి.

ఆ భీకరదృశ్యాన్ని చూసిన ఏ ప్రాణికీ కొన్ని నిమిషాల కంటే ఎక్కువసేపు జీవించే అవకాశం లేక పోయింది. అలాంటి అవకాశమే వుంటే ఆ వాళ్ళు గగుర్పొడిచే అనుభవాన్ని తరాలకు తరాలు కథలు కథలుగా చెప్పుకునేవారు.

జనవాసాల్లోకి రావడం అదే మొదటిసారి సముద్రానికి.

మానవ సమాజాల్ని చూసి నివ్వెరపోయింది. మనుషులు ఇంత ఇరుగ్గా జీవిస్తుంటారా అనే ఏవగింపుతోనే సాగింది దాని ప్రయాణమంతా. వాళ్ల ఇళ్లను చూసి... వాళ్ల దాపరికాల్ని చూసి... అచ్చం వాళ్లలాగే వున్న వాళ్ల దేవుళ్లను చూసి.

ఏనుగుల్నే మచ్చిక చేసుకున్న ఈ ఆరడుగుల ప్రాణులు తనని మాత్రం బానిసను చేసుకోరా కాలం కలిసొస్తే. బానిసేం ఖర్మ! తనని సమూలంగా నాశనం చెయ్యగల నిక్షిప్తశక్తుల్ని కూడా ఆ చిన్ని మానవ శరీరాల్లో పసిగట్టి కోపంతో రగిలిపోయింది. దూరంగా వున్న లక్ష్యాల్ని ఛేదించే ఆయుధాల్ని చూశాక ఎన్ని అధర్మ యుద్ధాలకు పాల్పడబోతున్నాడో కదా ఈ మనిషి అని ధుమధుమలాడింది.

ఇంత అందమైన ప్రపంచంలో ఈ అత్యాశా పరుణ్ణి సృష్టించడం వెనక దేవుడి ఆంతర్యాన్ని ప్రశ్నిస్తూనే సాగింది దాని పరుగు.

అలా ఎన్నో దేశాల్నీ, అరణ్యాల్నీ, నదుల్నీ, జీవరాశుల్నీ పొట్టనబెట్టుకుంటూ ప్రయాణించిన సముద్రం చివరికి పిచ్చివాళ్ల దేశాన్ని సమీపించింది.

అదృష్టవశాత్తు అప్పటికింకా సూర్యాస్తమయం కాకపోవడంతో పరిశీలనగా చూసే అవకాశం దొరికింది.

మిగతాదేశాల్లాగా పచ్చగా కళకళలాడుతూ లేదది.

అరకొర సాగుతో అక్కడక్కడ విసిరేసినట్టున్న పంటలు. దారుల మధ్యలో మొలిచిన ముళ్ల డొంకలు.

కొండచరియల మీద గూఢచారులు కాపలా కాసే రక్షణదుర్గాలు బోసిపోయి వున్నాయి. ఎక్కడా మనుషుల జాడ లేదు. దిక్కూ మొక్కూలేని దేశంలా వుంది. సైన్యసంచారం ఏ కోశానా లేదు. వొకటి రెండు తప్ప గాలిమరలన్నీ తుప్పు పట్టి బిగదీసుకుపోయాయి. ఏ ఇంటికీ తాళాలు లేవు. పరిపాలనే లేని ఆ దేశాన్ని వెక్కిరిస్తున్నట్టుగా ఏవో చిన్నచిన్న మృగాలు ఇష్టా రాజ్యంగా తిరుగుతున్నాయి. చనిపోయిన దేశంలా వుంది.

అంత నిశ్శబ్దంలోనూ దూరాన్నించి ఏవో లోహా లకు చెందిన శబ్దాలు!

కొండల అవతల కొన్ని లక్షలమంది చీమల దండులాగా తవ్వే పనిలో నిమగ్నమై వున్నారు. నిజానికి ఆ కొండలన్నీ వాళ్లు తవ్వి పోసినవే.

'ఓహో ఇక్కడన్నమాట సముద్రాన్ని తవ్వు తున్నది,' తల పంకించింది సముద్రం. తన సహ చరుందరికీ వుష్ అని సైగ చేసి నిశ్శబ్దంగా కొండ మీదుగా కాగితపు పొరలాగా పాకి తొంగి చూసింది. చంపే ముందు ఆ మతిలేని వాళ్లను దగ్గరగా చూడా లని దాని కుతూహలం.

అక్కడ ఎన్నో మైళ్ల విస్తీర్ణంలో ఓ మహా అగాధం. చిక్కటి నీడలు దానినిండా. చూపు కూడా దూరలేనంత లోతుల్లోకి మాయమయిన మెట్లు అక్కడక్కడా.

ఆ అగాధపు వొడ్డున ఆవిరితో నీళ్లుతోడే యంత్రాల్ని చూసి ఆశ్చర్యపడింది సముద్రం. అంత వరకూ ప్రపంచంలో అటువంటి సాంకేతిక నైపుణ్యం లేదు.

ఒక ఏనుగుతో వంద ఏనుగుల పనిని రాబట్టే వాళ్ల యంత్రానువాదానికి విస్తుపోయింది.

లావాటి మోకులు, ఇనపగొలుసుల గందర గోళపు శబ్దాలు పరిసరాల నిండా. గణగణలాడుతూ అంతుబట్టని పనులేవో చేస్తున్న ఇనుపచక్రాలు. అర్థం

చేసుకునేలోపే పెద్దపెద్ద బండరాళ్లు, మట్టి అలా జారుడుబల్లల మీదుగా కొండల మీదికి రాలి పోతున్నాయి.

కర్రలు, ఇనుము కాలుతున్న వాసన ఎటు చూసినా. పొగతో, దుమ్ముతో నిండిపోయిన ఆ ప్రాంతాన్ని ఇంతవరకు ఏ దేశస్థులు చూసిన పాపాన పోలేదు.

కొంతమంది యంత్రాల్ని నడుపుతుంటే, ఎంతో మంది ఒక శిల్పాన్ని చెక్కుతున్నంత శ్రద్ధగా తవ్వు తున్నారు. సముద్రం తప్ప మరో ఆలోచన లేకపోవడం వల్ల బార్లా తెరిచిన వాకిళ్లలా వున్నాయి వాళ్ల మనసులు.

చెమట తుడుచుకోడానికి కూడా తీరికలేనంతగా పనిలో మునిగి వున్నారు. వొంటి మీద సరైన బట్టలు కూడా లేకుండా కఠోరంగా శ్రమిస్తున్న ఆ బక్కపలుచటి మనుషుల్ని చూసి నిశ్చేష్టైపోయింది సముద్రం.

వీళ్లా తనని తయారుచేసేది?

కోపంతో కుతకుతా వుడికిపోయింది.

జివ్వున ఆకాశంలోకి లేచింది.

తన సహచరుతో కలిసి వొక్కసారిగా ఫెళఫెళా వురిమింది.

ప్రపంచం ముక్కలయ్యేంత శబ్దం! ఆ శబ్దానికే సగం మంది గుండె పగిలి చావాలని సముద్రం వుద్దేశ్యం.

అందరూ గాభరాపడి తలలెత్తి చూశారు.

వాళ్ల చేతుల్లో గునపాలు జారిపోయాయి. ఎక్కడి యంత్రాలక్కడ నిలిచిపోయాయి. ఏనుగులు భయంతో భీకరంగా అరిచాయి. అకస్మాత్తుగా సంభవించిన ఆ మహా ప్రళయానికి నేల కూడా కంపించింది.

అందరి కళ్లూ విభ్రాంతితో విచ్చుకున్నాయి. చలనం లేకుండా అలా నిలబడిపోయారు ఆ దృశ్యం ముందు. చిరకాల తమ తపస్సుకు నిజం సముద్రమే కరుణించిందా!

వేయి తలల సర్పంలా నించున్న సముద్రాన్నీ, తలపాగాలా ఆవరించిన లక్షలాది పక్షుల్నీ, మేఘాల్నీ, యోజనాల మేరకు విస్తరించిన మంచుతీరాల్నీ చూసి పారవశ్యంతో మోకాళ్ల మీద కూలబడిపోయారు.

వృద్ధుల్నీ, యువకుల్నీ, ఆడవాళ్లనీ, పిల్లల్నీ తేరిపార చూసింది.

ఎన్నో ఏళ్ల కల ఫలించిన సంతోషంతో చెమ్మ గిల్లిన కళ్లు. ఆపుకోలేని గగుర్పాటుతో వణుకుతున్న శరీరాలు.

కోపం స్థానంలో వాళ్లపట్ల ఆసక్తి చోటు చేసు కుంటోంది.

ఎండకు కమిలిపోయిన వాళ్ల వొంటి మీద ఖరీదైన దుస్తులు లేకపోవచ్చు. నగానట్రా లేకపోవచ్చు. కానీ అవిరామదీక్ష వల్ల కాయలు కాసిన వాళ్ల అర చేతుల్నిండా పూలవాసన!

మెత్తబడింది సముద్రం.

అంతమంది తడి కళ్లలో వువ్వెత్తున మెరుస్తున్న తన లక్షల ప్రతిబింబాల్ని చూసి ముగ్ధురాలయింది. అంతవరకు తనను చూసి భయంతో పారిపోయిన వాళ్లే తెలుసు దానికి. ఇది చాలా కొత్త.

తన్మయత్వంతో ఏదో గొణుగుతున్న వాళ్ల పెదవుల్లోని ఆరాధనకు చలించిపోయింది. అద్భుత రసంలో తడిసి ముద్దవుతున్న వాళ్లను చూసి తనలోనూ ఏదో కరుగుతూ... కదులుతున్న రసం!

ఎప్పుడో మరచిపోయిన తన హృదయం చప్పుడు చేస్తున్నట్టు పసిగట్టింది.

తన ప్రమేయం లేకుండానే లోపలి నుంచి వుబికి వుబికి వస్తున్న కొత్తనీటితో ఆ అగాధం నిండి పోయింది. అయితే అది తన కన్నీరే అని తెలుసు కోడానికి సముద్రానికి ఎంతోసేపు పట్టలేదు.

బరువుగా వెనుతిరిగింది.

ఆ కన్నీరే పిచ్చివాళ్ల దేశంలో సముద్రంగా మిగిలి పోయింది. అప్పట్నించే సముద్రపు నీరు వుప్పగా మారింది.

ముగించాను. అందరూ నావేపే చూస్తున్నారు, రౌండ్సుకు వచ్చిన డాక్టరుతో సహా. ఆ గదిలో ప్రతి కన్నూ ఒక సముద్రంలాగా తోచింది నా కంటికి.

*సాక్షి ఫన్ డే సౌజన్యంతో*



# సగం సగం నీడలు

ఆశారాజు

మనుషుల మధ్యకు వెళ్లినపుడు
కోసాన్ని కళ్లలో పెట్టుకొని బయలుదేరకు!
అది ఒక అడ్డదిడ్డమైన ఆయుధం
కింద జారిపడితే నీ కాళ్లైనా తెగిపోవచ్చు
ఎదుటివాడి తలైనా ఎగిరిపోవచ్చు

మనిషి బాధ పడినప్పుడు గుండె పగిలిపోతే,
గ్లాసు పగిలిపోయినట్టు
గల గలా శబ్దమేమీ రాదు
కానీ, జీవితమంతా
పెంకులు గుచ్చుకొంటూనే వుంటాయి

అందరం అనుకొన్నట్టు
సముద్రాలు, ప్రవాహాలు
అంత లోతుగా ఏమీ వుండవు
వాటికన్నా కళ్లల్లో పొంగిన
కన్నీళ్లే ఎక్కువ లోతుగా వుంటాయి

మనసు గాయపడినవాళ్లు
మెడికల్ షాపుల్లోకి వెళ్లి-
ఆయింట్‌మెంట్లు, బాండేజీలు తెచ్చుకోరు
రాత్రంతా చెమట తుడుచుకొన్న కర్చీఫ్‌తోనో
కలలు నలిగిన తలదిండుతోనో
కళ్లకు కాపడం పెట్టుకొంటారు

ఓడిపోయినవాళ్లు ఎదురుపడితే,
పక్కకు వెళ్లకుండా పలకరించు
జీవిత పాఠాలు తెలుస్తాయి
వాళ్లను గుర్తుపట్టడం చాలా సులభం
గాయపడినవాళ్లు ఎప్పుడూ నవ్వుతూ వుంటారు

ప్రహరీ గోడల మీద పావురాలు వాలితే,
ఏ జైలు కూడా తాజ్‌మహల్ కాలేదు
సమాధుల చుట్టూ పూలు పూస్తే,
స్మశానం బృందావనం కాబోదు

స్వేచ్ఛ ఉన్నచోటనే సౌందర్యముంటుంది
ఊపిరాడే దారిలోనే పరిమళం వీస్తుంది
మనిషికి ప్రశ్నలు ప్రాణాలు
తాగినవాడు పెళ్లి బరాత్‌లో
తల్వార్ తిప్పినట్టు అరవకూడదు

పస్తులుంచినవాడిని
నిలదీయడానికి
ప్రతిపక్షంలో కూర్చొని
ఎదిరించడానికి సంధించాలి

ఈ గాయం నా వెంట వెంటనే నడుస్తుంది
నేను విసుగుతో కసురుకుంటే
నేను తప్ప, నీకు తోడు ఎవరుంటారని,
అమాయకంగా అడుగుతుంది
ఈ సభలో చదవడానికి నావద్ద కవిత్వం లేదు

వీధుల్లో పారేసిన చిత్తుకాగితాలు
బయట దొరికిన పిచ్చి సామాన్లు
కొన్ని కొన్ని ఏరుకొని తెచ్చాను
మీరు అనుమతిస్తే యీ మూట విప్పి
మీకు చూపించి వెళ్లిపోతాను



హైదరాబాదును నిత్యం తన కవిత్వంతో శ్వాసించే ఆశారాజు ఇరవై రెండు కవితా సంపుటాలు ప్రచురించారు. రెండు సంపుటాలు కన్నడంలోకి అనువాదమయ్యాయి. నివాసం హైదరాబాదు.





* కె.వి.ఎస్. రామారావు

# సినీ అన్నమయ్య వేటూరి

***సినిమా పాటకి సాహితీ సొబగులద్దిన తరానికి ఆఖరి రచయిత వేటూరి సుందరరామమూర్తి.***

***'అలలు కదిలినా పాటే! ఆకు మెదిలినా పాటే! కలలు చెదిరినా పాటే! కలత చెందినా పాటే! ఏ పాట నే పాడనూ... బ్రతుకే పాటైన పసివాడనూ...!'***

***నాలుగు దశాబ్దాల క్రితం 'సీతామాలక్ష్మి' సినిమా కోసం ఆయన రాసిన ఈ పాట- మూడు దశాబ్దాలపాటు తెలుగు సినిమా పాటను ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలిన ఆయన సినీ జీవితానికి అప్రయత్నంగా అచ్చుగుద్దినట్లుగా సరిపోయింది. తీరిక లేకుండా పాటలతో ప్రయాణించినంత కాలం ఆయన 'పలుకుంటే పాట... మేలుకుంటే పాట... పాడుకుంటే పాట...'***

***జనవరి 29 వేటూరి జయంతి సందర్భంగా మరోసారి ఆయన్ని గుర్తుచేసుకుంటూ ఈ వ్యాసం మీకోసం...***

తెలుగు సినిమా పాటకిప్పుడు 80 వసంతాలు.

తొలితరం, అంటే 40ల్లో వచ్చిన పాటల్లో ఎక్కువ శాతం సాహిత్యపరంగా నేలబారువి. గుర్తుంచుకోదగ్గవి అతితక్కువ. ఏదో అవసరార్థం వచ్చిపోయేవేగాని శ్రోతలు వాటి గురించి లోతుగా ఆలోచించాలని, వాటిలో ఏవో సాహిత్యపు విలువలుండాలనీ ఎవరూ ఆశించినట్టు కనిపించవు. పైగా సందేశాలు, ఉప దేశాలు ఎక్కువ కావటంతో సాహిత్యానికి చోటు తక్కువ కూడ.

ఉపదేశాలు వెనక్కి తగ్గి వినోదానికి ప్రాధాన్యత పెరగటం మొదలయ్యాక సినిమాపాట దారి మారింది. కథకి కేంద్రం ప్రేమ కావటంతో పాటల్లో ప్రేమగీతాలు పెత్తనం లాక్కున్నాయి. అంతకుముందు మాటల రచయితలే పాటల మీద కూడ చెయ్యి చేసుకుంటే ఇప్పుడు ప్రత్యేకించి పాటల పాండిత్యం వున్నవాళ్లు పగ్గాలు పుచ్చుకున్నారు. భావకవిత్వంలో భారీభేరీ మోగించిన కృష్ణశాస్త్రి, అభ్యుదయ కవిత్వానికి అ ఆలు రాసిన శ్రీశ్రీ, రుబాయీలు గజళ్ల దారితెన్నుల సార మెరిగిన దాశరథి, సూటైన మాటల నాటకానుభవంతో పాటల పని పట్టటానికి నడుంకట్టిన ఆత్రేయ లాంటి అతిరథులూ మహారథులూ సినిమా పాటల వేటకి బయల్దేరారు. పాటకి కొత్త భాషని తయారుచేశారు. నానా భాషల్లోని భావాల్ని కొల్లగొట్టారు. సినిమా పాటకి కూడ అక్కడక్కడ సాహిత్యపు వాసనలు పూశారు. ఇంతలో హిందీ పాటలు, గజళ్లని తెలుగు మాటల్లో మూటలు కడుతూ సినారె కూడ రెడీ అయ్యాడు. పాట కేవలం కథకి ఆలంబన ఇచ్చేదిగా కాకుండా తనంతట తను స్వతంత్రంగా నిలబడటం మొదలయ్యింది. 'ఫలానా రకం పాటకి ఫలానా రచయిత ఘటికుడు' అని ముద్రలు పడటం ప్రారంభమైంది ఈ తరంలోనే.

అంటే, సినిమా పాటకి వయసొచ్చిందన్నమాట.

అలా ఉద్ధృతంగా మొదలైన ఈ రెండోతరం రచయితల పాటల ప్రవాహాలు ఇంకో ఇరవై ఏళ్లు గడిచేసరికి పడికట్టు భావాల పిల్లకాలవల్లోకి, ముసలి



మాటల మురిగ్గుంటల్లోకి పారుతున్న సమయానికి రంగప్రవేశం చేసినవాడు వేటూరి. రావటమే జలపాతంగా దూకాడు. బీడు పడిపోతున్న పాటల పొలాన్ని చడామడా దున్నాడు. కొత్తమాటల విత్తనాల్ని మూల మూలలా చల్లాడు. సినిమా పాటల రాజ్యాన్ని పాతికేళ్ల పాటు ఏలాడు.ఏ

ఇంత విశాలమైన వేటూరి పాటలతోటలో రక రకాల పూలమొక్కలున్నాయి, ముళ్లపొదలూ ఉన్నాయి.

వీటన్నిటికీ సాధారణ సూత్రం ఏదైనా వుందా? లేకపోతే దేనికదే విలక్షణమైందా?

స్థూలంగా చూస్తే వేటూరి అన్ని రకాల పాటల్నీ అన్ని రసాల మాటల్నీ సమానచాతుర్యంతో ఆడించాడనే అనిపిస్తుంది. 'శివశివ శంకర' అని ముగ్ధభక్తితో గాని, 'శంకరా నాదశరీరా పరా' అని ప్రౌఢభక్తితో గాని కీర్తించినా, 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను' అని రక్తితో ఊరించినా, 'వేణువై వచ్చాను భువనానికి, గాలినై పోతాను గగనానికి' అని ఆర్ద్రంగా ఆర్తించినా, 'ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీత లోకంలో' అంటూ క్రోధంతో గాండ్రించినా దేనికదే చెప్పుకోదగ్గది, దాని పరిధిలో అది మెచ్చుకోదగ్గది. ఈ కారణం వల్లనే వేటూరి ఏ పాటల్ని ఏ గాట్లో కట్టెయ్యాలో, వేటి బరువుని ఏ త్రాసులో తుయ్యాలో తెలీక సినీగీత రసికులు తికమకపడ్డారు, పడుతున్నారు. రెండు స్థూలమైన మార్గాల్ని సూచించారు కొందరు- ఒకటి ఉన్నతమైన భావాలు, భాషా వున్న సభ్య సవ్య మార్గమని, రెండోది సభ్య పదాల ముసుగేసుకున్న అపసవ్య అశ్లీల మార్గమని. ఇది లోతులేని ప్రతిపాదన. వేటూరి రెండు ముఖాల డాక్టర్ జెకిల్ అండ్ మిస్టర్ హైడ్ కాడు.

నిశితంగా పరిశీలిస్తే, నిమ్మళంగా వెదికితే, వేటూరి పాటల పోకడలకి ఒకటే దారీతెన్నూ కనిపిస్తుంది. వేటూరి పాట విద్య తేలని బ్రహ్మవిద్య కాదనీ తేలుతుంది. ఈ వ్యాసం చేసే ప్రతిపాదన, వేటూరి పాట కొన్ని ప్రాధమిక సూత్రాల నుంచి నిర్మితమైందని, ఆ సూత్రాలను వేటూరి నియమంగా, పనితనంతో పాటించాడని. వాటిని ముందు టూకీగా చెప్పుకుని తర్వాత వివరంగా చూద్దాం.

ఒకటో సూత్రం- సినిమా పాటకుండాల్సిన ముఖ్యగుణం చెవికింపుగా వుండటం.

రెండో సూత్రం- అర్థం కన్నా శబ్దం ముఖ్యం; అర్థం వున్నప్పుడు కూడ చూచాయగా వుంటే చాలు; సందర్భశుద్ధి కోసం శబ్దాన్ని బలి చెయ్యక్కర్లేదు.

మూడో సూత్రం- పాటకి 'దండాన్వయం' అక్కర్లేదు; చరణానికీ చరణానికీ మధ్యేకాదు, పాదానికీ పాదానికీ, చివరికి పదానికీ పదానికీ మధ్య కూడ సమన్వయం ఉండక్కర్లేదు

ఈ సూత్రాల ఆధారంగా చూస్తే తేలే ఒక విషయం ఏమంటే- వేటూరి సంప్రదాయ భావాలకి సరికొత్త పదాల అలంకారాలు చేశాడనేది. ఇంకా సూటిగా చెప్పాలంటే, పాట ఎలాటిదైనా భావపరంగా వేటూరి తెచ్చిన కొత్తదనం చెప్పుకోదగ్గది కాదు; కాని భాషలో అతను తెచ్చిన మార్పు విప్లవాత్మకం.

ఈ విషయాల్ని ఇంకొంత విపులంగా గ్రహించటానికి ఒక వర్గీకరణ ఉపయోగిస్తుంది: అర్థం, శబ్దం, లయ అనేవి సాహిత్యపరంగా సినిమా పాటకుండే మూడు పార్శ్వాలుగా మనం భావిస్తే, తొలితరం పాటకి అర్థం అత్యంత ప్రధానం, ఆ తర్వాత శబ్దానికి కొంత స్థానం, ఏవో జానపదుల గీతాల్లో తప్ప లయ అప్రధానం అని చెప్పొచ్చు. రెండో తరంలో అర్థ ప్రాధాన్యం ఉన్నా శబ్దానికి గణనీయమైన పాత్ర, లయకి కొంత ప్రాధాన్యత కలిగాయి (నాగేశ్వరరావు నృత్యాలు మొదలెట్టింది ఈ కాలంలోనే). ఇక మూడో తరంలో శబ్దం ప్రధానమై అర్థం తగ్గుముఖం పట్టింది; లయకి కూడ చెప్పుకోదగ్గ స్థానమే దొరికింది. ఇప్పటి తరంలో శబ్దార్థాలు రెండూ వెనక్కు తగ్గి లయకు ఇది వరకెన్నడూ లేనంత ప్రాధాన్యత వచ్చిందని అనిపిస్తోంది. ఇంకొంత కాలం గడిస్తే తప్ప ఈ విషయం స్పష్టంగా తేల్చలేం.

ఈవిధంగా చూస్తే, వేటూరి వచ్చే సమయానికి ఉన్న పరిస్థితులు, పరిణామక్రమంలో తెలుగు సినిమా పాట ఉన్న దశ, అతని ఆలోచనకి సరిగ్గా అతికాయని, అతని విజయానికి ఇదీ ఒక ముఖ్య కారణమని ఋజువౌతుంది.



ఇప్పుడు వేటూరి మీద ఏయే మౌలిక ప్రభావాలు ఉన్నాయో ముందు చూసి, తర్వాత పైన చెప్పిన సూత్రాలు అతని పాటలకు ఎలా ప్రాణమయ్యాయో చూద్దాం.

వేటూరి సాహితీకుటుంబం నుంచి వచ్చిన వాడు; చిన్నప్పట్నుంచి సంప్రదాయ సాహిత్యంలో పుట్టి పెరిగినవాడు. సంస్కృతాంధ్రాల్లో ఒక మాదిరి పాండిత్యం ఉన్నవాడు.

ప్రబంధాల్తో మంచి పరిచయం; ముఖ్యంగా శ్లేషలకి ప్రాధాన్యం ఇచ్చిన మలితరం ప్రబంధాల మీద గట్టిపట్టు. భావ కవిత్వం, ముఖ్యంగా విశ్వనాథ, రాయప్రోలుల రచనల మీద మమకారం. అభ్యుదయ కవితాతత్వం, అందునా శ్రీశ్రీ రచనల్తో బాగానే పరిచయం. త్యాగరాజు, అన్నమయ్యల గీతాల మీద శ్రద్ధ.

***భావ గీతాలు, ప్రబంధ ధోరణులు***

వేటూరి పాటల తొలిదశలో ప్రబంధ, భావ కవిత్వాల వాసనలు గుప్పున గుబాళిస్తాయి. 'అందానికి అందం ఈ పుత్తడిబొమ్మ' చిక్కటి భావకవిత. అలాగే 'కిన్నెరసాని వచ్చిందమ్మా ఎన్నెల పైటేసి' అన్నదీ. 'కోకిలమ్మ పెళ్లికి కోనంతా పందిరి' మరో అచ్చమైన భావగీతం. 'సామజవర గమనా' అన్న త్యాగరాజ కృతిలో 'ఆమని కోయిల ఇలా, నా జీవనవేణువులూదగా' అంటూ భావగీతికని చొప్పించేశాడు. తొలిదశలో వచ్చిన అనేక పాటల్లో ప్రబంధ కవిత్వపు శ్లేషలూ యమకాలూ ప్రాసలూ శబ్దాలతో గిరికీలు సర్వసాధారణాలు. 'ఆరాణి పాదాల పారాణి జిలుగులో / నీ రాజభోగాలు పాడనీ తెలుగులో' అన్నా, 'నీ చల్లని చరణాలు చల్లిన కిరణాలలో / రేపటి కోసం చీకటి రెప్పల తెర విప్పాలని' అంటున్నా, 'కాళింది మడుగున కాళీయుని పడగల / ఆబాల గోపాల మా బాల గోపాలుని / అచ్చెరువున అచ్చెరువున విచ్చిన కన్నుల చూడ' అన్నా, శ్రద్ధంతా శబ్దాలంకారాల మీదే. చాలా కాలం తర్వాత వచ్చిన 'అబ్బ నీ తియ్యని దెబ్బ' అన్న పాటలో కూడా 'చిటపట నడుముల ఊపులో ఒక ఇరుసున వరసలు కలవగా / ముసిరిన కసికసి వయసులో ఒక ఎదనస పదనిస కలదుగా' లాటి మాటల పేర్పులు చాలానే కనిపిస్తాయి. 'హంసలేఖ రాశా నీకంది వుంటది / ప్రేమలేఖ రాశా ఎద కంది వుంటది' లాటి ప్రయోగాలూ ప్రాసల్నీ యతుల్నీ పాటించినవే. భావకవిత్వ ప్రభావానికి మరొక నిదర్శనం ఆయన పాటల్లో ఎన్నోసార్లు విశ్వనాథనీ ఆయన రచనల్నీ ప్రస్తావించటం. ఉదాహరణకి, ఆమధ్య వచ్చిన గోదావరి సినిమాలో కూడ 'గల్లుగల్లున సాని కిన్నెర గౌతమింట గజ్జెకట్టెలే' అంటాడు. మొదల్లో అయితే నండూరి ఎంకీ విశ్వనాథ కిన్నెరా ఆయన పాటల్లో చాలాసార్లే కనిపించి వెళ్లారు. ఇక ప్రబంధాల ప్రభావం దాదాపు అన్ని పాటల్లోనూ కనిపించేదే.

ముఖ్యంగా విజయవిలాసం లాంటి మలితరం ప్రబంధాల్నుంచి చిత్రకవిత్వాల రహస్యాలు గ్రహించాడు వేటూరి. వీటి ద్వారా అతనికి శబ్దం మీద మోజు, అధికారం వచ్చాయి.

వేటూరి రచనల్లో ప్రధానగుణం పదాలపేర్పు. ఒకదాని వెంట ఒకటి, దగ్గరదగ్గరగా వినిపించే పదాల్ని పేర్చుకుంటూ పోవటంలో అతను ఘటికుడు. కింద ఉదహరించిన అనేకమైన పాటల్లో ఈ గుణం పైకే కనిపిస్తుంది.

కొత్తరకమైన కవిత్వాన్ని రాస్తున్నామనుకున్న కవులు ఆ కవిత్వపు ప్రత్యేకతల గురించి కవిత్వం రాయటం తెలుగు సాహిత్యంలో మొదట్నుంచీ వస్తున్న ఆచారం. నన్నయ, నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు, నాచన సోముడు, శ్రీనాథుడు, పెద్దన, పింగళి సూరన, రామరాజభూషణుడు, ఇరవైయవ శతాబ్దంలో భావకవులు, శ్రీశ్రీ, పఠాభి, తిలక్, దిగంబర కవులు, స్త్రీవాద కవులు, దళిత కవులు- ఇలా ఎన్నెన్నో రకాలవాళ్లు ఈ ఆచారాన్ని పాటించారు. వేటూరికి తనేం చేస్తున్నాడో తనకు తెలుసుననటానికి ఇలాటి ఒక నిదర్శనం సిరిసిరిమువ్వ సినిమా కోసం రాసిన 'ఝుమ్మంది నాదం సయ్యంది పాదం' అన్న పాటలో కనిపిస్తుంది

*ఎదలోని సొదలా ఎలదేటి రొదలా*
*కదిలేటి నదిలా కలల వరదలా*
*చలిత లలిత పద కలిత కవితలెద*





సరిగమ పలికించగా
స్వర మధురిమలొలికించగా

ఇందులో తొలి మూడు పాదాలు తను రాయబోతున్న పాటల స్వరూపాన్ని నిర్వచిస్తున్నాయని చెప్పొచ్చు. అవి 'చలిత లలిత పద కలిత కవితలు'. ఇక్కడ రెండు గుణాలు మనకి స్పష్టంగా కనిపిస్తున్నాయి- ఒకటి లలితమైన పదాల వాడకం, రెండోది అలాటి పదాల్తో శబ్దవిన్యాసాలు చెయ్యటం. వేటూరి పాటలన్నిటిలోనూ ఈ రెండు గుణాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి.

**లలిత పదాలు**

తన పాటల్లో లలితపదాల్ని చాలా నియమంగా వాడాడు వేటూరి. పాట హృద్యంగా ఉండటానికి, తేలిగ్గా జీర్ణం కావటానికి లలితపదాలు పునాది అన్న విషయాన్ని గుర్తించి ఆచరించటం అతని విజయాలకి ప్రముఖ కారణం. మరీ అవసరమైతే తప్ప కఠిన పదాలు కాని అక్షరాలు కాని అతని పాటల్లో కనిపించవు. అయితే ఈ నియమం వల్ల కలిగిన ఒక లోటు ఏమంటే భీకర పదాలు అవసరమైన సమయాల్లో కూడ వాటిమీద మనసు పెట్టలేక పోవటం. ఉదాహరణకు అదే సినిమాకోసం రాసిన రా దిగిరా అనే పాటను చూద్దాం. అందులో రెండో చరణం

నటరాజా శతసహస్ర రవితేజా
నటగాయక వైతాళిక మునిజనభోజా
దీనావన భవ్యకళా దివ్యపదాంభోజ
చెరిసగమై రసజగమై చెలగిన నీ చెలి ప్రాణం
బలిపశువై యజ్ఞవాటి వెలిబూడిద ఐన క్షణము
సతీ వియోగము సహియించక దుర్మతియౌ
దక్షుని మదమడంచగా
ఢఢమఢఢమ ఢమరుక ధ్వనుల
జమక జమక యమ గమక భయంకర
సకలలోక జర్జరిత భయంకర
వికటనటస్ఫుట విస్ఫులింగముల
విలయతాండవము సలిపిన నీవే
శిలవై ఐతే పగిలిపో శివుడే ఐతే రగిలిపో

దీన్లో చివరి ఏడు పాదాల్లోను ఏం రాయాలో తోచక గిలగిలలాడటం స్పష్టంగా కనిపిస్తుంది. రెండు పక్కపక్క పాదాల్లో 'భయంకర' అనే పదం పదేపదే వాడటం, ఒక పాదంలో అర్థరహితమైన శబ్దాలేవో చెయ్యటం, ఒక పాదం అంతా ఢమఢమతోనే సరి పుచ్చటం- బహుశ ఇంత నీరసమైన పాట వేటూరి మరొకటి రాయలేదేమో! ఈ పాట అంతకుముందు కొన్నేళ్ల క్రితం వచ్చిన చెల్లెలి కాపురం సినిమాలోని 'చరణకింకిణులు ఘల్లుఘల్లుమన' అనే పాటకి మక్కికి మక్కి అనుసరణ. దాన్లో రెండో భాగం ఇది

ఫాలనేత్రసంప్రభవత్ జ్వాలలు ప్రసవశరుని
దహియించగా
పతిని కోలుపడి రతీదేవి దుఃఖితమతియై
రోదించగా
హిమగిరీంద్ర శిఖరాగ్ర తాండవత్ ప్రమథగణము
కనిపించగా
ప్రమథనాథ కరపంకజ భాంకృత ఢమరుధ్వని
వినిపించగా
ప్రళయకాల సంకలిత భయంకర జల
ధరార్భటుల
చలితదిక్తటుల చకితదిక్కరుల వికృతఘీం
కృతుల
సహస్రఫణ సంజనిత ఫూత్కృతుల



ఇది అద్భుతమైంది కాకపోవచ్చుగాని పై వేటూరి పాట కన్నా ఎన్నో రెట్లు మెరుగు.

### శబ్ద విన్యాసాలు

వేటూరి పాటకి ప్రాణం శబ్దం. తొలిపాట నుంచి చివరి వరకు దీన్ని అతను విడవలేదు. అర్థాన్ని గురించి పెద్ద పట్టింపులు లేవుగాని శబ్దాన్ని మాత్రం ఎప్పుడూ వదల్లేదు. వేటూరే ఒక సభలో చెప్పిన ఒక ఉదంతం దీనికి మంచి తార్కాణం. తను తొలిసారి ఇళయరాజాని కలిసినప్పుడు అతను చాలా హడావుడిలో ఉండి, "నా టైం వేస్ట్ చెయ్యటానికి కాకపోతే ఇలా మాటిమాటికి కొత్తకవుల్ని తీసుకొచ్చి మా ప్రాణాలు తీస్తున్నారు కదా, ఇప్పుడు ఈయనకి ట్యూన్‌కి పాట ఎలా రాయాలో నేను నేర్పి చావాలి," అని విసుక్కున్నాట్ట. దాంతో వేటూరికీ చిర్రెత్తుకొచ్చి, "ఆ ట్యూన్ ఏదో త్వరగా వినిపించండి, మాకూ అవతల చాలా పనులున్నాయి," అని తొందరపెట్టి అతను ట్యూన్ వినిపిస్తూండగానే ఆశువుగా 'సుందరమో సుమధురమో / చందురుడందిన చందన శీతలమో/ మలయజ మారుత శీకరమో / మనసిజ రాగ వశీకరమో' అని అంతే వేగంగా చెప్పి అతన్ని దిగ్భ్రాంతికి గురిచేశాట్ట. ఆ తర్వాత ఇద్దరూ పరమాప్తులయారట. ఈ పాట మన విశ్లేషణకి బాగా పనికొస్తుంది. ఆశువుగా చెప్పింది గనక వేటూరి పాటల సహజ లక్షణాన్ని, పాట గురించి అతనికున్న మౌలిక భావాల్ని చూపిస్తుంది. దీన్లో అన్నీ లలితపదాలే అని వేరే చెప్పక్కర్లేదు. నిజానికి 'చందురు డందిన చందన' అనే భాగం లలితం కన్నా లలితం. అలాగే, అర్థం మీద పెద్ద పట్టింపు లేదనేది కూడ స్పష్టమే పదపదం పట్టిచూస్తే "చందురుడందిన చందన శీతలమో" అనేదానికి సరిగా అన్వయం, అర్థం చెప్పలేం. కాకపోతే, చందురుడు, శీతలంలాటి పదాలు వెన్నెలనీ, హాయిని స్ఫురణకు తెచ్చి ఆ పాట ఉద్దేశించిన 'మూడ్'ని సూచిస్తాయి. ఆ విధంగా ఇదొక విజయవంతమైన ప్రయత్నం. ఆశుపరిధిలో కూడ శబ్ద విన్యాసాలు చక్కగా కనిపిస్తాయి. ఆద్యంతాల్లో ప్రాసలు, దగ్గర దగ్గరగా వినిపించే పదాలు, మెత్తటి సమాసాలు.

నిన్నమొన్నటి 'ఉప్పొంగెలే గోదావరి' అనే పాట-

*ఉప్పొంగెలే గోదావరి ఊగిందిలే చేలో వరి*
*భూదారిలో నీలాంబరి మా సీమకే చీనాంబరి*
*వెతలు తీర్చు మా దేవేరి వెన్నెలంటి మా గోదారి*

అని మొదలౌతుంది. యతులు, ప్రాసలు, పదాల్లో గమ్మత్తులు మామూలే.

### తొలిదశ - మూస ప్రయాస

పద్యం రాసేవాడికి చందస్సువల్ల ఆ పద్యం నడక ఎలా ఉండాలో నిర్ణయమైపోతుంది. అదే పాట రాయాలంటే ఎదురుగా ఎలాటి మూసా ఉండదు. సంగీత దర్శకుడు ముందుగా బాణీనన్నా ఇవ్వాలి లేకపోతే రచయిత తనకుతనే ఏదో మూసని తయారుచేసుకుని దాన్లో పాటని ఇమిడ్చాలి. కొద్దిమంది రచయితలు మూసల్తో పనిలేకుండా తమకు తోచింది రాసేస్తారు; ఆ తర్వాత బాణీలు కట్టేవారు వారి తిప్పలేవో వారు పడతారు. ఆత్రేయ దీనికో ముఖ్య ఉదాహరణ. అందుకే బాణీకి పాట రాయాలంటే ఆత్రేయ చాలా అవస్థ పడేవాడని చూసినవాళ్లు చెప్తారు.

వేటూరి దానికి పూర్తి వ్యతిరేకం. మూస లేకపోతే గిలగిలలాడతాడు. అడవిరాముడు సినిమాకి అన్ని పాటల్నీ ఒకే గతిలో రాసిస్తే చూసి మహదేవన్ తల కొట్టుకున్నాడని వేటూరే ఒక సభలో చెప్పాడు. మహదేవన్‌కి ముందుగా బాణీలు చెయ్యటం అలవాటు లేదు కనక ఆయనకి రాసిన పాటల్లో వేటూరి ఎలాటి తిప్పలు పడ్డాడో మనకి స్పష్టంగా కనిపిస్తుంది. ఉదాహరణకి 'ఓంకార నాదానుసంధానమౌ గానమే' అన్న బహుళ ప్రచారమున్న పాటలో ఒక చరణానికి మరో చరణానికి నడకలో పోలికే వుండదు. దేనిదారి దానిదే. ఒకే చరణంలో కూడ పాదాల్లో సవ్యత, సఖ్యత కనిపించవు.

*శారదవీణారాగ చంద్రికా పులకిత శారదరాత్రము*
*నారదనీరద మహతీనినాద గమకిత*
*శ్రావణగీతము*
*రసికులకనురాగమై రసగంగలో తానమై*
*పల్లవించు సామవేదమంత్రము*
*శంకరాభరణము*



దీన్లో పైన చెప్పిన లక్షణాలన్నీ ఉన్నాయి తొలి రెండు పాదాల్లో ఆద్యంతాల్లో ప్రాసలు; దగ్గర దగ్గరగా వినిపించే శబ్దాలు నారద-నీరద, శారద-శారద; మూడో పాదంలో యతి; రసికుల-రసగంగ; రాగం, తానం, పల్లవి అనే మాటల్ని అదేవరసలో కనిపించీ కనిపించ కుండా గర్భితం చెయ్యటం.

తర్వాతి చరణం స్థూలంగా ఇలాటి నడకనే అనుసరిస్తుంది కాని అటూ ఇటూ వూగుతూ సాగుతుంది. దీనికి ముఖ్యకారణం అప్పటికింకా వేటూరికి పాటల మూస పట్టుపడకపోవటమే.

*అద్వైతసిద్ధికి అమరత్వలబ్ధికి గానమె సోపానము*
*సత్వసాధనకు సత్యశోధనకు సంగీతమే ప్రాణము*
*త్యాగరాజహృదయమై రాగరాజనిలయమై*
*ముక్తినొసగు భక్తియోగమార్గము మృతియెలేని*
*సుధారాగ స్వర్గము*

మొదటి చరణంలోని రాగం తానం పల్లవి లాటి ప్రయోగం చెయ్యటానికి ఇక్కడ వీలుపడలేదు!

'రాగం తానం పల్లవి' అనే పల్లవితో మొదలయ్యే పాట నడక కూడ చాలా అసౌష్ఠవమైందే. నిలకడగా నిలబడలేక పడబోతుంటుంది.

*కృష్ణాతరంగాల సారంగరాగాలు*
*కృష్ణలీలాతరంగిణీ భక్తిగీతాలు*
*సస్యకేదారాల స్వరసగాంధారాలు*
*సరసహృదయక్షేత్ర విమలగాంధర్వాలు*
*క్షీరసాగరశయన దేవగాంధారిలో*
*నీపద కీర్తన సేయగా*

శబ్దాలంకారాలు పుష్కలంగా ఉండి చెవికింపుగా హాయిగా వినిపించే ఈ పాట అర్థాన్ని అడివికి తోలేసి శబ్దాన్ని చంకనెత్తుకోవటానికి ఒక మంచి ఉదాహరణ కూడ. నర్తకి రకరకాల స్థలాల్లో రకరకాల సన్నివేశాల్ని అభినయించి చూపుతుంది కనక ఇలా ఒకదానితో ఒకటి సంబంధం లేని విషయాలు స్పృశించటం జరిగిందని వాదించొచ్చు కాని అది తర్కానికి నిలబడేది కాదు. ఐతే ఈ పాటలోనూ సంప్రదాయ భావాలు గుప్పుమంటున్నాయి. ఇందులో ఉన్న 'స్వరస' అన్న పదానికి అర్థం ఏదైనా వుంటే అది ఆ రాసినవారికే తెలియాలి. నిఘంటువుల్లో ఎక్కడా ఈ పదం కనిపించదు!

ఈ దశలో వచ్చిన ఎన్నో పాటల్లో ఈ గుణాలు కనిపిస్తాయి. బాణీ ముందుగా ఇవ్వనప్పుడు నడక అస్తవ్యస్తంగా వుండటమూ, ఐనా చెవికింపైన మాటల పేర్పుతో ఆ లోపాన్ని కప్పెయ్యటమూ సాధారణం.

ఇంకొక్క చిన్న ఉదాహరణ. *శంకరాభరణం* సినిమాకి రాసిన 'శంకరా నాదశరీరా' అన్న పాటని వేటూరి రాసిన పద్ధతి ఇది-

*శంకరా నాదశరీరా*
*పరా వేదవిహారా*
*హరా జీవేశ్వరా*

ఇలా రాసిన పాటని మహదేవన్ సర్ది ఇలా తయారుచేశాడు

*శంకరా నాదశరీరా పరా*
*వేదవిహారా హరా*
*జీవేశ్వరా - శంకరా*

ఇంత సరళమైన మూసతో పాట రాయటం అప్పటికి వేటూరికి పాట స్వరూపం మీద పట్టు దొరకక పోవటాన్ని సూచిస్తుంది.

ఈ తొలిదశకు సంబంధించిన సారాంశం ఏమంటే: ఒకటి- తొలిదశలో వేటూరి పాటల్లో ఎక్కువగా వినిపించింది భావకవిత్వపు భావాలు, ప్రబంధాల పదబంధాలు; రెండు- ఏ పాటని ఎలాటి మూసలో పొయ్యాలో అవగాహన చేసుకునే ప్రయత్నం, ఆ ప్రయాణంలో ఆటుపోట్లు. ఈ రెండో కారణం వల్లనేనేమో బాణీలు ముందుగా ఇస్తే రాసిన పాటలు బాణీలు లేకుండా రాసిన వాటికన్నా స్థిరతలో నాణ్యంగా వుంటాయి.

### పాటలో ఏకసూత్రత

మొదటి రెండు తరాల రచయితల్లో ఎక్కువ మంది పాటను పూర్తిగా ఆలోచించి రాసినవారు. ఉదాహరణకు కృష్ణశాస్త్రి ఒక పాట మీద కొన్ని నెలలు వెచ్చించేవాడని చెప్తారు. ప్రతి పదాన్ని దాని స్థానంలో అది స్థిరంగా ఉండగలిగే వరకు కదుపుతూ ఇతర పదాల కోసం వెదుకుతూ సుదీర్ఘంగా ఆలోచించే



వాడాయన. ఆత్రేయ, ఆరుద్ర, కొసరాజు, దాశరథి, సినారె అంత కాకపోయినా కొంతైనా పాట మొత్తానికి ఏకసూత్రత సాధించటానికి ప్రయత్నించారు. శ్రీశ్రీ ఒక్కడే ఇందుకు భిన్నంగా కనిపిస్తాడు.

వేటూరిది ఈ విషయంలో శ్రీశ్రీ దారి. అందువల్ల పాట మొత్తానికి ఏకసూత్రత ఉండటం అరుదు. చాలా చోట్ల ఒకే చరణంలో కూడ కనిపించదు. అతని దృష్టి ముఖ్యంగా ఉండేది పదాల పేర్పు మీద, పక్కపక్క పదాల మధ్య ధ్వని సంబంధాల మీద. *శంకరాభరణం* లోని పాటల విషయంలో ఇదెలా నిజమో పైన చూశాము. ముప్పై ఏళ్ల తర్వాత ఇటీవల వచ్చిన కంత్రీ చిత్రంలో 'వయస్సునామీ వచ్చెనమ్మో' అన్న ఒక పాట తొలి చరణం

ఎరక్కపోయి యం యమా
ఇరుక్కుపోయా ప్రియతమా
తళుక్కుమన్న తమకమా
చిటుక్కుమన్న చిమచిమా

లేడివేటకు వేడిగవచ్చే వేటగాడివి నీవా
వేటకోసం వాడిగచూసే మాయలేడివి నీవా
చనువిచ్చాక మదనా నేనోపగలనా నిన్నాపగలనా

"ఇప్పుడొస్తున్న డూయెట్లలో అర్థాలూ పాదాల మధ్య సంబంధాలూ అంటూ చూడటం చాదస్తం," అనేది సహేతుకమైన వాదనే కాని అప్పుడైనా ఇప్పుడైనా రచయిత రాయదల్చుకుంటే బాణీల పరిధిలోనే అర్థవంతంగా రాయొచ్చు. ఏమైనా ఇక్కడ మనం మాట్లాడుతున్నది ఈ చరణంలో అర్థం వుందా లేదా అని కాదు, చరణం మొత్తం మీద ఏకసూత్రత ఏదైనా అంతర్లీనంగా ఉందా అనేది. అలాటిదేమీ లేదనేది స్పష్టం. అలాగే మనం అనుకున్న సూత్రాలు ఈ పాటకీ చక్కగా వర్తిస్తాయనేదీ స్పష్టమే.

### రొట్టె విరిగి నేతిలో

వేటూరికి దొరికిన ఒక అదృష్టం, ఇళయరాజా సంగీత దర్శకుడిగా రంగప్రవేశం చేసి చిత్రసీమని తల్లకిందులు చెయ్యటం, అక్కడినుంచి పాటకన్నా బాణీకే ప్రాధాన్యత అని అందరూ ఒప్పేసుకోవటం. బాణీకే పాట రాయాల్సి రావటం వేటూరికి అనుకూలంగా ఉండటమే కాదు, ఆత్రేయ లాటి పోటీదారుల్ని పక్కకు నెట్టేసింది కూడ. దాంతో వేటూరి రొట్టె విరిగి నేతిలో పడింది. మూస బాధల పంజరం నుంచి బయటపడి వేటూరి కలం రెక్కలు విచ్చుకుని ఎగిరింది. ఉదాహరణకి గీతాంజలి సినిమాఖుం 'ఆమనీ పాడవే హాయిగా' అన్నపాట మెత్తటి పదాల పేర్పుల్తో చాలా హాయిగా సాగిపోతుంది. 'వయస్సులో వసంతమే ఉషస్సులా జ్వలించగా / మనస్సులో నిరాశలే రచించెలే మరీచిక / స్వరాల రాయగా పదాల సంపద / తరాల నా కథ క్షణాలదే కదా / గతించిపోవు గాథ నేనని' ఇలా.

అర్థాన్ని ధ్వని ద్వారా సూచిస్తూ మెత్తగా సాగిపోవటం వేటూరి పాటల్లో ఒక ముఖ్య లక్షణం. శ్రోతల్లో అతికొద్దిమందే పాటల్లో ప్రతిపదార్థాల కోసం వెదుకుతారనే సత్యాన్ని గ్రహించి చరించినవాడు, ఆచరించినవాడు వేటూరి.

ఇందుకు ఎన్నైనా పాటల్ని నిదర్శనాలుగా చూపొచ్చు. ప్రసిద్ధమైన ఒక పాట-

'రవివర్మకే అందని ఒకే ఒక అందానివో / రవి చూడని పాడని నవ్యనాదానివో' అన్న పల్లవిలో అందని అందానివో, చూడని-పాడని, అందానివో-నాదానివో అన్న శబ్ద చమత్కారాలు అర్థాన్ని పట్టించుకోనివ్వవు. ఐతే ఈ చిత్రంలో నాయకుడి పేరు రవి అని తెలిస్తే, రెండో పాదంలో ఏదో అర్థం ఉన్న భ్రాంతి కలుగుతుంది. సినిమా పాటకు ఆపాటి చాలు అని గ్రహించటం వేటూరి చాతుర్యం. అదే అతన్ని విజేతని చేసింది.

ఇంకో ఉదాహరణ చూద్దాం. 'అన్నులమిన్నల అమ్మడి కన్నులు గుమ్మడి పువ్వులులే / తొలిసిగ్గుల మొగ్గల బుగ్గలు కందిన పుత్తడి అందములే' అన్నదీ పేరున్న పాటే. ఈ పల్లవిలో కూడ ఎన్నో శబ్దాలంకారాలున్నాయి. అన్నీ మెత్తమెత్తటి మాటలే. ఇందులో తొలిచరణం

ఆ దేవుడు ఆదేవితో అలక పూనెనేమో
ఈ రూపుగ శ్రీదేవిని ఇలకు పంపెనేమొ
మోహనాల సోయగాల మేనకో
మరి దేవలోకపారిజాత మాలికో



లక్ష్మిగా 'ఇలకు' వచ్చి మేనగ్గా మారటంలో ఔచిత్యం ఏమిటో?

వేటూరి పాటల రచనావిధానాన్ని అవధానంతో పోల్చి కూడ అర్థం చేసుకోవచ్చు. నిజానికి చాలా సందర్భాల్లో ఆయన చుట్టూ అసిస్టెంట్ డైరెక్టర్లు పాటలు రాసుకోవటానికి ఆత్రంగా కూర్చుని వుంటే ఒక చెట్టు కింద ఆశీనుడై ఒక్కొకరికి ఒక్కో పాదం చెప్తూ అవధానంలాగానే చేస్తుండేవాడని చూసినవాళ్లు చెప్తారు. కనక ఈ పోలిక నిజానికి దగ్గర. అవధానంలో అవధాని ఎలా మాటల్ని పేర్చుకుంటూ ఏ పాదానికి ఆ పాదాన్ని తయారుచేసి ముందుకు సాగుతుంటాడో అలా వేటూరి పాటలు కూడ సాగుతాయి సాధారణంగా (ఎక్కడన్నా మొత్తం పాటని మనసుపెట్టి కట్టిన సందర్భాలు లేకపోలేదు గాని బహు తక్కువ. ఈ దుర్యోధన దుశ్శాసన అన్న పాట, అన్నమయ్య జననం గురించిన పాట ఆ కోవలోవి). అలాగే అవధానాల్లో ముఖ్యం అర్థం కాదు, ధ్వని. పృచ్ఛకుడు అడిగిన దానికి ఎక్కడో అక్కడ ఎంతో కొంత సంబంధం ఉన్నట్టుగా అనిపిస్తే చాలు. వేటూరి పాటలకు కూడ అదే ప్రమాణాన్ని వాడాలి.

ఎంతో పేరు తెచ్చుకున్న 'తకిట తధిమి' అన్న పాట చూసినా ఈ గుణాలు చక్కగా కనిపిస్తాయి. తొలిచరణం

*నరుడి బ్రతుకు నటన ఈశ్వరుడి తలపు ఘటన*
*ఆ రెంటి నట్టనడుమ నీకెందుకింత తపన*
*తెలుసా మనసా నీకిది తెలిసీ అలుసా*
*తెలిసీ తెలియని ఆశల వయసీ వరస*
*ఏటిలోని అలల వంటి కంటిలోని కలలు కదిపి*
*గుండియలను అందియలుగ చేసి*

శబ్దాల్తో చెయ్యగలిగిన చమత్కారాలన్నీ చేశాడిక్కడ. ఎక్కడా ఎలాటి ఒడుదుడుకులూ లేకుండా సూటిగా సాగిపోతుంది పాట. ఐతే ఏ పదానికా పదాన్ని తీసుకుని అర్థం విచారిస్తే ఏకసూత్రత దొరకటం కష్టం. కొంత వేదాంత ధోరణి, జీవితం అశాశ్వతం అన్న ధ్వని, ఏదో లోతైన విషయమే ఉన్నట్టుంది అనిపించే భావ భ్రమ- ఇవీ ఇక్కడ ముఖ్యమైన విశేషాలు.

## భాషా చమత్కారాలు

వేటూరి తన ప్రతిభను ధారాళంగా చూపించింది భాషాపరమైన కొత్తదనంలో అని పైన చెప్పుకున్నాము. ఇందుకు కొన్ని ఉదాహరణల్ని ఇప్పుడు చూద్దాం.

వేటూరికి ముందు 'ఎన్నెల', 'పలకాల' లాటి 'గ్రామ్యరూపాల్ని' కేవలం తక్కువరకం పాత్రల పాటల్లోనే వాడేవారు. మూగమనసుల్లో 'నా పాట నీ నోట పలకాల సిలక' అన్నది ఒక మంచి ఉదాహరణ. ఆ సందర్భంలో పాత్రల సంభాషణ ద్వారా కూడ ఇలాటి మాటలు 'శిష్టులు' మామూలుగా అనరని బల్లగుద్ది చూపించారు. హీరో హీరోయిన్ల పాటల్లో 'వెన్నెల'ని 'ఎన్నెల' అని రాసిన రచయితలు అంతకుముందు కనిపించరు. వేటూరి ఈ పని ఎంత తరచుగా చేశాడంటే, ఇప్పుడు 'వెన్నెల' అనే పదమే సినిమా పాటల్నుంచి నిష్క్రమించినట్టుంది. 'వెన్నెల' కన్నా 'ఎన్నెల' వినటానికి బాగుంటుందని వేటూరి గ్రహించటమే దీనికి మూలం. ఆ రెంటిలో ఏదైనా సమానంగానే సరిపోయే సందర్భాల్లో కూడ అతను 'ఎన్నెల' అనే వాడటం ఇందుకొక తార్కాణం. ఉదాహరణకు 'ఎన్నెల్లో గోదారి అందం' అన్న పాట.

అలాగే, మామూలుగా చివర 'లి' అనే అక్షరం వుండే 'పలకాలి' లాటి పదాల్ని వేటూరి 'ల' అంతాలుగా చేశేశాడు. ఐతే ఇది మొదట్నుంచి ఉన్నది కాదు. ఉదాహరణకి 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను' అన్న తొలిరోజుల పాటలో తొలిచరణం

*నాలోని అందాలు నీ కన్నుల ఆరేసుకోనీ*
*సందెవేళ*
*ఈపూట నాపాట నీపైటలా దాచేసుకోనీ*
*తొలిపొంగుల*
*నీచూపు సోకాలి - నా ఊపిరాడాలి*
*నీ జంట నా తీపి చలిమంట కావాలి*

తొలి రెండు చరణాల అంత్యాక్షరాలు 'ల' ఐనా కూడ చివరి చరణాలు 'లి'తో ముగుస్తాయి. దీనికి కొన్నేళ్ల తర్వాత వచ్చిన అభిలాషకి రాసిన 'సందెపొద్దుల కాడ' అనే పాట తొలిచరణం-

*కొండాకోన జలకాలాడే వేళ కొమ్మారెమ్మా చీరే*
*కట్టేవేళ*



పిందే పండై చిలక కొట్టేవేళ పిల్లాపాప నిదరే
పోయేవేళ
కలలో కౌగిలే కన్నులు దాటాల
ఎదలే పొదరిళ్లై వాకిలి తియ్యాల
ఎదటే తుమ్మెద పాట పువ్వులబాట వెయ్యాల

అలాగే ఇంటింటి రామాయణంలో ప్రసిద్ధమైన పాట

వీణ వేణువైన సరిగమ విన్నావా
తీగ రాగమైన మధురిమ కన్నావా
తనువు తహతహ లాడల చెలరేగాల
చెలి ఊగాల ఉయ్యాల ఈ వేళలో

ఆ తర్వాత వేటూరి ఇలాటి పదాలకి 'లి' రూపం వాడిన పాటలే లేవేమో!

ఈ పాటలు వేటూరి తెచ్చిన మరోమార్పుకి కూడ మంచి ఉదాహరణలు. అది 'మామూలు' పాటల్లో గ్రామీణభాషని వాడటం. అంతకుముందు రచయితలు ఇలాటి పాటలు హీరో హీరోయిన్ల 'డ్రీం సాంగ్స్'లో అవసరమైతే వాడేవాళ్లు తప్ప విద్యాధికులైన పాత్రలు మెలకువగా పాడుకునే పాటల్లోకాదు (ఉదాహరణకు ప్రేమనగర్ లో 'కడవెత్తుకొచ్చింది కన్నెపిల్ల' అన్న పాట). సీతారామయ్యగారి మనవరాలు అన్న సినిమాకోసం రాసిన ఓ పల్లవి-

పూసింది పూసింది పున్నాగ
పూసంత నవ్వింది నీలాగ
సందేళ లాగేసె సల్లంగ
దాని సన్నాయి జళ్లోన సంపెంగ

విషమసమాసాల్ని విస్తృతంగా వాడటంలో కూడ వేటూరే ఆద్యుడు. అదివరకు ఆరుద్రలాటివారు ఎప్పుడన్నా చేసినా అవి ప్రయోగాలుగానే వుండేవి, హాస్యపాత్రల పాటలకి పరిమితమయ్యేవి. వేటూరి వాటిని సర్వసాధారణాలు చేశాడు. ఉప్పొంగెలే గోదావరి అనే పాటలో 'భూదారి' లాటి మాటలు మొహమాటపడకుండా వాడేశాడు. ఇక అన్నమయ్య సినిమా కోసం రాసిన 'అస్మదీయ మగటిమి తస్మదీయ తకధిమి / రంగరించు సంగమాలు భంగభంగారె భంగా' అన్న పాటలో మాటలు అర్థాల గృహ నిర్బంధాల్ని తెంచుకొని వీధుల్లో వీరవిహారం చేస్తాయి.

వేటూరి ప్రవేశపెట్టిన మరొక కొత్తదనం పాటల్లో హీరోల పేర్లు, బిరుదులు చొప్పించటం. ఉదాహరణకి ఆర్య సినిమాలో 'అ అంటే అమలాపురం' అన్న పాటలో 'అల్లువారి పిల్లగాడ / అల్లుకోరో సందెకాడ' అంటాడు. ఇక చిరంజీవి గురించి ఎన్నో పాటల్లో చూస్తాం. చూడాలని ఉంది అనే సినిమా కోసం రాసిన 'యమహా నగరి' అన్న పాటలో 'చిరు త్యాగరాజు నీ కృతినే పలికెను మరి' అంటాడు.

వేటూరి చేసిన మరొక ప్రయోగం నామ, క్రియా రూపాలకి ప్రాసలు చెయ్యటం. ఉదాహరణకి *గోరింటాకు* సినిమా కోసం రాసిన పల్లవి-

కొమ్మకొమ్మకో సన్నాయి
కోటిరాగాలు ఉన్నాయి

ఇక్కడ 'సన్నాయి'కి, 'ఉన్నాయి'కి ప్రాస. అది వరకు ఎవరూ ఇలాటివి చెయ్యలేదని కాదుగాని వేటూరి చాలా విస్తృతంగా చేశాడు. రెండు క్రియా పదాల మధ్యగాని రెండు నామవాచక పదాల మధ్య చేసే ప్రాస కన్నా ఒక నామరూపానికి ఒక క్రియకి మధ్య ప్రాస అందంగా, చెవికింపుగా ఉంటుందని గ్రహించి, ఆచరించాడు వేటూరి. అన్నమయ్య సినిమాలోని 'తెలుగు పదానికి జన్మదినం' అన్న పాటలో-

అవతరించెను అన్నమయ
అసతోమా సద్గమయ

అన్న ప్రయోగం రసికశ్రోతల్ని తన్మయుల్ని చేసింది.

వేటూరికి శబ్దం ముఖ్యం అని ఇప్పటికి ఎన్నో సార్లు చెప్పుకున్నాం. ఎలాటి సందర్భంలోనైనా అందంగా అనిపిస్తే ఎంత గ్రాంధిక శబ్దాలైనా వాడటానికి అతను వెనకాడలేదు. *శంకరాభరణం*లో పాటలు ఇందుకు ప్రబల సాక్ష్యాలు అనేది అందరికీ తెలిసిన విషయమే ఐనా ఆ సినిమా కథకి అలాటి పాటలే సరిపోతాయని సరిపుచ్చుకోవచ్చు. కాని, ఛాలెంజ్ సినిమా కోసం రాసిన ఈ పాటని ఏమనుకోవాలి?

ఇందువదన కుందరదన
మందగమన మధురవచన



*గగనజఘన సొగసులలనవే*
*తొలి వలపే తెలిపే చిలిపి సిగ్గేలనే*
*చెలి చిగురు తొడిగే వగల మొగ్గేలనే*
*ఐ లవ్యూ ఓ హారికా*
*నీ ప్రేమకే జోహారిక*

దీన్లోనూ పైన చెప్పుకున్న రకరకాల పద విన్యాసాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. చివరికి హారికకి జోహారికకి ప్రాస కూడ! శ్రోతల శ్రద్ధ అర్థం మీద కాదు శబ్దం మీదే అని తెలిసిన రచయితే ఈ పని ధైర్యంగా చెయ్యగలిగేది.

అదివరకు సినారె *ధర్మదాత* సినిమా కోసం ఇలాటి ఒక చిన్న ప్రయోగం చేశాడు 'జగదీశ్వరి పరమేశ్వరి' అన్న పాటలో. ఐతే అది ఒక తమాషా సందర్భం కోసం రాసింది. వేటూరి అలాకాదు, సందర్భంతో సంబంధం లేకుండా బావుంటుందనుకుంటే ఎక్కడైనా ఎలాటి పదాల్నైనా వాడటానికి జంకలేదు. పెళ్లిసందడి ఈ పాట కూడ ఇలాటిదే

*సౌందర్యలహరీ స్వప్నసుందరీ నువ్వే నా ఊపిరి*
*శృంగారలహరీ స్వర్ణమంజరీ రావే రసవాహిని*

అదివరకు ఇలాటి పాటల్ని పౌరాణిక చిత్రాల్లోనే విన్నాం. వేటూరి వాటిని అన్ని సినిమాలకీ పంచి పెట్టాడు.

పాటల్లో రాగాల పేర్లు చొప్పించటంలో కూడ వేటూరి అంతకుముందు ఎవరూ వెళ్లని దూరాలకు వెళ్లాడు. అదివరకు, సంగీతప్రధానమైన పాటల్లోనో లేక ఒక రాగం పేరుకు కథలో ముఖ్యపాత్ర ఉన్నప్పుడో మాత్రమే ఎప్పుడైనా కనపడేది ఈ లక్షణం. ఉదాహరణకు సినారె రాసిన 'శివరంజనీ నవరాగిణీ' అనే పాట. అలాగే మేఘసందేశం కోసం రాసిన 'పాడనా వాణి కల్యాణిగా' అన్న పాట. వేటూరికి అలాటి పట్టింపులు లేవు. సీతారామయ్యగారి మనవరాలులో పైన చెప్పిన పాట ఒక చరణంలో

'అరవిచ్చేటి ఆభేరి రాగాలకే స్వరమిచ్చావులే' అంటాడు. మరొకచోట 'కన్నుల పొంగెను కావేరి / గొంతులో పలికెను సావేరి' అంటాడు. ఇలా ఎన్నో.

అలాగే, వేటూరి చేసిన భాషాపరమైన ప్రయోగాలు వాన పాటల గురించి చెప్పకుండా ముగించటానికి లేదు. అంతకుముందు ఆత్రేయ రాసిన 'చిటపటచినుకులు పడుతూ వుంటే' అన్న వానపాట జగత్ప్రసిద్ధం. ఆయనే తర్వాత చాలాకాలానికి రాసిన 'ఏం వానో తడుపుతున్నది / ఇది ఏం గాలో తరుముతున్నది' అన్న పాట కూడ బాగానే ప్రచారం పొందింది. ఐతే వేటూరి వానపాటల్లో కూడ సొంత ముద్రని సాధించాడు. 'ఆకుచాటు పిందె తడిసె / కోకమాటు పిల్ల తడిసె' కొత్తతరం వానపాటలకి ఒరవడి ఐన పాట. కుందుర్తి 'నగరంలో వాన' అన్న దీర్ఘకవితని స్ఫురణకి తెచ్చే ఈ పాట చిటపటచినుకులకి సరితూగే పాట. హద్దులు లేకుండా ఎగిరే స్వేచ్ఛాభావాల్ని ఆవిష్కరించే మాటలు దీనికి ప్రాణం పోశాయి. ఈ ఒరవడిలో వచ్చిన 'వానా వానా వందనం', 'వానా వానా వెల్లువాయె', 'వానజల్లు గిల్లుతుంటే', 'స్వాతి చినుకు సందెవేళలో', 'స్వాతిముత్యపు జల్లులలో' లాటి అనేక గీతాల్లో తన పదచమత్కారాలు చూపాడు వేటూరి.

బాధని విరహాన్ని వేటూరి ఎక్కువగా ప్రతీకల ద్వారా సూచించి విజయం సాధించాడు. అదివరకు ఆత్రేయ ఇలాటి అవకాశం వచ్చినప్పుడు దేవుణ్ణి తిట్టేవాడు- 'దేవుడికేం హాయిగ వున్నాడు / ఈ మానవుడే బాధలు పడుతున్నాడు'; 'మనిషికి మనసే తీరని శిక్ష / దేవుడిలా తీర్చుకున్నాడు కక్ష'; 'మనసు లేని దేవుడు / మనిషికెందుకో మనసిచ్చాడు'; "దేవుడనే వాడున్నాడా అని / మనిషికి కలిగెను సందేహం'; 'దేవుడు మనిషై పుట్టాలి'- ఇలా ఎన్నో. వేటూరి తను మిగిలిన రచయితల కన్న విలక్షణమైన పాటలు రాయాలని పట్టుదలతో వచ్చినవాడు కనక బాధకి కూడ కొత్త సంకేతాల్ని ఎంచుకున్నాడు. వీటిలో ముఖ్యమైంది కోకిల (యథాప్రకారంగానే దాని లలితరూపం 'కోయిల'నే చాలా ఎక్కువగా వాడాడు).

*ఆమనీ పాడవే హాయిగా*
*మూగవై పోకు ఈ వేళ*
*మంచుతాకి కోయిల*
*మౌనమైన వేళల*
*ఎడారిలో కోయిల*

తెల్లారని రేయిలా
వానకారు కోయిలనై
తెల్లవారు జాబిలినై

నిజానికి ఒక్క 'ఎడారిలో కోయిల' అన్న పాట లోనే తను ఎంచుకున్న బాధల ప్రతీకల్ని పుంఖాను పుంఖాలుగా గుప్పించాడు. వేటూరి పాటల తొలి దశలో వచ్చిన ఆ ఒక్క పాట ఆ తర్వాత వచ్చిన బాధల పాటలన్నిటికి మాతృక అని చెప్పొచ్చు.

ఎడారిలో కోయిల
తెల్లారని రేయిలా
పూదారులన్నీ గోదారి కాగా
పాడింది కన్నీటి పాట

ఎదవీణపై అనురాగమై
తలవాల్చి నిదురించు నా దేవత
కల ఐతే శిల ఐతే మిగిలింది ఈ గుండెకోత

నా కోసమే విరబూసిన మనసున్న
మనసైన మరుమల్లిక
ఆమనులే వేసవులై రగిలింది ఈ రాలుపూత
విధిరాత చేత నా స్వర్ణసీత

ఆ రూపమే నా దీపమై
వెలిగింది మూణ్ణాళ్లు నూరేళ్లుగా
వేదనలో వెన్నెలగా
వెలిగించి తన కంటిపాప

చలిమంటలే చితిమంటలై
చెలరేగె చెలిలేని నా కౌగిట
బ్రతుకంటే మృతికంటే
చేదైన ఒక తీపిపాట
చెలిలేని పాట ఒక చేదుపాట

వానకో, ఎండకో, చలికో బిక్కచచ్చిన కోకిల; తెల్లారని రేయి; వేసవో శిశిరమో ఐన ఆమని; గోదారైన పూదారి; రాలే పూత; చితిమంటైన చలిమంట; చేదైన తీపిపాట; ప్రేయసి / ప్రియుడు కల కావటం, శిల కావటం- ఇవి పదేపదే వినిపించిన ప్రతీకలు.

ఈ ప్రతీకలు కృష్ణశాస్త్రికి కొంత దగ్గరగా ఉంటాయి. ఐతే ఇందులో ఆశ్చర్యం ఏం ఉండ కూడదు- వేటూరి మీద ఎంతో ప్రభావం ఉన్న భావ కవిత్వానికి ఆద్యుల్లో ఒకడైన కృష్ణశాస్త్రికి ఇలాటి ప్రతీకల్తో పాత పరిచయం వుంది. అందుకే వేటూరికి ముందే

రానిక నీ కోసం చెలీ రాదిక వసంతమాసం
రాలిన సుమాలు ఏరుకొని జాలిగ గుండెల
దాచుకొని
ఇది మల్లెలవేళయని ఇది వెన్నెలమాసమని
తొందరపడి ఒక కోయిల ముందే కూసింది
విందులు చేసింది

అని కృష్ణశాస్త్రి అంటే ఆ ప్రతీకల్ని సొంతం చేసుకుని ఇంకా విస్తరించాడు వేటూరి.

రానురాను ఇలాటి పాటల అవసరం తగ్గుతూ వచ్చింది కాని అవి వున్నంతకాలం ఈ ప్రతీకల్ని విరివిగా వాడాడు.

రాగం తీసే కోయిల
కోయకు గుండెను తీయగా
రాతిరి వేళల రగిలే ఎండలా

ఇంక మరొక్కసారి వేటూరి వేసిన శ్లేషల్ని కూడ పరామర్శించి ముందుకు సాగుదాం.

శ్లేషల్లో వేటూరిది చేమకూర వెంకటకవి మార్గం అంటే అతనికి శ్లేషలు అనాయాసంగా వస్తాయి. కావా లని తిప్పలు పడితే వచ్చేవి కాదు అతను చేసిన శ్లేష చమత్కారాలు. ఉదాహరణకి అర్జున్ అనే సినిమాలోని పాట

మధుర మధురతర మీనాక్షి కంచిపట్టున కామాక్షి
మహిని మహిమ గల మీనాక్షి కాశీలో విశాలాక్షి
జాజిమల్లెల ఘుమఘుమల జావళి
లేతసిగ్గుల సరిగమల జాబిలి
అమ్మా మీనాక్షీ ఇది నీ మీనాక్షి
వరములు చిలక స్వరములు చిలక కరమున
చిలక కలదానా
హిమగిరి చిలక శివగిరి చిలక మమతలు చిలక
దిగిరావా

దీన్లో శ్లేషలు గుప్పిళ్లతో చల్లాడు వేటూరి. మధుర మధురతర, దగ్గరగా వినిపించే మాటలు కాని అర్థాలు



దూరం. ఐనా పక్కపక్కన వినిపించి ఆనందాన్ని కలిగిస్తాయి. కంచిపట్టున కంచి అనే వూళ్లో ఉన్న అని, కంచిలో నేసిన పట్టుచీర కట్టిన అని రెండర్థాల శ్లేష. ఇక చివరిభాగంలో 'చిలక' అనే పదాన్ని రకరకాలుగా చిలికేశాడు. ఒక అర్థం చిలక పక్షి అని, మరో అర్థం చిలికించటం అని, ఇంకో అర్థం ఒక ప్రదేశంలో ఉండేదని, చివరి అర్థం చిలకటం అని. ఇలా ఒకే పదాన్ని ఇన్ని విధాలుగా ఒకే సినిమా పాటలో ప్రయోగించటం ఇంకెక్కడా చూళ్లేదు.

ఒకప్పుడు ఆత్రేయ 'కుర్రకారు కోరికలు గుర్రాల వంటివి / కళ్లాలు వదిలితే కదం తొక్కుతాయి / పట్టు తప్పినంతనే పరువే తీస్తాయి / ఒళ్లు దగ్గరుంచుకుంటె మంచిదబ్బాయి' అని పరువు అన్న ఒక్క మాటని శ్లేషార్థంలో ప్రయోగించటానికి చాలా కథ చెప్పాల్సి వచ్చింది. వేటూరికి శ్లేష అప్రయత్నసాధ్యం కనక ఇలాటి తిప్పలు ఉండవు.

### *సంప్రదాయ భావాలు*

వేటూరి పాటల్లో మంచి ప్రచారం పొందిన మూడు ప్రేమలేఖల్ని ముందుగా చూద్దాం. ఒకటి *శ్రీవారికి ప్రేమలేఖ* అనే సినిమా కోసం రాసిన 'తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు' అన్నది. రెండోది *పెళ్లిసందడి* కోసం రాసిన 'మా పెరటి జాం చెట్టు పళ్లన్నీ' అన్నది. మూడోది *గోదావరి*లో 'అందంగా లేనా అలుసై పోయానా' అన్నది. ఇవి షుమారు పాతికేళ్ల కాలంలో వచ్చినవి. ఐతే మూడిటిలోని భావాలూ ఒకే మూసలోవి. పాత తరాలవి. మాటల పేర్పు మాత్రం శ్రోతల్ని ఆనందసాగరాల్లో ముంచెత్తింది.

అంతెందుకు, ఒక యువజంట గురించిన ఆర్ద్రమైన అనురాగ గీతం రాయమంటే రాసేది, 'అలివేణీ ఆణిముత్యమా, నీ కంట నీటిముత్యమా' అనా?

*పెళ్లిసందడి* చిత్రంలో మరో పాట 'నవ మన్మథుడా అతిసుందరుడా' అని మొదలయేది. అక్క చెల్లెళ్లు తమ ప్రియుల గురించి సరదాగా మాట్లాడుకోవటం గురించి. అక్క సంప్రదాయంగా పెరిగిన పిల్ల, చెల్లి నవయువతి. చెల్లి 'నవమన్మథుడా అతి సుందరుడా' అని ఆరా తీస్తే అక్క అడిగేది 'శ్రీరాఘవుడా ప్రియమాధవుడా నిను మెచ్చిన ఆ ఘనుడు' అని!

చివరికి 'వేంప్ పాటల్లో' కూడ ఇలాటి భావాలే వినిపిస్తాయి. *వేటగాడు*లో అలాటి పాట 'పుట్టింటోళ్లు తరిమేశారు కట్టుకున్నోడు వొదిలేశాడు' అనేది. ఇలాటి వేంప్ పాట అంతవరకు ఎవరూ రాయలేదు. ఏదో 'తీస్కో కోకకోల' అనో, 'లేలెలే నా రాజా' అనో పాడేవారు తప్ప ఇలా వదిలేసిన మొగుళ్ల గురించీ తరిమేసిన తల్లిదండ్రుల గురించీ వేంప్‌ల చేత పాడించటం వేటూరికే చెల్లింది.

దీనికి మరొక పార్శ్వం ఏమంటే, వేటూరి పాటల్లోని ఈ గుణాన్ని కొందరు దర్శకులు చక్కగా వాడుకుని మరిచిపోలేని పాటలు రాయించారు. పైన చూపిన 'మధుర మధురతర మీనాక్షి' అలాటిది. ఇటీవలి *గోదావరి*, *మాయాబజార్* లాటి చిత్రాలలోను ('సరోజదళనేత్రి ఇదో లాహిరి'), అంతకుముందు విశ్వనాథ్ అనేక సినిమాల్లోను మనం ఈ విశేషం చూస్తాం. *సప్తపది*లో 'వ్రేపల్లియ ఎద ఝల్లన పొంగిన మురళి' అన్న పాట ఈ కారణం వల్లనే చాలా పేరు తెచ్చుకుంది.

### *చివరి దశ*

వేటూరి మొదలెట్టిన పాటల విప్లవం ఇరవై ఏళ్లకు పైగా నిలకడగా నిలబడింది. శ్రోతలు మెచ్చుకున్నారు. పరిశ్రమ నెత్తికెత్తుకుంది. 'కోటి రూపాయల పాట'లు ఎన్నో ఆ కలం నుంచి జాలువారాయి.

80ల మొదటి నుంచి 90ల మధ్య వరకు తన పాటలకు స్వర్ణయుగం అని వేటూరి చెపవికున్నాడు. ఇది నిజం. వేటూరి పాటల ప్రాథమిక సూత్రాలు ఆ కాలానికి అన్ని విధాలా అతికినట్టు సరిపోయాయి. ఇళయరాజా, వేటూరి కలిసి తెలుగు శ్రోతల్ని మంత్రముగ్ధుల్ని చేసి ఆడించారు. చెత్త సినిమాల్ని సైతం పాటల మహిమతో పాతిక వారాలు ఆడించారు.

ఐతే 90ల చివర్లో తెలుగు సినిమా పాటకి మరో దశ వచ్చింది. లయకి మహర్దశ పట్టింది. శబ్దాన్ని చిన్న పీట మీదికి దించింది. అర్థానికి అర్థం లేకుండా చేసింది.

ఇలాటి స్థితిలో వేటూరి ఇంతకాలం సమర్థవంతంగా సంధించిన అస్త్రాల అవసరం తీరిపోయింది.



మాట వినపడనప్పుడు అది ఏదైనా ఒకటేకదా! పాట ఒక భాషలో ఉండాలన్న నియమం లేదు, అసలు అదేదో భాష అయియుండాల్సిన అవసరం కూడ లేదు. 'తను పాడిందే పాట' అన్నది సార్థకమైపోతుంది. ఎవరైనా పాట రాసెయ్యొచ్చు. దాంతో సంగీత దర్శకులే 'ఆడా పాడా మద్దెల కొట్టా' అన్నట్టు పాట గాళ్లుగానే కాదు, కూతల రచయితలుగా కూడా బహు పాత్రాభినయాలు ఆరంభించారు.

వేటూరి ఈ కాల ప్రభావాన్ని గుర్తించాడో లేదో చెప్పటం కష్టం. ఎందుకంటే ఈ మారుతున్న పాటకి అనుగుణంగా కొత్త అస్త్రాల్ని తయారుచేసుకోలేదు, కొత్త సూత్రాల్ని సిద్ధాంతీకరించుకోనూ లేదు. చాపకింద నీరులా వస్తున్న మార్పుల్ని అవలా వస్తున్న సమయంలో గమనించకపోవటానికి మంచి అవకాశాలున్నాయి. ఐతే మార్పుల్ని గమనించాక కూడ వాటిని విమర్శించటానికి పూనుకున్నాడే తప్ప ఈ కొత్త ప్రపంచంలో ఇమిడిపోవటానికి గట్టిగా ప్రయత్నించ లేదు. అంటే ఈ మార్పులు తాత్కాలికాలనైనా అనుకుని వుండొచ్చు లేదా వాటితోపాటు తనూ మారటం సాధ్యం కాదని నిర్ధారించుకుని వుండొచ్చు. రెండోది నిజం కావటానికి ఎక్కువ అవకాశాలున్నాయి.

దీంతో వేటూరి పాటలో పదును తగ్గింది. ఎప్పుడన్నా ఒక 'వినిపించే పాట' రాసే అవకాశం వచ్చినా అప్పటికే అతనికి నీరసం వచ్చేసింది. ఉదాహరణకి రామదాసు చిత్రం కోసం రాసిన భద్రాచలం గురించిన పాట గుర్తుంచుకోదగ్గది కాదు. అన్నమయ్య జననం గురించి రాసిన పాటకీ దీనికీ ప్రతిభలో హస్తిమశకాంతరం వుంది. అలాగే స్వరాభిషేకం సినిమా కోసం రాసిన 'అనుజుడై లక్ష్మణుడు' అన్న పాట చాలా నీరసంగా సాగుతుంది. ఈ రెండూ వేటూరి అభిరుచులకు మంచి అనువైన సందర్భాలైనా వాటిని సరిగా ఉపయోగించుకోలేకపోయాడు. ఎందువల్లనో ఎప్పుడూ వాడే శబ్దాస్త్రాలు కూడ వీటి విషయంలో స్ఫురణకి రాలేదు. ఇటీవలి చిత్రాల్లో ఇలాటి ఉదాహరణలు చాలానే కనిపిస్తాయి చివరికి చివరి దశలో పాత పాటల్ని మక్కికి మక్కి దించటం కూడ జరిగింది ఒక ఉదాహరణ 'ఆకాశంలో ఒక తార' అని ఇప్పుడు మళ్లీ వినిపిస్తున్న పాట.

వేటూరి తర్వాత రంగప్రవేశం చేసిన రచయితల్లో సీతారామశాస్త్రి కొంతవరకు వేటూరిని అనుసరించాడు. ఐతే ఇద్దరికీ ఒక తేడా సీతారామశాస్త్రి తీవ్రంగా ఆలోచించి పాటని రాస్తాడు. అందువల్ల అతని పాటల్లో కొంత అర్థ సమన్వయం ఉంటుంది. వీలైనప్పుడల్లా వేటూరిలా శబ్దవిన్యాసాలు ప్రయత్నిస్తాడు కాని అర్థాన్ని శబ్దానికి బలివ్వడు. ఐతే వేటూరికున్న శ్లేషాధిపత్యం కాని శబ్దపాండిత్యం కాని ఇతనికి లేవు. ఇప్పుడున్న మిగిలిన రచయితల్లో ఎవరూ చెప్పుకోదగ్గ విలక్షణతని చూపించేవారు కనిపించరు. ఐతే ఎవరూ వేటూరిని అనుకరించటానికి ప్రయత్నిస్తున్నట్టూ కనిపించరు. బహుశా వేటూరి మార్కు పాటలకు కాలం చెల్లిపోయిందని వాళ్ల అభిప్రాయం అయుండొచ్చు కూడ.

### ముగింపు

శబ్దానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సినిమా పాటని రక్తి కట్టించిన వాడు వేటూరి. చెవికి ఇంపుగా ఉండటం సినిమా పాటకి ఉండాల్సిన ఏకైక లక్షణమని గుర్తించి అందుకు అవసరమైతే విషమ సమాసాలు చేశాడు, మాటలకి గ్రామ్యరూపాలు వాడాడు, నోరు తిరగని గ్రాంధిక సమాసాల్ని అవలీలగా అతికించేశాడు. భాషాపరంగా ఎన్నో ప్రయోగాలు చేశాడు. ఇవి వేటూరి పాటని చాలాకాలం నిలబెడతాయని అనుకోవటం ఉచితమే.

*తెలుగు పలుకు (తానా సావెనీర్) 2011*




సీరియల్-3

# యండమూరి వీరేంద్రనాథ్



# వెన్నెల్లో ఆడపిల్ల



***జరిగిన కథ***

చదరంగంలో రష్యన్ ఆటగాడిపై గెలిచిన రేవంత్, స్వదేశానికి తిరిగి వచ్చాక, అతడిని అభినందిస్తూ ఓ అమ్మాయి ఫోన్ చేస్తుంది. పేరడిగితే కొన్ని క్లూలు ఇచ్చి కనుక్కోమంటుంది. తను పనిచేసే ఆఫీసులో కొత్త స్టాఫ్‌ని ఇంటర్వ్యూ చేసే బాద్యత వహించిన రేవంత్ ఆ అమ్మాయి పేరు కనుక్కోవడానికి ఇంటర్వ్యూకి వచ్చిన వాళ్లకి ఆర్‌తో మొదలయ్యే పేర్లను ఎంత ఎక్కువ రాసినవారిని సెలెక్ట్ చేసి ఫైనల్ సెలక్షన్ కోసం బాస్ వద్దకు పంపిస్తాడు. ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయిన అమ్మాయి పేరు రామచిలుక. పేరు కనుక్కోలేకపోయిన అమ్మాయి ఈసారి ఫోన్ చేసి తన ఫోన్ నెంబరు కనుక్కోమని క్లూ ఇస్తుంది. కానీ రేవంత్ నెంబరు కూడా కనుక్కోలేకపోతాడు.

## 5

"ఎక్కడో డిటెక్టివ్ నవల్లో చదివాను. మనకొచ్చే ఫోన్స్ ఎక్కణ్నుంచి వస్తున్నాయో పోలీసులు కనుక్కో గలరట".

"అవన్నీ నవలల్లో," అన్నాడు రేవంత్ విసుగ్గా.

"లేదు బ్రదర్. టెలిఫోన్ టాపింగ్ సిస్టమ్ అని ఒకటుందట. మనం పోలీసుల సహాయం తీసుకుందాం."

"ఇదేమన్నా క్రిమినల్ కేసా? ఏమని రిపోర్టు ఇస్తాం?" నిస్సహాయంగా అన్నాడు రేవంత్.

"పోనీ ప్రైవేటు డిటెక్టివ్?"

"నోర్మూయ్యి."

"ప్రయత్నం చెయ్యటంలో తప్పులేదుగా," అంటూ ఫోన్ తీసుకుని డయల్ చేశాడు జేమ్స్.

"హల్లో," అని అట్నుంచి వినపడింది. రేవంత్ కంగారుగా కుర్చీలోంచి లేచి, "ఎవరికి చేస్తున్నావ్? పోలీస్ స్టేషన్‌కా?" అని అడిగాడు.

మాట్లాడవద్దనట్టు చెయ్యి అడ్డుపెట్టి టెలిఫోన్‌లో సంభాషణ కొనసాగించాడు జేమ్స్. "మాక్కొద్దిగా సహాయం కావాలండీ! అబ్బెబ్బె మీ సాయం కాదు. టెలిఫోన్స్‌కి సంబంధించిన ఇన్ఫర్మేషనండీ... ఏమిటీ... మీది ట్రంక్ అసిస్టెన్సా... పి.ఆర్.వో.కి ఫోన్ చెయ్యమంటారా... అబ్బే ఎందుకండీ... మీరు క్షణంలో చెప్పెయ్యగలరు... ఊహూ... ఫోన్ పెట్టెయ్యకండి ప్లీజ్... మీ కంఠంలాగే హృదయమూ మెత్తనిదని మాకు తెలుసు. భలేవారే... మరోలా అనుకోకండి. ఏదీ... అసలు విషయం చెప్పకుండా ఉపోద్ఘాతంతోనే సరిపెట్టేస్తున్నాను..."

'ఓరి ఇడియట్. నిజంగా రాజకీయాల్లో ఉండవలసిన వాడివిరా నువ్వు,' అనుకున్నాడు రేవంత్.

"ఆఁ... అవునండీ మరే... మా ఫోనే... ఒకమ్మాయి... అబ్బేబ్బే బ్లాక్‌మెయిల్ కాదండీ... ఆ... నా మొహం. ప్రొద్దున్న చూస్తే సాయంత్రం కలలోకి వస్తాను. నాకే అమ్మాయి చేస్తుందండి? నా స్నేహితుడు ఇంటర్నేషనల్ ఛెస్ ప్లేయరు. ఒక అభిమాని తన పేరు చెప్పకుండా ఏడిపిస్తోంది. ఆమె ఏ నెంబర్నుంచి చేస్తోందో కనుక్కోవాలి. అంతే. పోలీసులు చెయ్యరా? అవున్లెండి. వాళ్లకి ఇదే పనా ఏమిటి? అయితే మీ సలహా... మమ్మల్నే ఒక ఫాల్స్ కంప్లయింట్ ఇమ్మంటారు. ఎవరికి అడ్రస్ చెయ్యాలి? జనరల్ మేనేజర్ టెలిఫోన్స్... ఒక్క నిముషం మేడమ్. వ్రాసుకుంటున్నా. థ్యాంక్యూ. పెట్టేస్తున్నానండీ. బైదిబై గత జన్మలో ఏ పుణ్యం చేసుకుందో, ఎన్ని తీర్థయాత్రలు చేసిందో... మీలాంటి స్నేహశీలులు, త్యాగమూర్తులూ ఉన్న టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ ధన్యమైనది," అంటూ ఫోన్ పెట్టేశాడు.

ఫోన్ డిస్కనెక్ట్ చేసి కుర్చీ వెనక్కి వాలి పడిపడి నవ్వసాగింది సులోచన చాలాకాలం తరువాత మనస్ఫూర్తిగా.

"ఏమిటి. నీలో నువ్వే నవ్వుకుంటున్నావ్" అడిగింది శైలజ.

"ఏంలేదు. ఎవరో సాయం కావాలంటే అసిస్ట్ చేశాను. ట్రంక్ అసిస్టెన్స్ కాదులే. పెర్సనల్ సాయం," అంటూ ఫోన్ ట్రాపింగ్ గురించి చెప్పింది. వాళ్లిద్దరూ మాట్లాడుకుంటూంటే సూపర్‌వైజర్ వచ్చింది. నలభై ఏళ్లు ఉంటాయి. స్థూలకాయం. వాళ్లు మాట్లాడుకోవటం చూసి మొహం చిట్లించి, "బోర్డు చూడు, కాల్స్ పెండింగ్‌లో ఉన్నట్టున్నాయ్," అన్నది. ఆమె కంఠంలో విధి నిర్వహణకన్నా హోదా చూపించాలన్న తపనే ఎక్కువ ఉంది. శైలజ నిర్లక్ష్యంగా తల ఎగరేసి బోర్డు వైపు తిరిగింది.

సులోచనకి నవ్వొచ్చింది. శైలజకీ, సూపర్‌వైజర్‌కీ ఒక్కక్షణం పడదు. చాలారోజుల క్రితం జరిగిన సంఘటన. ఆ రోజు శైలజ 102లో ఉండగా ఆమె కంఠం బాగుందనీ, ఆమెని చూడకపోతే అంబులెన్సే గతి అనీ ఓ అబ్బాయి ఫోన్లో వేధించసాగాడు. ఆపరేటర్స్ సాధారణంగా ఇటువంటి కాల్స్ పట్టించుకోరు. మరీ శృతిమించితే మానిటర్‌కి కంప్లయింట్ చేస్తారు. ఆమె ఎన్నిసార్లు డిస్కనెక్ట్ చేసినా మళ్లీ చేశాడు. 102 కాల్‌కి ఛార్జి ఉండదు. పొజిషన్ 102 అవటంతో

ఆమెకే వచ్చేది. 'ఏవండీ, రేపు ఊరెళ్లిపోతున్నాను. ఈ రోజు కలవండి. ప్లీజ్,' అంటూ వేధించసాగేడు. బి.కామ్. పాసయ్యాడట. గుంటూరులో పొగాకు బిజినెస్ ఉందట. వివరాలన్నీ చెప్పసాగేడు. 'ఊరెళ్ల బోయే ముందు ఒక సాయంత్రం గడపటానికి ఇంకెవరూ దొరకలేదన్నమాట,' అని ఆమెకు వళ్లు మండిపోయింది. సూపర్‌వైజర్‌కి చెబ్దామా అనుకొని, మళ్లీ ఆమె మనస్తత్వం తెలిసి 'ఎందుకులే' అని ఊరుకుంది. ఇలాంటి అవకాశం దొరికితే ఆవిడ ఊరుకోదు. అన్యాపదేశంగా ఏవో సెటైర్లు విసురుతూనే ఉంటుంది.

శైలజ మౌనాన్ని మరోలా అర్థం చేసుకొని ఆ కుర్రవాడు మరింత ముందుకు సాగి, రాత్రి సినిమా గురించీ, డిన్నర్ గురించీ కూడా మాట్లాడసాగేడు. ఇక లాభం లేదనుకుని, "మీ వయసెంతండి," అని అడిగింది. ఆమె ఆ మాత్రం ఇంటరెస్ట్ చూపించేసరికి అతడు పొంగిపోయి 'ఇరవై' అన్నాడు. 'ఇరవయ్యేళ్లకే ఇంతలా తయారయ్యావా నాయనా,' అని మనసులో అనుకుని, "మరి నన్నెక్కడ కలుసుకుంటారు?" అని అడిగింది.

"దానిదేముందండీ. మీ ఆఫీసయ్యే టైముకి నే వచ్చి గేటు దగ్గర నిలబడతాను. అట్నుంచటే సినిమాకి, ఆ తరువాత డిన్నర్‌కి. ఆ తరువాత..." అంటూ నసిగేడు.

వస్తున్న కోపాన్ని బిగపట్టి, "మరి నన్నెలా గుర్తుపడతారు?" అని అడిగింది.


"చెప్పండి. మీరే రంగు చీర కట్టుకున్నారు?"

ఇంతలో భుజం పక్కనుంచి, "ఏమిటమ్మాయ్? ఎవరూ?" అని వినిపించడంతో చప్పున డిస్కనెక్ట్ చేసింది. సూపర్‌వైజర్ నల్లచీరెలో కాళిలా పక్కనే నిలబడి క్రూరంగా చూస్తూ ఉంది.

ఆమె వెళ్లిపోయిన నిముషం తరువాత మళ్లీ ఫోన్ మ్రోగింది. "ఏమిటి డిస్కనెక్ట్ చేసేరు?"

"అబ్బే, ఏంలేదు. సాయంత్రం ఐదింటికి ఎక్స్చేంజ్‌కి వచ్చేయండి. నేను బస్‌స్టాప్‌లో నిలబడి ఉంటాను. గుర్తుపట్టడం తేలిక. ఈరోజు కట్టుకున్నది నల్లచీర. కొంచెం లావుగా ఉంటాను. పోతే మీరు నన్ను చూసి డిస్సపాయింట్ అవుతారేమో. నా వయసు నలభై."

"అబ్బెబ్బే. ఏమీ పర్లేదు. అసలా వయసు వాళ్లంటేనే నాకిష్టం," అన్నాడు.



'ఓహో అలాగా...' అనుకొని, "మీరెలా వస్తారు? ఆటోలోనా?" అని అడిగింది. అవునన్నాడు.

"మీరు ఆటో ఆపగానే నేను ఎక్కితే బాగోదు. చూసేవాళ్లు ఏమైనా అనుకుంటారు".

"మరేం చేద్దాం?"

"ఆటో దిగి, 'హల్లో మంగళా!' అని పలకరించండి. పక్కనెవరూ లేకపోతే వెంటనే వచ్చేస్తాను. పక్కనే ఎవరైనా ఉంటే నా మేనల్లుడని పరిచయం చేస్తాను. మీరు మాత్రం, 'పద ఆంటీ. సినిమాకి టైమయిపోతోంది,' అని తొందరపెట్టేయ్యాలి. మొత్తం మీద చూసేవాళ్లకి మీరు నా దగ్గిర బంధువని అనిపించాలి. సులోచనారాణిగారి నవల్లో హీరో హీరోయిన్ రెక్క పట్టుకుని కుదేసినట్టు కుదేసినా పర్లేదు కానీ మీరూ, నేనూ అదే మొదటిసారి కలుసుకోవటం అన్న అభిప్రాయం ఎవరికైనా కలిగిందంటే మాత్రం నా పరువు పోతుంది. అందులోనూ ఆ సమయంలో అక్కడ మా ఆఫీసువాళ్లు చాలామంది ఉంటారు."

"పర్లేదు. అంతా నేను చూసుకుంటాగా," హుషారుగా అన్నాడు.

సాయంత్రమవుతున్నకొద్దీ శైలజకి టెన్షన్ ఎక్కువ కాసాగింది. జరిగిందంతా సులోచనకి చెప్పింది.

సాయంత్రం ఐదింటికి బస్‌స్టాప్ దగ్గిర సీన్ జరిగింది. సూపర్‌వైజర్ మంగళ బస్‌స్టాప్ దగ్గిర నిలబడి ఉండగా ఆటో ఆమె ముందు ఆగింది. మూడో అంతస్థు కిటికీ అద్దాల్లోంచి సులోచనా, శైలజా ఊపిరి బిగపట్టి చూస్తున్నారు. ఆగిన ఆటోలోంచి ఒకబ్బాయి దిగి ఆమెతో ఏదో అనటం... ఆమె కంగారుపడి పక్కామె వైపు తిరగటం... ఆ అబ్బాయి మరింత దగ్గరకి వచ్చి చనువుగా ఏదో అనటానికి ప్రయత్నించటం... అబ్బాయి చెంప ఛెళ్లుమనటం... అంతా సినిమాలోలా గిర్రున తిరిగిపోయినయ్. దూరం నుంచి చూస్తున్న ఇద్దరికీ నవ్వు ఆగటం లేదు.

అంతా అయ్యాక మాత్రం సులోచన, "వాడుగానీ 102 సంగతి చెప్పుంటే నీపని ఏమై ఉండేది," అని తిట్టింది.

"ఆ మాత్రం రిస్కు తీసుకోకపోతే థ్రిల్ ఏముంది," నవ్వేసింది శైలజ. నిజమే. నిస్సారమూ, నిరాపేక్షమూ, నిర్వీర్యమూ అయిన ఆ ఉద్యోగంలో ఇలాంటి చిన్న చిన్న అనుభవాలే చెణుకులు.

పగటికన్నా రాత్రి డ్యూటీల్నే సులోచన ఎక్కువగా కోరుకునేది. ఇరుకుగది, ఒంటరితనం, నిరర్థకమైన రాత్రి ఆమెని భయపెట్టేవి. రాత్రిళ్లు పని కూడా తక్కువే ఉంటుంది. ముఖ్యంగా జీరో అవర్ దాటిన తరువాత. కానీ డార్మెటరీస్‌లో నిద్రపట్టేది కాదు. సంస్కారం లేని 'వాగుబోతు అమ్మాయిలు' మిగతావాళ్లకి నిద్రాభంగం కలిగిస్తూ తెల్లవారే వరకూ బిగ్గరగా మాట్లాడుకునేవాళ్లు.

డ్యూటీలో ఉంటే ప్రొద్దునే నాలుగింటికి సుప్రభాత మేలుకొలుపులు చెయ్యాలి. అలారం లేని, లేదా లేవటానికి బద్ధకమున్న కస్టమర్సు ఫలానా టైముకి లేపమని డిపార్టుమెంటుని అడగొచ్చు. మామూలు సమయాల్లో ఇలాంటి 'మేలుకొలుపులు' రోజుకి ఏడొందలదాకా ఉంటే, రంజాన్, క్రిస్మస్‌లాటి రోజుల్లో పదిహేనువందల దాకా ఉంటాయంటే అతిశయోక్తి కాదు. చెప్పిన టైమ్‌కి సుప్రభాతం పాడి లేపాలి. పదిమందిదాకా ఆపరేటర్లు మిషన్స్‌లాగా పనిచేసినా ఈ సేవ పూర్తి అవదు. 'అయిదింటికి లేపమంటే అయిదుంపావుకి లేపుతావా,' అని కోప్పడేవాళ్లూ, నిద్ర నుంచి లేవడానికి విసుక్కునేవాళ్లూ, ప్రొద్దున్నే ఫోన్లో రొమాన్సు చేసేవాళ్లూ...! తాగుబోతుల్తో ఫోన్ అనుభవాలు మరోరకం. ఒకడెవరో రాత్రి రెండింటికి బాగా మందు కొట్టి ఫోన్ చేసేడు. "నిద్ర పట్టటం లేదు మేడమ్. నాతో పాటు మీరూ ఎంజాయ్ చెయ్యండి," అంటూ ఫోన్ పక్కన అడవిరాముడు పాటల టేప్ పెట్టి పడుకున్నాడు. గంటవరకూ అది మ్రోగుతూనే ఉంది. పని లేనప్పుడల్లా ఆ 'కీ' ఓపెన్ చేసుకుని విన్నది.

ఇలాంటివే చాలా థ్రిల్లింగ్ అనుభవాలు. ఒక రోజు ట్రంక్స్‌లో ఉంది. అవతల కస్టమరు స్త్రీ. ఆమె లైన్‌లోకి వచ్చాక ఆ పైన కనెక్షన్‌లో ఫాల్టు వచ్చింది. సులోచన క్షమాపణ చెప్పి తిరిగి ప్రయత్నించసాగింది.

అవతల నుంచి ఆమె, "పర్లేదు. మాడమ్ నెమ్మదిగా ట్రై చెయ్యండి," అన్నది. ఢిల్లీ నుంచి హైద్రాబాద్ వచ్చిన కాల్ అది. కనెక్షన్ ఇచ్చాక తిరిగి మళ్లీ సగంలో డిస్కనెక్ట్ అయింది. ఇటువైపు లైన్‌లో ఉన్న మంత్రి గారు, "వెంటనే సరిచెయ్యండి. అవతలున్నది ప్రైమినిష్టర్," అంటూ కంగారుపడ్డాకగానీ తనని 'మేడమ్' అని సంబోధించినది ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అని సులోచనకి తెలిసింది కాదు. వళ్లంతా టెన్షన్. కంగారు. జీవితంలో మరపురాని అనుభూతి.

డిసెంబర్ 31 రాత్రి డ్యూటీలో ఉంటే ఇక ఒకటే అభినందనల పరంపర. ఎందరో మహానుభావులు. కొత్త సంవత్సరం గ్రీటింగుల్ని కొత్తా పాతా లేకుండా ఫోన్లో అందించేవారు... ఫ్లైయింగ్ కిసెస్‌తో.

పాతబడడం కోసం మళ్లీ ఇంకో కొత్త సంవత్సరం వచ్చేది. వచ్చిపోయే కొత్త-పాతల మధ్య తను మాత్రం నిద్ర మాత్రల సాయంతో నిర్లిప్తంగా.

*

అసిస్టెంట్ ఇంజనీర్ టేబిల్‌కి ఎదురుగా కూర్చుని రేవంత్ కంప్లెయింట్ రాసుకున్నాడు.

అయ్యా,

నా టెలిఫోన్ నెంబరు 1343414. ఒక వ్యక్తి ఈ నెంబరుకి ఫోన్ చేసి మాటిమాటికి నన్ను బెదిరిస్తున్నాడు. ఈ మూలషస్ కాల్ ఎక్కడినుంచి వస్తుందో తెలుసుకుని ఆ నెంబరు నాకు చెప్పిన ఎడల కృతజ్ఞుడిని. ఇట్లు - రేవంత్.

సంతకం పెట్టి అందించాడు.

"పోలీస్ కంప్లైంట్ ఇచ్చారా?"

రేవంత్ గతుక్కుమని, వెంటనే తేరుకుని ఇచ్చానన్నాడు. "నాల్గయిదు రోజుల్లో మీ ఫోన్ తీసి ఇంకో ఫోన్ పెడతాము. దానికి ఒక బటన్ ఉంటుంది. మీకు ఆ వ్యక్తి ఫోన్ చెయ్యగానే బటన్ నొక్కండి. మేం ట్రేస్ చేసేవరకూ మాత్రం సంభాషణ కొనసాగిస్తూ ఉండాలి."

"ఎంతసేపు?"

"మీకు వచ్చే కాల్ ఇదే ఎక్స్చేంజి నుంచి అయితే మూడు నిముషాలు. ఇంకో ఎక్స్చేంజి అయితే అయిదు నిముషాల దాకా పడుతుంది. ఫోన్ పదిరోజుల పాటూ అబ్జర్వేషన్‌లో ఉంచుతాం. ఈ లోపులో ఆ బ్లాక్ మెయిలర్ ఫోన్ చేస్తాడనే ఆశిద్దాం."

"పదిరోజులెందుకు? ప్రతిరోజూ చేస్తుంది," అనేసి చప్పున నాలుక్కరుచుకున్నాడు.

"'చేస్తుంది' అంటే ఆడ బ్లాక్‌మెయిలరా?" ఆశ్చర్యంగా అడిగాడు ఇంజనీరు.

రేవంత్ సర్దుకుని, "అవునండీ! ఈమధ్య ఆడవాళ్లే ఎక్కువ నేరాలు చేస్తున్నారు," అంటూ షేక్‌హాండ్ ఇచ్చి బయటికొచ్చేస్తూ, 'ఈసారి ఎక్కడికి పోతావ్ పిల్లా? ఎలా తప్పించుకుంటావ్?' అనుకున్నాడు.

రేవంత్ దగ్గర అప్లికేషన్ తీసుకున్న ఇంజనీరు పేరు విశ్వం. రేవంత్ వెళ్లిపోయాక స్విచ్-రూమ్‌కి వెళ్లాడు. తలుపు తీసి, ఒక్కసారిగా అందులో వినబడే రణగొణ శబ్దాలకి అప్రయత్నంగా అడుగు వెనక్కి వేశాడు. హైదరాబాదులాంటి నగంలో మొత్తం 41,000 టెలిఫోన్లు ఉన్నాయి. రోజూ దాదాపు 8,500 ట్రంకాల్స్ బయటకి వెళతాయి. ఆశ్చర్యం ఏమిటంటే వచ్చే కాల్స్ 4000 కన్నా ఎక్కువ ఉండవు. లోకల్ కాల్స్ అయితే రోజుకి దాదాపు పది లక్షలదాకా ఉంటాయి. ఆ ఏరియాలో ఉన్న టెలిఫోన్లు అన్నింటికీ అదే స్టోర్స్ గది. అందుకే ఆ రూమ్‌లో అంత శబ్దం.

స్విచ్-రూమ్‌లో ప్లానెల్స్ దగ్గర నిలబడి 1343414 పిన్ని అబ్జర్వేషన్లోకి తీసుకుని మానిటర్ ఏర్పాటుచేశాడు విశ్వం.

ఆరోజు నుంచి రేవంత్ ఫోను అబ్జర్వేషన్లో ఉంచబడింది.

*

రెండు రోజుల వరకూ ఆమె దగ్గిర్నించి ఫోన్ రాలేదు. ఆ రెండ్రోజులూ రేవంత్ టెన్షన్‌తో గడిపాడు. ఏ కాల్ వచ్చినా చూపుడు వేలు ఫోన్ బటన్ మీదకు వెళ్లేది.ఆ మరుసటి రోజు '...హల్లో' అని తియ్యగా ఆమె గింతు వినిపించగానే బటన్ నొక్కాడు. వెంటనే

స్విచ్ రూమ్‌లో బజ్జర్ మోగింది. క్షణాలమీద 'బ్యాక్-వర్డ్ ట్రేసింగ్' మొదలయింది. ఇక్కడ ఇంజనీర్లు ఈ పని మీదుంటే అక్కడ రేవంత్ ఆ అమ్మాయితో తాపీగా మాట్లాడుతున్నాడు.

"నేను నా పేరు మార్చుకుందామనుకుంటున్నాను."

"ఎందుకు రేవంత్? మీ పేరు చాలా బాగుంది. నాకెంతో నచ్చింది."

"కానీ అర్థం..." నసిగాడు.

"పర్లేదులెండి. ఎలాగో ఒకలా సర్దుకుందాం. కుంటయ్య, గూనయ్యల కన్నా బాగానే ఉంది కదా."

రేవంత్ మొహం ఎర్రబడింది. ఉక్రోషాన్ని దాచు కుంటూ "ఇంతకీ మీరెవరు?" అని అడిగాడు.

"కంఠం బట్టి అమ్మాయిని అని తెలుస్తోంది కదా. వెంట్రిలాక్విస్ట్‌ని కానీ, మిమిక్రిస్టుని కానీ కాను. పదో క్లాసు వరకూ చదువుకున్నాను."

"మీరు అమ్మాయే కానీ, క్వాలిఫికేషను మాత్రం పదోక్లాసు కాదు. పందెం కడతాను."

"సర్లెండి... అబద్ధమే చెప్పాను. సరేనా?" ఆ అమ్మాయి నవ్వింది.

"పేరూ, అడ్రస్ చెప్పకుడా మీరిలా ఎందుకు ఫోన్ చేస్తున్నారు?"

"రెండుసార్లు హింట్ ఇచ్చాను. కనుక్కోలేకపోతే అది నా తప్పు కాదుకదా."

"కలుసుకోకుండా ఊరికే ఇలా ఫోన్ చెయ్యడం టైం వేస్టు కదా."

"ఎందుకు కలుసుకోలేం రేవంత్? తప్పకుండా కలుసుకుందాం. మీ స్నేహితురాలిని అవ్వాలనే కదా. ఈలోపులో కాస్త థ్రిల్ కోసం ఫోన్స్. ఇవీ వద్దంటే రేపే మీ ఆఫీసుకి వచ్చి కలుసుకుంటాను."

"వద్దులెండి. రేపట్లోగా కనుక్కోవటానికి ప్రయత్నిస్తాను."

"ఎలా?"

"స్వయంశక్తి ఉపయోగించి."




"ఇంకో హింట్ ఏమన్నా ఇమ్మంటారా?"

"వద్దులెండి."

"అయితే పెట్టేస్తాను."

రేవంత్ కంగారుపడి, "అబ్బెబ్బె. ఇంకొంచెంసేపు ఏదైనా మాట్లాడండి," అన్నాడు.

అప్పటికి ఒక నిముషమే గడిచింది. ఇంకా నాలుగు నిముషాలుంది. ఇక్కడ ఈ సంభాషణ జరుగుతూ ఉంటే అక్కడ బ్యాక్‌వర్డ్ ట్రేసింగ్ ఆపరేషన్ తొందర తొందరగా జరుగుతోంది. ఇద్దరు అసిస్టెంట్లు స్విచ్‌రూమ్‌లో చకచకా పనిచేస్తూ పాయింట్లు పరిశీలిస్తున్నారు.

"మీ గురించి నేను తెలుసుకోకుండా ఎలా స్నేహం చేయగలను?" అని అంటున్నాడు రేవంత్.

"నా ఇష్టాలూ, అభిరుచులూ అన్నీ ఫోన్‌లో చెప్తాగా."

"అయినా మిమ్మల్ని చూడాలి."

"ఎందుకు?"

వెంటనే సమాధానం దొరకలేదు. "మీరెలా ఉంటారో తెలియకుండా స్నేహం ఎలా చెయ్యను?" ఇబ్బందిగా, సిన్సియర్‌గా అడిగాడు.

"ఎలా ఉంటే ఏముంది రేవంత్? ఏ అమ్మాయికైనా రెండు బుగ్గలూ, రెండు చెవులే కదా ఉండేది."

"కానీ కొందర్ని చూస్తే స్నేహం చెయ్యాలని అనిపిస్తుంది. కొందర్ని చూస్తే అకారణంగా ఏవగింపు కలుగుతుంది. మనం ఫోన్లో స్నేహితులయ్యాక కలుసుకున్నామనుకోండి. అప్పుడు నేను ఊహించుకున్న దానికి మీరు భిన్నంగా ఉంటే నాకు ఆశాభంగం కలగదా? దీనికి రెండు కళ్లూ, ఒక ముక్కూ అన్న స్టాటిస్టిక్స్ ఎందుకు? అనుభూతిని లెక్కల్లో చెప్పటం అంత మంచిది కాదనుకుంటాను."

ఆమె క్షణం మౌనంగా ఉండి, "నేను మిమ్మల్ని డిస్సపాయింట్ చెయ్యననే అనుకుంటున్నాను రేవంత్!" అంది.

"చెయ్యకపోతే మంచిదే కానీ, చేస్తారేమో అన్న సందిగ్ధంతో చేసే స్నేహంలో పరిపూర్ణత ఉండదు. అందుకే ఒకర్నొకరు చూసుకోకుండా చేసే 'కలం' స్నేహాలూ, ఫోను స్నేహాలూ కలయిక తరువాత ఘోరంగా ఫెయిలవుతాయి."

"మిగతావాళ్ల విషయంలో అలా అవ్వొచ్చేమో కాని మన విషయంలో అవదు."

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నారు?"

"ఈ ప్రశ్నకి సమాధానం మనం కలిసినప్పుడు చెపుతాను."

ఆ తరువాత ఏం మాట్లాడాలో టాపిక్ దొరక లేదు. టైమ్ మూడు నిముషాలే అయింది. ఇంకా రెండు నిముషాలు. ఇంతలో ఆ అమ్మాయే అన్నది, "ఏమంటున్నాడు మీ స్నేహితుడు?"

"ఎవరు జేమ్సా? బాగానే ఉన్నాడు. అతను మీ గురించి ఏమన్నాడో తెలుసా?"

"ఏమన్నాడు?"

"మీరో సైకిక్ అట. ఇలా ఫోన్లు చేసేవాళ్లలో చాలా తక్కువమంది మాత్రమే చిలిపిగా అల్లరిగా ఉంటారట. మిగతావాళ్లు తమ బాధ తగ్గించుకోవటానికి ఇలా 'అవుట్‌లెట్లు' చూసుకుంటారట."

"అతడు నిజమే చెప్పాడు కానీ, నేను ఆ 'చాలా మంది'లోకి రాను. తక్కువ మందిలోకి వస్తాను."

రేవంత్‌కి ఆశ్చర్యం వేసింది. తన మాటలకి ఆమెకి కోపం వస్తుందనుకున్నాడు. కాని నిజాన్ని నిజంగా తీసుకుంటుందని అనుకోలేదు. ఆమెకి కోపం తెప్పించాలనే అతడి ఉద్దేశ్యం కూడా. ఆ కోపంలో తన గురించి చెబుతుందని ఆశ.



"అంటే మీరు చిలిపిగా అల్లరిచేసే అమ్మాయన్న మాట."

"అహఁ" అంటూ నవ్వింది. "...ప్రత్యూషానికి ముందే పాలపరికిణీ కుచ్చిళ్లు పైకి కట్టి 'గొబ్బెళ్లోయమ్మ గొబ్బిళ్లో' అని పాడుకుంటో వెన్నెల్లో ముగ్గులేసే ఆడపిల్ల..."

"...వెన్నెల్లో ఆడపిల్ల," చప్పున అన్నాడు.

"పేరు బాగుంది."

"అలాగే పిలుస్తాను."

"నాకభ్యంతరం లేదు," అని ఆగి, "మొన్న ఎందుకు టెలిఫోన్ ఎక్చేంజికి వెళ్లారు రేవంత్," అని నెమ్మదిగా అడిగింది.

పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడి, "మీకెలా తెలిసింది?" అని అడిగాడు.

"అదేమిటి రేవంత్? మీతో స్నేహం చేయబోయే ముందు మీ దినచర్య గురించి తెలుసుకోకపోతే ఎలా?"

"అవును. చిన్న పని ఉండి వెళ్లాను," అంటూ ఉండగా అతడికి ఒక అనుమానం వచ్చింది. తను ఆమె ఫోన్ నెంబర్ కనుక్కోబోతున్నట్టు ఆమెకు తెలిసిందేమో. అందుకనే ఇంటి దగ్గర్నుంచి కాకుండా బయట ఎక్కడ్నుంచయినా చేస్తుందేమో! ఇప్పుడు తను అక్కడికి వెళ్లేవరకూ ఆమెని ఆ ఫోన్ దగ్గరే ఆపు చెయ్యాలి. ఏం చెయ్యాలా అని అతడో క్షణం ఆలోచించి, కంఠం అమాయకంగా మార్చి, "మీరు మొన్న ఒక లెక్క చెప్పారు జ్ఞాపకం ఉందా? అలాంటి లెక్కే ఇంకొకటి చెప్పండి. అప్పుడు కనుక్కోలేక పోయాను, ఈసారి కనుక్కోగలనేమో ప్రయత్నిస్తాను," అన్నాడు.

"ఏది? నా ఫోన్ నెంబర్‌కి సంబంధించిన లెక్కా?"

"అవును. కనుక్కుంటాను. పోతే నాకు ఐదు నిముషాలు టైమివ్వాలి," అన్నాడు. అతని మనసులో ఆలోచన వేరు. ఆమెని ఎలాగైనా అయిదు నిముషాల పాటు ఆ ఫోన్ దగ్గరే ఆపుచెయ్యాలి.

"మొన్న చెప్పిన నెంబరంటే, మిమ్మల్ని తప్పుదారి పట్టించటానికి అనువుగా ఉంది. ఇప్పుడు చేస్తున్న ఫోన్‌కి అలాంటి ప్రత్యేక అర్హతలు ఏమీలేవే."

"ఏదో ఒక ప్రత్యేకత అంటూ లేని నంబరు ఏదీ ఉండదు. ప్రయత్నించి చూడండి," ప్రోత్సహించాడు.

"ఒక్క నిముషం ఆగండి," అంటూ ఆమె ఆలో చిస్తున్నట్టు ఉండిపోయింది. రేవంత్ ఊపిరి బిగ పట్టాడు.

"ఆఁ దొరికింది. ఇప్పుడు నేను చేస్తున్న నెంబరు చాలా చిత్రమైనది రేవంత్. అయిదు నిముషాల్లో మీరు కనుక్కోగలరనే ఆశిస్తాను."

"చెప్పండి."

"ఈ నెంబరు సంఖ్యాశాస్త్రంలో మొట్టమొదటి అయిదంకెల ప్రైమ్ నెంబర్," అని ఫోన్ డిస్కనెక్ట్ చేసింది. రేవంత్ కూడా పెట్టేశాడు. ఎక్సేంజి నుంచి వెంటనే వివరాలు వస్తాయనుకున్నాడు. కానీ రాలేదు. అతడు కాగితమూ, కలమూ తీసుకున్నాడు. 'ప్రైమ్ నెంబర్స్' అంటే 11, 13, 17, 19... అలా దేనితోనూ భాగింపబడని సంఖ్యలు. ఇలాంటి అయిదంకెలది ఆమె నెంబరు. అతడు లెక్కకట్టడం ప్రారంభించాడు. సంఖ్యాశాస్త్రంలో మొదటి అయిదంకెల సంఖ్య 10000. ఇది పది చేత భాగింపబడుతుంది. తరువాతది 10001. ఇది 73 చేత, 10003 ఏడు చేత; 10004, 10005, 10006 వరుసగా రెండు, మూడు, రెండులతో భాగింపబడతాయి.

అతడు లెక్కలు ఫాస్టుగా చేస్తున్నాడు. టైమ్ వేగంగా కదిలిపోతోంది. లెక్క వేస్తున్నాడే కానీ, ఆమె తన ఫోన్ నెంబర్ ప్రత్యేకతని అంత తొందరగా ఎలా పట్టుకోగలిగిందా అని ఆశ్చర్యంగా ఉంది. ఈ అమ్మాయి లెక్కల పరిజ్ఞానం శకుంతలాదేవితో సమానంగా ఉండి ఉండాలి.

తరువాత సంఖ్య 10007. టైమ్ అయిపోతూం దన్న కంగారుతో టెలిఫోన్ డిపార్ట్‌మెంట్‌ను తిట్టు కుంటూ అతడు లెక్కకట్టాడు. అదే నెంబర్...!

ఆనందంతో 'యురేకా' అని అరవబోతూ ఉంటే టెలిఫోన్ మ్రోగింది. రిసీవర్ ఎత్తి 'హల్లో' అని అన్నాడు.

"టెలిఫోన్ డిపార్టుమెంట్ నుంచి మాట్లాడుతున్నాం సార్. మీకు ఇప్పుడొచ్చిన కాల్ 10007 నుంచి... హోటల్ హరిప్రియ."

"ఇంకో అరగంట అయ్యాక చెప్పలేకపోయారా," మనసులో కోపంగా అనుకుంటూ, పైకి థ్యాంక్స్ చెప్పి ఒక్క ఉదుటున కుర్చీలోంచి లేచాడు.

ఇంక రెండు నిముషాలే టైమ్ ఉంది. వేగంగా మెట్లు దిగి కారు వద్దకి పరుగెత్తాడు. హోటల్ హరిప్రియ ప్రక్క స్ట్రీటులోనే. చేరుకునే సరికి మూడు నిముషాలు పట్టింది. రిసెప్షనిస్ట దగ్గరికి వెళ్లి, "ఇప్పుడొక అమ్మాయి మీ హోటల్ నుంచి ఫోన్ చేసింది. ఆమె ఎక్కడుంది?" అని అడిగాడు.

"మీరెవరు?"

"సి.ఐ.డి, పోలీస్. క్రైమ్ బ్రాంచ్. సి.బి.ఐ." అని నోటికొచ్చిన పేర్లు చెప్పాడు.

రిసెప్షనిస్ట బెదిరి, "మేం అమ్మాయిలకి రూములూ, ఫోన్లూ ఇవ్వమండీ," అన్నాడు.

"ఇప్పుడీ నెంబర్ నుంచే మాకు ఫోన్ వచ్చింది," స్వరం హెచ్చించి గద్దించాడు.


రిసెప్షనిస్టు నసుగుతూ, "314లో ఒక అమ్మాయి దిగిందండీ. గంట అయింది," అన్నాడు.

రేవంత్ మరి ఆగలేదు. లిఫ్ట్ కోసం కూడా చూడకుండా మూడో అంతస్థుకి పరుగెత్తాడు.

రూమ్ నెంబర్ 314 చీకటిగా ఉంది. తలుపు తోసుకుని లోపలికి ప్రవేశించాడు. ఒక్కసారిగా వెలుతురు నుంచి చీకట్లోకి ప్రవేశించటంవల్ల కళ్లు కనబడలేదు. తడుముకుని స్విచ్ వేశాడు.

అంతే!

కెవ్వున రాబోయిన కేక గొంతులోనే ఆగిపోయింది! పిడికిళ్లు బిగుసుకున్నాయ్...! అతికష్టం మీద తనని తాను కంట్రోలు చేసుకుంటూ వెనుదిరిగాడు.



అప్పుడే ఒక పోలీస్ ఇన్స్‌పెక్టర్ ఆ గదిలోకి ప్రవేశిస్తున్నాడు.

గది మధ్యలో ఫ్యాన్‌కి పదహారేళ్ల అమ్మాయి శరీరం వేలాడుతూ ఉంది.

*

గంట తరువాత...

పోలీస్‌స్టేషన్‌లో మొహం దాచుకుని నిస్సహాయంగా కూర్చుని ఉన్నాడు రేవంత్. చాలాసేపు టఫ్ ఇంటరాగేషన్ జరిగింది. అతడికున్న పలుకుబడీ, ఇంటర్నేషనల్ ఫేమూ దేనికీ పనికిరాలేదు.

ఆ అమ్మాయి ఎవరో తీరిగ్గా హోటల్లో రూమ్ తీసుకుని, ఇన్స్‌పెక్టర్‌కి ఫోన్ చేసి మరీ చచ్చిపోయింది.

"మీరా రూమ్‌కి ఎందుకు వెళ్లవలసి వచ్చింది రేవంత్?" ఇన్స్‌పెక్టర్ అడిగాడు.

"పొరపాటున."

"ఏ రూమ్‌కి వెళ్లబోయి పొరపాటున ఆ రూమ్‌కి వెళ్లారు?"

రేవంత్ వద్ద సమాధానం లేదు.

"రిసెప్షనిస్టుకి మీరు సి.ఐ.డి. అని ఎందుకు చెప్పారు. అది నేరం కాదా?"

రేవంత్ మాట్లాడలేదు. భవిష్యత్తు సినిమా స్కోప్‌లో కనపడుతోంది. ఇప్పుడిక ఇన్వెస్టిగేషన్ ప్రారంభం అవుతుంది. బ్లాక్‌మెయిల్ గురించి తను టెలిఫోన్ డిపార్టుమెంటులో ఇచ్చిన కంప్లెయింట్ బైట బయట పడుతుంది. 'ఈమధ్య ఆడ బ్లాక్ మెయిలర్లు కూడా బయల్దేరుతున్నారు,' అని తానన్న మాట కూడా ఆ ఇంజనీరు పోలీసులకి చెబుతాడు. హోటల్ (10007) నుంచి ఫోన్‌కాల్ గురించి స్విచ్ రూమ్ అసిస్టెంట్లు వాంగ్మూలం ఇస్తారు. తను హోటల్ హరిప్రియకి బయల్దేరి... ఆ రూమ్‌లో ఉన్న బ్లాక్‌మెయిలర్ అమ్మాయిని హత్యచేసి... 'గోవిందో గోవిందా.' తన పరువు, ప్రతిష్ట అన్నీ వెంకట్రమణ గోవిందా!

వాటి సంగతి దేవుడెరుగు. ఉద్యోగం తిరుక్షవరం!

"మిస్టర్ రేవంత్! మీరు దేనికీ సరిగ్గా జవాబు చెప్పటంలేదు. చదువుకున్నవారు, మీ మీద థర్డ్ డిగ్రీ ఉపయోగించటం నాకు ఇష్టంలేదు."

రేవంత్ ఉలిక్కిపడ్డాడు. తనని నేరం వప్పుకోమని ఇన్స్‌పెక్టర్ ఇన్‌డైరెక్టుగా చెపుతున్నాడు. అతడికి దుఃఖం రాలేదు. తన మూర్ఖత్వం మీద తనకే జాలి వేసింది. ఎవరో అమ్మాయి ఫోన్ చేస్తే ఆమెకి 'వెన్నెల్లో ఆడపిల్ల' అని పేరు పెట్టుకుని, వెతకటానికి పెద్ద హీరోలా బయల్దేరాడు. దీనికి వెనుక ఒక ముఠా ఉన్నదనీ, తన చుట్టూ జాగ్రత్తగా వల బిగించడానికే ఈ నాటకం ఆడారని తెలుసుకోలేకపోయాడు. వాళ్లక్కావలసిన హత్య వాళ్లు చేసేసి, తనని అందులో ఇరికించారు.

ఓ ఇడియెట్‌లా అమ్మాయి సంబరంలో తనా ట్రాప్‌లో ఇరుక్కుపోయాడు.

మరో అరగంటసేపు ఇంటరాగేషన్ జరిగింది. అది వాదోపవాదంగా మారింది. ఇన్స్‌పెక్టర్ కోపంతో, "ఒకే మిస్టర్ రేవంత్! మిమ్మల్ని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తాం. ఆ తరువాత మిగతాది చూసుకుందాం," అన్నాడు.

రేవంత్ ఆవేశంగా, "మీరు రావటానికి రెండు నిముషాల ముందే నేను హోటల్ గదిలోకి వెళ్లాను. ఆ విషయం రిసెప్షనిస్టు చెప్తాడు. ఈ రెండు నిముషాల్లోనే నేను చంపటమూ, వ్రేలాడ గట్టటమూ జరిగిందంటారా," అడిగాడు.

"ఆ లాజిక్ అంతా కోర్టులో చెప్పుకుందురుగాని," ఇన్స్‌పెక్టర్ తాపీగా అని, పోలీస్ వైపు తిరిగి "ఇతడిని లాకప్‌లో పెట్టు," అన్నాడు.

ఆ మాట వినగానే రేవంత్ చువ్వలా కుర్చీలోంచి లేచాడు. "అన్యాయం. సాక్షిగా తీసుకొచ్చి, నా లాయర్ని కలుసుకునే అవకాశం ఇవ్వకుండా ఇక్కడికిక్కడ నామీద ఎలా ఛార్జెస్ ఫ్రేమ్ చేస్తారు?"

"మిస్టర్ రేవంత్, ఏ పని ఎప్పుడు చెయ్యాలో మాకు తెలుసు," ఇన్స్‌పెక్టర్ కోపంగా గద్దించాడు. అతడిని లాగి కొడ్దామన్నంత కోపం వచ్చిందికానీ, మళ్లీ అదో నేరం అవుతుందని ఊరుకున్నాడు. నిస్సహాయత తోనూ, రోషంతోనూ మొహం ఎర్రబడింది. కళ్లనీళ్లు రావటమే తరువాయి. చూస్తూ ఉండగానే ఇందులో ఎలా ఇరుక్కుపోయాడు. ముందు అరెస్టు- తరువాత

బెయిలు- తరువాత జడ్జిమెంటు- ఆపై జైల్లో జీవితం. ఇక జైల్లో 'ఎరక్కపోయి వచ్చానూ' పాట పాడుకో వటమే తరువాయి.

"పదండి," అన్నాడు పోలీసు దగ్గరకొచ్చి.

రేవంత్ అతడి వైపు అయోమయంగా చూసి, "ఎక్కడికి?" అని అడిగాడు.

"ముందు భోజనానికి, ఆ తరువాత సినిమాకి," అన్నాడు ఇనస్పెక్టరు.

ఊచల అవతల్నుంచి జేబులు కొట్టే ఒక ఖైదీ చోద్యం చూస్తున్నట్టు నవ్వుతున్నాడు. "ఓ ఐదొందలు వాళ్ల మొహాన పడెయ్యండి సాబ్. మర్యాద ఇచ్చి వ్యాన్‌లో ఇంటికి పంపిస్తారు," అన్నాడు. వాడి మొహం మీద లాఠీ తగిలింది.

రేవంత్ లేవకపోవడంతో పోలీసు భుజం పట్టుకున్నాడు. ఇక గత్యంతరం లేనట్లు రేవంత్ లేచాడు. నిద్రలో నడిచినట్టు లాకప్ గదివైపు నడిచాడు. అతడికి ఇదంతా కలో నిజమో అర్థం కావటం లేదు.

నడుస్తూ ఉండగా ఫోన్ మోగింది.

ఇన్స్‌పెక్టర్ నిర్లక్ష్యంగా రిసీవర్ ఎత్తి, "హల్లో. టూ టౌన్," అన్నాడు. క్షణంలో అతడి కంఠంలో మార్పొచ్చింది. చప్పున అటెన్షన్లోకి వచ్చి, "యస్సార్," అన్నాడు కంపిస్తున్న గొంతుతో. అతడిలో మార్పుని రేవంత్ ఆశ్చర్యంగా గమనిస్తున్నాడు. ఇన్స్‌పెక్టర్ నుదుటి మీద చెమట. ఫోన్ పట్టుకున్న చెయ్యి కంపిస్తోంది. "యస్సార్... ఔన్సార్," తప్ప ఇంకేమీ మాట్లాడటం లేదు. అతడి ధోరణి చూస్తోంటే ఆవతలి ఫోన్ భారత రాష్ట్రపతికి తక్కువ, ఇన్స్‌పెక్టర్ జనరల్‌కి ఎక్కువ అనిపిస్తోంది.

"లేద్సార్. ఆత్మహత్య నోట్ పెట్టే చనిపోయింది... ఔన్సార్! నాకు ఫోన్ చేసింది, జీవితం మీద విరక్తి చెందిందట... హోటల్ లోపలికి అప్పుడే వెళ్లాడు సార్. రిసెప్షనిస్టు చెప్పాడు. ఆఁ... వదిలేస్తున్నా సార్. ఫైల్ మూసేస్తున్నాను."

ఫోన్ పెట్టేసి రేవంత్ దగ్గరికి వెళ్లి, సాదరంగా "కూర్చోండి మిస్టర్ రేవంత్. ఆత్మహత్యే అది. సారీ. అనుమానాస్పద పరిస్థితిలో కనబడ్డారు కాబట్టి ఇంటరాగేట్ చెయ్యవలసి వచ్చింది," అన్నాడు.

"కాదు. వందలూ వేలూ నొక్కేయ్యటానికి," జైల్లో ఖైదీ అరిచాడు.

ఆ మాటలు పట్టించుకోకుండా, "జరిగిందంతా మర్చిపోండి సర్. ఏయ్ టు నాట్ ఫోర్. అయ్యగారికి ఒక కాఫీ తీసుకురా," అంటూ హడావుడి చేసాడు ఇనస్పెక్టరు. రేవంత్‌కి ఆశ్చర్యంగా ఉంది. తన నిరపరాధిత్వం, దొరికిన ఋజువులు, సాక్ష్యాలు- వీటన్నిటికన్నా ఒక ఫోన్ కాల్ ఎక్కువ ఫలితాన్ని చూపించటం..!

అంతలో బైట కారు ఆగిన శబ్దం.

రేవంత్‌తోపాటు ఇన్స్‌పెక్టరూ వీడ్కోలు ఇవ్వటానికి బైట వరకూ వచ్చాడు. ఎండలో టయోటా మిలమిలా మెరుస్తోంది. డ్రైవర్ నమ్రతగా డోర్ తెరచి పట్టుకున్నాడు. రేవంత్ కూర్చున్నాక ఇన్స్‌పెక్టర్ తలుపు వేశాడు. కారు కదులుతుంటే రేవంత్ అడిగాడు, "ఎవరు మీకు ఫోన్ చేసింది?"

"ఐ.జి. సర్!"

కారు కదిలింది. ఎయిర్ కండిషన్డ్ గాలికి సీటు వెనక్కి వాలి నిస్త్రాణగా కళ్లు మూసుకున్నాడు. వంట్లో సత్తువంతా లాగేసినట్టుంది. డ్రైవర్‌ని కూడా ఏమీ ప్రశ్నలు వెయ్యాలని అనిపించలేదు. అతడి ఆఫీసు ముందు కారాపి డ్రైవర్ దిగి, వెనుక తలుపు తీసి పట్టుకున్నాడు. రేవంత్ దిగగానే అతడి చేతిలో ఒక కవరు పెట్టి, "అమ్మగారు ఇమ్మన్నారు సార్!" అని వెళ్లిపోయాడు.

చేతిలో కవరు చింపి, గులాబీ రంగు కాగితం బైటకి తీసేడు. చంద్రుడి కిరణానికి నీలాకాశం లేత ఎరుపైతే... ఆ తెరమీద అమర్చిన అందమైన నక్షత్రాల్లా ముత్యాల సరాల్లాంటి అక్షరాలు.

"సరదాగా అనుకున్నది ఇలా మలుపు తిరుగుతుందని కలలో కూడా అనుకోలేదు. నన్ను క్షమించండి. కళ్లనిండా నీళ్లతో...

- మీ 'వెన్నెల్లో ఆడపిల్ల'"

స్థాణువయ్యాడు. ఇప్పుడు అతడికి పోలీస్ స్టేషనూ, ఆ అనుభవాలూ జ్ఞాపకం లేవు. చేసిన తప్పు అర్థమైంది. కనీసం కారు ఎవరిదీ అనైనా డ్రైవర్‌ని అడగలేదు. తనని తను తిట్టుకుంటూ ఛాంబర్‌లోకి వచ్చేసరికి ఫోన్ మోగింది. "హమ్మయ్య! వచ్చేశారు కదా. డ్రైవర్ వచ్చి చెప్పేవరకూ నా మనసు మనసులో లేదు. ఎంత కంగారుపడ్డానో. అసలు మీరా రూమ్‌కి ఎందుకు వెళ్లారు రేవంత్?"

"అమ్మాయి 314లో ఉందని రిసెప్షనిస్టు చెప్పాడు. నేనింకేమీ ఆలోచించలేదు."

"ఈ ఊళ్లోనే ఉంటూ, కేవలం మీకు ఫోన్ చెయ్యటం కోసం రూమ్ ఎందుకు తీసుకుంటాను? అందులోనూ మీరు మీ ఫోనుని అబ్జర్వేషనులో పెట్టాక..."

రేవంత్ ఉలిక్కిపడి, "అయితే మీకంతా తెలుసా?" అని అడిగాడు.

"తెలుసు. అయినా మీకు చెప్పినట్లే అయిదు నిముషాల వరకూ నేను అక్కడే ఉన్నాను," అని ఆగి, "ఒక్క విషయం మాత్రం నిజం రేవంత్. నేను మీతో దాగుడుమూతలు ఆడటంలేదు. ఇది మాత్రం నమ్మండి. మీకు ఫెయిర్ ఛాన్స్ ఇస్తూనే వచ్చాను. మీరు హడావుడిగా రిసెప్షనిస్ట్ దగ్గరకు వచ్చి 'సి.ఐ.డి. పోలీస్, క్రైమ్ బ్రాంచి, సి.బి.ఐ.,' అని గంభీరంగా నటిస్తూంటే నవ్వాపుకోలేక చచ్చాను. మీరు ఎటూ చూడకుండా మూడో అంతస్థులోకి వెళ్లిపోయారు. కొంచెం తలతిప్పి చూసి ఉంటే, లాంజ్ సోఫాలో కూర్చుని నేను కనబడి ఉండేదాన్ని," నవ్వుతూ అంది.

కాళ్ల దగ్గర ఉన్న డస్ట్‌బిన్‌లో తల పెట్టుకోవాలనిపించింది రేవంత్‌కి.

"మీరు మళ్లీ పప్పులో కాలు వేశారని నవ్వుకుంటూ లేవబోతూంటే ఇన్స్‌పెక్టర్ రావడం కనబడింది. హత్య సంగతి తెలిసింది. హోటలంతా క్షణాల మీద కలవరం. రిసెప్షనిస్టు మీకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాడు. నాలో కంగారు మొదలైంది. ఈలోపు ఇన్స్‌పెక్టర్ మిమ్మల్ని వాన్‌లో పోలీస్‌స్టేషనుకి తీసుకెళ్లడంతో పరిస్థితి మరింత విషమించింది. ఏం చెయ్యాలో తోచలేదు. ఏడుపు ఒక్కటే తరువాయి. పరుగెత్తుకెళ్లి నాన్నగారితో అంతా చెప్పేను. ఆయన డి.ఐ.జి.కి ఫోన్ చేశారు."

వింటూన్న రేవంత్ ఉలిక్కిపడ్డాడు.

"మీ నాన్నగారికి... నాన్నగారికి అంతా తెలుసా?"

"తెలుసు."

*(ఇంకా ఉంది)*


(జ్యోతిష్యరత్న)
శ్రీధర్ గురూజీ గారు

సెల్: (+91)83281 86500
(+91)76618 40946

JMR
జ్యోతిష్యాలయం
(Astrologer)





విద్య, ఉద్యోగం, ప్రేమ, పెళ్ళి, వ్యాపారం, వ్యవసాయం, రియల్ ఎస్టేట్, రాజకీయం, కోర్టు సమస్యలు, ఒత్తిడి, ఆరోగ్య సమస్యలు, సంతానం లేకపోవడం, మనశ్శాంతి, లక్ష్మీ శాంతి, విడాకులు, శత్రుభయం, భార్య భర్తల మధ్య గొడవలు రావడం, నమ్మిన వ్యక్తులు దూరం కావడం లేదా మోసం చేయడం.

ఎటువంటి సమస్యలకైన 100% పరిష్కారం చేయబడును.

జ్ఞాపకాలు

# ఉప్మా ఏమిటి చెప్మా?



* ఎ. జగన్నాథశర్మ

అమ్మమీద జోకులు వేయకూడదు. నాన్నని చిన్న చూపు చూడకూడదు. అలాగే ఉప్మాని అసహ్యించుకోకూడదు అనేవారు మా నాన్నగారు. ఆయనకి ఉప్మా అంటే మహా ఇష్టం. నాకు తెలిసి, దక్షిణాదిలో ఇరవై అయిదుశాతం మందికి ఉప్మా ఇష్టమైన టిఫినయితే, మిగిలిన డెబ్బయి అయిదుశాతం మందికి ఆ పేరంటనే పడదు. ఉప్మా ఓ టిఫినా అని ఆశ్చర్యపోతారు. మేనమామా ఓ మొగుడేనా అన్నట్టు తేలిగ్గా చూస్తారు.

మన ఉప్పుపిండినే తమళ సోదరులు ఉప్మావు అంటారు. కాలక్రమంలో ఆ మాటే ఉప్మా అయిందని పెద్దలు చెబుతారు. ఉప్మాని వ్యాకరణవేత్త పాణిని కనుగొన్నాడంటారు కన్నడిగులు. ఉపమ అంటే పోలిక. మెత్తగా, కారంగా, ఉప్పగా ఉండే ఉప్మాని, పాణిని జీవితంతో సరిపోల్చాడంటారు. ఇది ఎంత వరకు నిజమో తెలియాలి. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో బియ్యం నిండుకుంటే... వాటికి ప్రతిగా రవ్వని భారతదేశానికి బ్రిటీషువారు పరిచయం

చేశారట! అప్పటి నుంచే ఉప్మా వంటకం అయిందం టారు కొందరు. ఏది ఏమైనా దక్షిణాదిన ఉప్మాకి పెద్దపీటే వేశారంతా. దానిని అన్నపూర్ణని చేశారు. మినిమమ్ గ్యారంటీ డిష్‌ని చేశారు. ఉప్మాని చేయడం ఎంత సులభమో అంత కష్టం కూడా అనే వారు మా నాన్నగారు. ఉప్మాని భేషుగ్గా చేయడం వచ్చిందంటే... ఇక ఆ ఇల్లాలికి రానిదిలేదు అనేవారు. భర్త సుఖపడతాడనేవారు. ఆ ఉద్దేశంతోనే మా తమ్ముడు పెళ్లిచూపులప్పుడు, కాబోయే కోడలిని మా నాన్నగారు అడిగారిలా.

"ఏమ్మా! నీకు ఉప్మాచేయడం వచ్చా?"

"వచ్చండి," అన్నది ఆమె.

"అయితే ఇహనేం! అబ్బాయి సుఖపడతాడు," అన్నారు.

"కోడలుగా ఈ అమ్మాయి నాకు ఓకేరా! నీ సంగతి చెప్పు?" తమ్ముణ్ణి అడిగారు.

వాడేం చెబుతాడు? ఏమీ చెప్పలేదు. దాంతో మౌనం అర్ధాంగీకారం అని, ఆ అమ్మాయినిచ్చే వాడికి పెళ్లి చేసేశారు. పెళ్లి అయిన దగ్గరనుంచీ ఆ అమ్మాయి చెయ్యని ఉప్మాలేదు. టొమెటో ఉప్మా, జీడిపప్పు ఉప్మా, సేమ్యా ఉప్మా, అటుకుల ఉప్మా, బొరుగుల ఉప్మా, జొన్న ఉప్మా, రాగి ఉప్మా, అండు కొర్రల ఉప్మా, కాయగూరల ఉప్మా, సామల ఉప్మా, ఓట్సు ఉప్మా, గోధుమరవ్వ ఉప్మా, సగ్గుబియ్యం ఉప్మా, పెసరపప్పు ఉప్మా... అంటూ అనేక రకాల ఉప్మాలు చేసి అటు మా తమ్ముణ్ణి, ఇటు మా నాన్న గారినీ ముంచెత్తింది. ఉప్మా ఉండలు కట్టకూడ దంటే... ముందుగా రవ్వను కాస్తంతగా వేపుకోవాలనే వారు నాన్నగారు. అలాగే నెయ్యి కూడా కాస్తంత ఎక్కువే వెయ్యాలనేవారు. వేస్తే ముద్దలా ఉండదనే వారు. కొద్దిగా నిమ్మరసం పిండాలి. పిండితే దాని రుచే వేరంటూ లొట్టలేసేవారు. ఇంట్లో బియ్యం ఉన్నా లేకపోయినా పర్వాలేదుగాని, ఉప్మారవ్వ ఎప్పుడూ ఉండాలనేవారు. అర్ధరాత్రీ, అపరాత్రి వచ్చే బంధు మిత్రులకు వండివార్చడం కష్టంగాని, ఉప్మా చేసి పెట్టడం ఎంతసేపు? ఇట్టే అయిపోతుందనేవారు.

ఉప్మా టిఫిన్ కాదయ్యా! అదో గొప్ప భావోద్వేగం అనేవారు. జీడిపప్పు లేదంటే వేరుసెనగపప్పు వెయ్యమనేవారు. కరివేపాకు లేదంటే కొత్తిమిర వెయ్యమనేవారు. ఉప్మాకి ఇదేకావాలి, అదే కావాలనే దేమీ లేదు. ఏది వేసినా దానికి ఓకేనే అని నవ్వేవారు నాన్నగారు. ఉప్మా కొబ్బరిచట్నీ గొప్ప కాంబినేషన్ అనేవారు. కొబ్బరిచట్నీ లేదంటే ఆవకాయ ఉందా? అబ్బో! దానిని మించింది లేదనేవారు. అదికూడా లేదు, కందిపొడి ఉంటే పడేయండి అనేవారు. అదీ లేదంటే ఇంత చక్కెర ప్లేట్లో పెట్టమ్మా! నంజుకుని ఎంచక్కా తింటాననేవారు. ఉప్మా టిఫిన్ కాదయ్యా! అదో గొప్ప జ్ఞాపకం అనేవారు.

ఇక ఉప్మా వల్ల ఉపయోగాలు ఎన్నని చెప్ప నంటూ నాన్నగారు చెప్పేవారిలా. డయాబెటిస్ వ్యాధి గ్రస్తులు రోజూ పొద్దునే గోధుమరవ్వతో చేసిన ఉప్మా తింటే... శరీరంలో చక్కెరస్థాయిలు నియంత్రించు కోవచ్చనేవారు. గోధుమరవ్వలోని ఫాస్ఫరస్, జింక్, మెగ్నీషియం నరాలకు మేలు చేస్తాయనేవారు. గుండె సమస్యలను ఉప్మా దూరం చేస్తుందంటూ, అది వ్యాధి నిరోధకశక్తిని కూడా పెంచుతుందనేవారు. ఎముకలు గట్టిపడతాయి. మూత్రపిండాలకు ఎలాంటి డామేజీ ఉండదనేవారు. జలుబూ, జ్వరం ఉన్నప్పుడు ఉప్మా తింటే... ఉపశమనం కలుగు తుందనేవారు. బరువు తగ్గాలనుకునేవారికి ఉప్మాని మించిన టిఫిన్ లేదనేవారు. క్యాన్సర్ రాదు, కిడ్నీలో రాళ్లు రావనేవారు. తరతరాల ఆరాధనా, సంప్ర దాయాల మేళవింపు ఉప్మా! ఉప్మాని కాదనుకుంటే కళ్లు పోతాయనేవారు. వంటింట్లో ఉప్మా వాసనే వాసన. దానిముందు అన్ని వాసనలూ దిగదుడుపే అనేవారు.

సంతర్పణల్లోనూ, పెళ్లివారింటిలోనూ చేసే ఉప్మాదే ప్రథమతాంబూలం అనేవారు. నూనెలూ, నేతులూ బాగాపోస్తారు. ఖర్చుకు వెనుకాడరు. కక్కుర్తులుండవక్కడ అనేవారు. ఉప్మా మీద ఎంత ప్రేమో ఆయనకి. అమ్మ ప్రేమ, నాన్న ముద్దు, అన్న పట్టు, అక్క పొత్తూ అంతా ఉప్మానే అనేవారు. కలియుగ ప్రత్యక్షదైవం ఉప్మా అని తినే ముందు దానిని కళ్లకద్దుకునేవారు నాన్నగారు. ❀



జలపతి & శ్రీ అట్లూరి

# సంక్రాంతి సినిమాలు... విజేత ఎవరు..?

ఈ మధ్య కాలంలో కనివినీ ఎరుగని రీతిలో సంక్రాంతికి ఒకేసారి నాలుగు సినిమాలు వచ్చి పడ్డాయి. ఒకప్పుడు సంక్రాంతికి రెండు భారీ సినిమాలొస్తే, అండర్ డాగ్‌గా మరో చిన్న సినిమా వచ్చేది. కానీ ఈసారి ఏకంగా మూడు పెద్ద సినిమాలొచ్చాయి. కాస్త తక్కువ అంచనాలతో మరో సినిమా వచ్చింది.

ఇలా ఈ సంక్రాంతికి ఏకంగా 4 సినిమాలు బరిలో నిలిచాయి. వీటిలో మహేష్‌బాబు హీరోగా నటించిన *గుంటూరుకారం*, వెంకటేష్ 75వ చిత్రం *సైంధవ్*, నాగార్జున ప్రతిష్టాత్మక చిత్రం *నా సామిరంగ* సినిమాలతో పాటు.. చిన్న హీరో తేజ సజ్జ నటించిన *హను-మాన్* థియేటర్లలోకి వచ్చింది.

నిజానికి ఈ పోటీ ఇంకా తీవ్రంగా ఉండేది. ఆఖరి నిమిషంలో రవితేజ హీరోగా నటించిన *ఈగల్* సినిమాను బరి నుంచి తప్పించారు. అంతేకాదు, కోలీవుడ్ నుంచి రావాల్సిన *లాల్ సలామ్*, *మిషన్ ఛాప్టర్-1*, *కెప్టెన్ మిల్లర్*, *అయలాన్* సినిమాల్ని ఉన్నపళంగా తప్పించారు. వీటిలో కనీసం 2 సినిమాలు వచ్చినా బాక్సాఫీస్ వద్ద సినిమాల తొక్కిసలాట జరిగేది. ఎందుకంటే, *లాల్ సలామ్*‌లో రజనీకాంత్ ఉండగా... *కెప్టెన్ మిల్లర్*‌లో ధనుష్, *అయలాన్*‌లో శివకార్తికేయన్ హీరో. వీళ్లలో కనీసం ఇద్దరు వచ్చినా థియేటర్లలో చీలిక తప్పదు.

మొత్తమ్మీద ఈసారి టాలీవుడ్ అంతా ఒక్కటైంది. సంక్రాంతికి డబ్బింగ్ సినిమాల హవాను సక్సెస్



ఫుల్‌గా అడ్డుకుంది. రిలీజైన 4 సినిమాలకే థియేటర్లన్నీ కేటాయించింది. అలా కనివినీ ఎరుగని కాంపిటిషన్ మధ్య వచ్చిన ఈ 4 సినిమాల్లో హను-మాన్ మూవీ సంక్రాంతి విన్నర్‌గా నిలిచింది. చాలామంది ఊహించని విజయం ఇది.


ఇంతకీ హనుమాన్‌లో ఏముంది? రిలీజైన మొదటి రోజుకే ఈ సినిమాకు అంత హిట్ టాక్ ఎలా వచ్చింది? ఉత్తరాదిన జనం వేలంవెర్రిగా ఈ సినిమా కోసం ఎందుకు ఎగబడుతున్నారు? హను-మాన్ మూవీలో గూస్ బంప్ మూమెంట్స్ ఓ 4-5 ఉంటాయని మేకర్స్ రిలీజ్‌కు ముందు నుంచి చెబుతున్నారు. తమ ఆశలన్నీ వాటిపైనే ఉన్నాయని, అవి క్లిక్ అయితే తమ సినిమా సక్సెస్ అనే విషయాన్ని ఓపెన్‌గా చెబుతూ వచ్చారు.

మేకర్స్ అంచనాలే నిజమయ్యాయి. వాళ్లు ఊహించినట్టే, ఓ 5 ఎపిసోడ్స్ సినిమాలో అద్భుతంగా పేలాయి. మరీ ముఖ్యంగా హనుమంతుడి పాత్ర చుట్టూ అల్లిన సన్నివేశాలు, వాటిని తీసిన విధానం, గ్రాఫిక్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్, ప్రేక్షకుల్ని మంత్ర ముగ్ధుల్ని చేశాయి. వీటితో పాటు సినిమాపై చిన్నపాటి సింపతీ కూడా వర్కవుట్ అయింది.

హనుమాన్ సినిమాను కాదని మహేష్ నటించిన *గుంటూరుకారం* సినిమాకు థియేటర్లు కేటాయించారు. చివరికి హనుమాన్ కోసం అగ్రిమెంట్లు చేసుకున్న ఎగ్జిబిటర్లు కూడా, ఆ ఒప్పందాన్ని తుంగలో తొక్కి *గుంటూరుకారం* సినిమా వేసుకున్నారు. హైదరాబాద్ లాంటి సిటీల్లో హను-మాన్‌కు కేవలం నాలుగంటే నాలుగు సింగిల్ స్క్రీన్స్ దక్కాయంటే, *గుంటూరుకారం* ప్రభావం హనుమాన్ పై ఏ రేంజ్‌లో పడిందో అర్థం చేసుకోవచ్చు.

అలా హనుమాన్ సినిమాను సంక్రాంతి బరిలో తొక్కేస్తున్నారనే అంశం ప్రేక్షకుల్లోకి బాగా వెళ్లింది. ఈ సింపతీకి తోడు, సినిమాలో కంటెంట్ బాగుండడంతో తేజ సజ్జా-ప్రశాంత్ వర్మ సినిమాకు ప్రేక్షకులు జేజేలు కొడుతున్నారు. రాబోయే రోజుల్లో ఈ సినిమాకు కళ్లు చెదిరే కలెక్షన్లు రాబోతున్నాయి.

ఇక *గుంటూరుకారం* సినిమా విషయానికొద్దాం. సంక్రాంతి బరిలో పెద్ద సినిమా ఇదే. ఎక్కువ అంచనాలు కూడా దీనిపైనే. అందరి చూపు కూడా ఈ సినిమా మీదే. కారణం అందరికీ తెలిసిందే. ఇది మహేష్‌బాబు మూవీ. పైగా మహేష్-త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న సినిమా. అల వైకుంఠపురములో



తర్వాత త్రివిక్రమ్ నుంచి వస్తున్న సినిమా. అటు త్రివిక్రమ్ పర్యవేక్షణలో తమన్ కంపోజిషన్‌లో వస్తున్న సినిమా.

ఇలా భారీ అంచనాల మధ్య *గుంటూరుకారం* సినిమాకు భారీగా స్క్రీన్స్ కేటాయించారు, పనిలో పనిగా భారీగా టికెట్ రేట్లు పెంచారు. కానీ మేకర్స్ అంచనాలు తలకిందులయ్యాయి. *గుంటూరుకారం* సినిమా అంచనాలు అందుకోలేకపోయింది. మహేష్, త్రివిక్రమ్ కాంబో నుంచి ప్రేక్షకులు చాలా ఎక్కువ ఆశించారు. వాళ్ల అంచనాలకు తగ్గట్టు *గుంటూరు కారం*లో సెంటిమెంట్ పండలేదు. సీన్లు రక్తికట్టలేదు.

ఫలితంగా ఈ సినిమాకు బెనిఫిట్ షో నుంచే నెగెటివ్ టాక్ వచ్చేసింది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, స్వయంగా మహేష్ ఫ్యాన్స్ కొంతమంది ఈ సినిమాపై మీడియా ముఖంగా ముఖం చాటేశారు. సినిమా తాము ఆశించిన స్థాయిలో లేదంటూ ఓపెన్‌గా ప్రకటించారు. ఇక ఆ వెంటనే సోషల్ మీడియా కూడా రంగంలోకి దిగిపోయింది. *గుంటూరు కారం* సినిమాను ఏకి పడేసింది. ఏమాత్రం గ్యాప్ ఇవ్వకుండా ప్రముఖ రివ్యూలు కూడా బయట కొచ్చేశాయి.

దీంతో *గుంటూరుకారం* సినిమాకు ఊపిరి తీసు కునే టైమ్ దొరకలేదు. ఏం చేద్దామా అని మేకర్స్ ఆలోచించేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ సినిమాకు ప్రపంచవ్యాప్తంగా 94 కోట్ల రూపాయల ఓపెనింగ్స్ వచ్చాయి. రిలీజైన 3 రోజుల్లో (ఫస్ట్ వీకెండ్) ఏకంగా 164 కోట్లు గ్రాస్ (ప్రపంచవ్యాప్తంగా) గ్రాస్ వచ్చినట్టు మేకర్స్ ప్రకటించుకున్నారు. ఓవైపు ఈ స్థాయిలో వసూళ్లు వస్తున్నప్పటికీ ఈ సినిమా ఫ్లాప్ కిందే లెక్క. ఎందుకంటే, ఇది బ్రేక్ ఈవెన్ అందు కోవడం అసాధ్యం అనేది ట్రేడ్ టాక్.

*గుంటూరుకారం* సినిమాకు ఓవైపు నెగెటివ్ టాక్ బలంగా వినిపిస్తున్న టైమ్‌లో వెంకీ నటించిన సైంధవ్ వచ్చేసింది. దీంతో చాలామంది ప్రేక్షకులు అటువైపు మళ్లారు. *గుంటూరుకారం* నిరుత్సాహపరచడంతో, సైంధవ్ ఏమాత్రం బాగున్నా భుజానికెత్తుకుందామని చాలామంది ఆడియన్స్ చూశారు. కానీ వాళ్లకు ఆ అవకాశం ఇవ్వలేదు సైంధవ్. ప్రమోషన్స్‌లో వెంకీ చెప్పినట్టు కర్చీఫులతో కన్నీళ్లు తుడుచుకునే స్థాయిలో ఈ సినిమాలో సెంటిమెంట్, ఎమోషన్ పండలేదు. పైపెచ్చు మితిమీరిన హింసతో చాలాచోట్ల ప్రేక్షకులు కళ్లు మూసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

వెంకీ కెరీర్‌లో ఇది ప్రతిష్టాత్మక 75వ చిత్రం. ఎంతో ఆలోచించి, ఎన్నో కథలు ప్రయత్నించి చివరిగా సైంధవ్‌కు ఓకే చెప్పారు వెంకీ. దీంతో ఈ సినిమా కచ్చితంగా అలరిస్తుందని ప్రేక్షకులు భావించారు.




ప్రచారంలో వెంకీ హడావుడి చూసిన తర్వాత వాళ్లలో నమ్మకం మరింత పెరిగింది. దీనికితోడు దర్శకుడు శైలేష్ కొలను ట్రాక్ రికార్డ్ కూడా బాగుంది. ఇలా అన్నీ సెట్ అవ్వడంతో, సంక్రాంతికి సైంధవ్ బాక్సాఫీస్‌ను చించే స్తాడని ఊహించారు చాలా మంది.

కానీ గ్రౌండ్ రియాలిటీ మరోలా ఉంది. అసలు

సైంధవ్ పై చాలామందికి ఫోకస్ లేదనే విషయం ఓపెనింగ్స్‌తో స్పష్టమైంది. ఈ సినిమాకు ఆశించిన స్థాయిలో ఓపెనింగ్స్ రాలేదు. అడ్వాన్స్ బుకింగ్ కూడా మందకొడిగా సాగింది. ఫలితంగా తొలిరోజు సైంధవ్‌కు అటుఇటుగా ఆరున్నర కోట్ల రూపాయల గ్రాస్ (ప్రపంచ వ్యాప్తంగా) మాత్రమే వచ్చింది.



*గుంటూరుకారం* తరహాలోనే *సైంధవ్*‌కు కూడా మొదటిరోజే మిక్స్‌డ్ టాక్ వచ్చేసింది. మరీ ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు వెంకటేష్ సినిమాకు దూర మవ్వడం, పైగా సంక్రాంతి సీజన్‌లో వెనక్కు తగ్గడం ఇదే తొలిసారి. మూవీలో హింసాత్మక సన్నివేశాలు ఎక్కువగా ఉండడం, విలన్ పాత్రతో చెప్పించిన డైలాగులు దీనికి కారణాలు. ఈ టాక్‌తో ఈ సినిమా ఏ మేరకు బాక్సాఫీస్ బండి లాగుతుందనేది ఇప్పుడే చెప్పలేం.

ఓవైపు *గుంటూరుకారం*, *సైంధవ్* సినిమాల పరిస్థితి ఇలా ఉంటుండగానే *నా సామిరంగ* థియేటర్లలోకి వచ్చేసింది. *గుంటూరుకారం* 12న, *సైంధవ్* 13వ తేదీన రిలీజ్ అవ్వగా... *నా సామిరంగ* 14న మార్కెట్లోకి వచ్చింది. నాగార్జున నటించిన ఈ సినిమాపై ఓ మోస్తరుగా అంచనాలుండేవి. దీనికి కారణం సంక్రాంతి బరిలో నాగ్ ట్రాక్ రికార్డ్.

గతంలో *సోగ్గాడే చిన్ని నాయనా* సినిమాతో సంక్రాంతి విన్నర్‌గా నిలిచాడు నాగ్. ఆ తర్వాత *బంగార్రాజు* సినిమాతో మరోసారి సంక్రాంతి అల్లుడు అనిపించుకున్నాడు. ఇప్పుడు *నా సామిరంగా*తో ఆ ఫీట్‌ను రిపీట్ చేయాలని భావించాడు. అందుకే ఏరికోరి సంక్రాంతి డేట్ ఫిక్స్ చేయించుకొని, ఆఘమేఘాల మీద సినిమా షూటింగ్ పూర్తిచేసి మరీ వచ్చేశాడు.

ఇక్కడే మరో సెంటిమెంట్ కూడా ఫాలో అయ్యాడు. ప్రతి సంక్రాంతికి చివరాఖర్లో వచ్చేది నాగార్జున సినిమానే. *సోగ్గాడే చిన్నినాయనా*, *బంగార్రాజు* సినిమాలు అలానే వచ్చాయి. ఇప్పుడు *నా సామిరంగ* కూడా అలానే వచ్చింది. అయితే ఆశ్చర్యంగా ఈ సినిమాకు కూడా నెగెటివ్ టాక్, మిక్స్‌డ్ టాక్ వచ్చేసింది.

మలయాళ సినిమాకు రీమేక్‌గా తీసిన *నా సామి రంగ*లో, కేవలం మాతృక నుంచి లీడ్ రోల్ క్యారెక్టర్‌ను మాత్రమే తీసుకున్నారు. క్యారెక్టరైజేషన్ నుంచి సెటప్ మొత్తం మార్చేశారు. సంక్రాంతి ఫ్లేవర్ అద్దారు. మేకర్స్ చేసిన ఈ మార్పుచేర్పులు సినిమాకు కలిసి రాలేదు. నాగార్జునతో పాటు అల్లరి నరేష్, రాజ్‌తరుణ్ రూపంలో మరో ఇద్దరు హీరోలున్నప్పటికీ జనాలు ‘నా సామిరంగ’ అనలేకపోయారు. కీరవాణి పాటలు క్లిక్ అవ్వకపోవడం మరో మైనస్ అయింది.

ఇలా సంక్రాంతి బరిలో అంచనాలతో వచ్చిన *గుంటూరుకారం*, *సైంధవ్*, *నా సామిరంగ* సినిమాలు మూడింటిపై మిక్స్‌డ్ టాక్ నడుస్తోంది. హనుమాన్ సినిమా ఒక్కటే ఎలాంటి డివైడ్ టాక్ లేకుండా అందరితో బ్లాక్ బస్టర్ అనిపించుకుంది. ఈ సంక్రాంతి విన్నర్ హను-మాన్. ఇందులో ఎవ్వరికీ ఎలాంటి అనుమానం అక్కర్లేదు. ❋

# WE ARE LOOKING

CURIE LEARNING

*learning with the leader ...*

## for FRANCHISEE PARTNERS



Curie Learning is a leading provider of customized after school learning programs for students Pre-K through high school.

**Our Programs:**

- K to Grade 7 Advanced Math & English program
- Specialized coaching for Magnet / Gifted and Talented School Entrance
- SAT / PSAT / ACT Specialized Coaching
- Creative English Writing
- Competitive Math Coaching
- S T E M Programs and other Academic Camps

### OTHER LOCATIONS

| | |
|---|---|
| Gainesville - VA | gainesville.va@curielearning.com |
| Ellicott City - MD | ellicottcity.md@curielearning.com |
| German Town - MD | germantown.md@curielearning.com |
| Edison - NJ | edison.nj@curielearning.com |
| Exton - PA | exton.pa@curielearning.com |
| Cumming - GA | curie.atlanta@gmail.com |
| Frisco - TX | frisco.tx@curielearning.com |
| Troy - MI | troy.mi@curielearning.com |
| Plymouth - MN | plymouth.mn@curielearning.com |
| Richmond - VA | richmond.va@curielearning.com |
| Apex - NC | apexcurie@gmail.com |
| Sunnyvale - CA | sunnyvale.ca@curielearning.com |

To know more about franchisee opportunity write to :

**rao@curielearing.com**

**or call on**

**703 582 0436 or 703 762 6120**

Corporate Centers

HERNDON.VA : herndon.va@curielearning.com
SOUTHRIDING.VA : southriding.va@curielearning.com
ASHBURN.VA : ashburn.va@curielearning.com

www.curielearning.com

**One stop solution for your child's academic needs...**